Pubilshed from Tirupathi
PRGI NO : APTEL/25/A2316

ప్రజాభూమి
ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com




తిరుపతి TIRUPATHI | సంపుటి : 01 Vol.No : 01 | సంచిక : 292 Issue No : 292 | బుధవారం Wednesday | జూలై 8, 2026 8 JULY 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : తెలుగు రాష్ట్రాల్లో రుతుపవనాల జోరు మొదలైంది. పలు ప్రాంతాల్లో వర్షాలు పడుతున్నాయి.

2 లో..



### కేరళ వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి

## ఘోర ప్రమాదం


- క్షణాల్లో ట్యాంకర్, వాహనాలను నెట్టేసిన బురద ప్రవాహం
- ప్రమాదంలో ఐదుగురు మృతి, నలుగురు గల్లంతు

కేరళ : కేరళలోని వయనాడ్ జిల్లాలో ప్రకృతి ప్రకోపానికి పెను ప్రమాదం సంభవించింది. భారీగా కొండచరియలు విరిగిపడటంతో జనజీవనం అతలాకు తలమైంది. రహదారిపై ఉన్న ఒక ఇంధన ట్యాంకర్‌తో పాటు పలు వాహనాలు రెప్పపాటు కాలంలో బురద ప్రవాహంలో కొట్టుకుపోయాయి. ఈ భీకర ఘటనకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

వివరాలు 2లో..

### రైతు కుటుంబాలు ఎంట్రప్రెన్యూర్లుగా ఎదిగేలా

# పారిశ్రామికీకరణ



### ఇథనాల్ ప్రాజెక్టులు ఏర్పాటయ్యేలా ప్రోత్సాహం

- 19వ ఎస్ఐపీబీ సమావేశంలో 11 ప్రాజెక్టులకు ఆమోదం
- రూ.9,076 కోట్ల పెట్టుబడులు
- 10,531 ఉద్యోగాలకు అవకాశం
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన 19వ ఎస్ఐపీబీ సమావేశం

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూర్చేలా, ఎంట్రప్రెన్యూర్లుగా ఎదిగేందుకు దోహదం చేసేలా పారిశ్రామికీకరణ జరగాలని... ఆ దిశగా పెట్టుబడులను ఆకర్షించాలాని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఇందులో భాగంగా భవిష్యత్‌లో పెరిగే ఇథనాల్ డిమాండ్‌ను అందిపుచ్చుకోవాలని చెప్పారు. ఇథనాల్ బ్లెండింగ్ 40 శాతానికి పెంచితే... మొక్కజొన్న రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఇథనాల్ తయారీ రంగంలో వచ్చే అన్ని పెట్టుబడులను ప్రోత్సహించాలన్నారు.

పెట్రోలు, డీజిల్‌లో మిక్స్ చేసేందుకు ఇథనాల్ భారీగా అవసరం కానుందన్నారు. ఇథనాల్, మీథేన్, ఏవియేషన్ ఫ్యూయల్‌కు సంబంధించి పాలసీ తీసుకురావాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. సంపద సృష్టి, సర్క్యులర్ ఎకానమీ అనేది ప్రభుత్వ విధానం అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను పెద్దఎత్తున ప్రోత్సహించాలని నిర్దేశించారు. సచివాలయంలో మంగళవారం 19వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశాన్ని ముఖ్యమంత్రి నిర్వహించారు. ఈ సమావేశంలో మొత్తం 11 ప్రాజెక్టులకు సంబంధించి రూ.9,076.11 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు.దీంతో 10,531 ఉద్యోగాలు రాష్ట్రానికి రానున్నాయి.

వివరాలు 2లో..



## కరూర్ తొక్కిసలాట కేసు

- డీఎంకె పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : కరూర్ తొక్కిసలాట కేసులో డిఎంకె పిటిషన్ విచారణకు సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. టివికె నిందితులు సాక్ష్యులను ప్రభావితం చేసేందుకు యత్నిస్తున్నారన్న డిఎంకె ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆర్.ఎస్.భారతి పిటిషన్‌ను విచారణకు జస్టిస్ కె.వి.విశ్వనాథన్, జస్టిస్ అలోక్ అరథేలతో కూడిన ధర్మాసనం తిరస్కరించింది. "అభ్యర్థి తరపున సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ వాదనలను విన్నాము. అందుబాటులో ఉన్న ఇతరపరిష్కార మార్గాలను అనుసరించడానికి

- మిగతా 2లో..

### టెంపుల్ టూరిజం తరహాలో హస్తకళల

# పర్యాటకం

### గోదావరి పుష్కరాల్లో తోలుబొమ్మలాట ప్రదర్శనలు

- హస్తకళల పరిరక్షణ... కూటమి ప్రభుత్వం బాధ్యత
- కళాకారుల ఆరోగ్య పరిరక్షణకు క్లస్టర్ల వారీగా వైద్య శిబిరాలు
- ప్రతి కళాకారుడికీ గుర్తింపు ఇచ్చే విధంగా చర్యలు
- ప్రతి కళాకృతిపై క్యూఆర్ కోడ్ వేసి కళాకారుడి వివరాలు పొందుపరుస్తాం
- హస్త కళాకారుల కష్టాన్ని ప్రపంచానికి తెలియజేస్తాం
- వీబీ జీ రాం జీ పథకం కింద కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటు
- ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవాన్ని ప్రారంభించిన పవన్ కళ్యాణ్
- స్టాల్స్ సందర్శిస్తూ.. కళాకారులకు భరోసా ఇచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- అన్నా కొణిదల కోసం ఉప్పాడ చీరలు కొనుగోలు చేసిన పవన్ కళ్యాణ్

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ : ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం తరహాలో హస్తకళల పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. కళాఖండాన్ని రూపొందించిన కళాకారుడికి ఆ గుర్తింపు దక్కే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కళాకారుల కష్టాన్ని ప్రపంచానికి పరిచయం చేసే విధంగా ప్రత్యేక డాక్యుమెంటరీలు రూపొందించాలని అధికారులకి దిశానిర్దేశం చేశారు.

వివరాలు 2లో..





### ధవళేశ్వరం బ్యారేజ్‌కు

## కొత్త గేట్లు

- గోదావరి డెల్టా ఆధునీకరణకు చర్యలు
- మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాభూమి ప్రతినిధి, రాజమహేంద్రవరం : గోదావరి డెల్టాకు జీవనాడిగా నిలిచిన ధవళేశ్వరం బ్యారేజ్‌లో మిగిలిన 117 గేట్ల మార్పిడికి రూ.150.09 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంగళవారం ధవళేశ్వరం బ్యారేజ్‌ను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో సుమారు 10 లక్షల ఎకరాలకు సాగునీరు, లక్షలాది మందికి తాగునీటిని అందిస్తున్న ధవళేశ్వరం బ్యారేజ్ రాష్ట్ర వ్యవసాయానికి కీలకమని మంత్రి పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో బ్యారేజ్ నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆయన విమర్శించారు. కేంద్ర జల సంఘం (సిడబ్ల్యూసి) బ్యారేజ్ భద్రతపై హెచ్చరికలు చేసినప్పటికీ అప్పటి ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టలేదని ఆరోపించారు.

- మిగతా 2లో..

### ఎల్-నినో ప్రభావంపై అప్రమత్తంగా

# ఉండాలి



- నేపథ్యంలో నైరుతి రుతుపవనాల సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవాలి
- అన్ని శాఖలు హై అలర్ట్‌లో ఉండాలి
- ప్రజల ప్రాణాలు, జీవనోపాధి పరిరక్షణే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత
- వాతావరణ హెచ్చరికల ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టి 'జీరో లాస్' లక్ష్యంగా పనిచేయాలి
- జిల్లా కలెక్టర్లు వ్యక్తిగతంగా సన్నద్ధత, ప్రతిస్పందన చర్యలను పర్యవేక్షించాలి
- రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : ప్రస్తుతం నెలకొన్న ఎల్-నినో పరిస్థితుల దృష్ట్యా రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల కాలంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు ముందస్తు ప్రణాళికలతో పూర్తి సన్నద్ధతతో పనిచేయాలని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత ఆదేశించారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ప్రఖర్ జైన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి కౌసర్ బానో, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో కలిసి నైరుతి రుతుపవనాల పరిస్థితులు, వర్షపాతం లోటు, కరవు ప్రభావం, విపత్తు నిర్వహణ చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం "జీరో లాస్" లక్ష్యంతో పనిచేస్తోందని, ఏ ఒక్క ప్రాణనష్టం కూడా సంభవించకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. విపత్తులు సంభవించిన తరువాత స్పందించడం కంటే, వాతావరణ అంచనాల ఆధారంగా ముందుగానే చర్యలు చేపట్టడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ప్రత్యేక అధికారులతో 24x7 కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పనిచేసేలా చూడాలని, భారత వాతావరణ శాఖఅందించే వాతావరణ హెచ్చరికల ఆధారంగా క్షేత్రస్థాయిలో

వివరాలు 2లో..

### వేగంగా భోగాపురం

## ఎయిర్‌పోర్టు పనులు

- నిర్ణీత సమయానికి జిఎంఆర్ సంస్థ నిర్మాణాలు
- ప్రధాని చేతుల మీదుగా ఎయిర్‌పోర్ట్ ప్రారంభం
- పనులపై సమీక్షించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాభూమి ప్రతినిధి, విజయనగరం : భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను వేగంగా పూర్తి చేశామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. మంగళవారం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం తుది మెరుగుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ..



2 పేజీలో..



### ప్రజలకు మెరుగైన సేవలను

## అందించడమే లక్ష్యం

### రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్ దిశగా అడుగులు

- పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్
- సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారులకు చేరేందుకు ఉపయుక్తం
- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆన్‌లైన్‌లోనే జీతాలు
- ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశాలు

ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్ :

పరిపాలనలో మరింత పారదర్శకతకు డిజిటల్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు అవసరమైన చట్టాలను రూపొందించాలని ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్ హెఆర్డీలోని బోధి పెవిలియన్ లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు అందించేందుకు వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని అధికారులకు సూచించారు.

2 పేజీలో..

ప్రజాభూమి



## కేరళ వయనాడ్‌లో కొండచరియలు
# విరిగిపడి ఘోర ప్రమాదం

అనక్కంపొయిల్-కల్లాడి టన్నెల్ రోడ్ ప్రాజెక్టు సమీపంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. భూమి ఒక్కసారిగా కుంగిపోవడంతో టన్నుల కొద్దీ మట్టి, రాళ్లు వేగంగా కిందికు దూసుకొచ్చాయి. స్థానికులు చూస్తుండగానే ఈ ఘోరం జరిగిపోయింది. ప్రవాహ ఉద్ధృతికి ట్యాంకర్ సుమారు 100 అడుగుల వరకు కొట్టుకొచ్చింది. అయితే, అందులోని ముగ్గురు సిబ్బంది స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడటం ఊరటనిచ్చే అంశం.ఈ ప్రకృతి వైపరీత్యంలో ఇప్పటివరకు ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురు గల్లంతయ్యారు. సుమారు 10 మంది గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. గత 24 గంటల్లో జిల్లాలో నమోదైన 265 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతమే ఈ విపత్తుకు ప్రధాన కారణమని భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో కార్మికుల నివాసాలు, పలు వాహనాలు శిథిలాల కింద చిక్కుకుపోయాయి. గల్లంతైన వారి ఆచూకీ కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి.

# తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు

ఈ క్రమంలోనే వాతావరణ శాఖ భారీ వర్షాలు కురుస్తాయని పలు ప్రాంతాలకు హెచ్చరికలు చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కాస్తా బలపడి వాయుగుండంగా మారడంతో పాటు నైరుతి రుతుపవనాలు దేశంలో చాలా చురుగ్గా కదులుతున్నాయి.

ఈ డబుల్ ఇంపాక్ట్ వల్ల రాబోయే ఐదు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వాతావరణం పూర్తిగా మారింది. వాతావరణమంతా చల్లబడింది. పలు ప్రాంతాల్లో విస్తారంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం అధికారికంగా ప్రకటించింది.

# కరూర్ తొక్కిసలాట కేసు

ఈ పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని కోరుతున్నారు. ఈ నిబంధనల ప్రకారం.. ఉపసంహరించుకున్న దరఖాస్తుగా ఈ పిటిషన్‌ను కొట్టివేస్తున్నాము'' అని ధర్మాసనం పేర్కొంది. కరూర్ ఘటనపై దర్యాప్తును ఇప్పటికే సిబిఐకి బదిలీ చేసిన తర్వాత, బహిరంగ ప్రకటనలు, ఇతర చర్యలపై ఆంక్ష?లు విధించాలని కోరుతూ రాజకీయ ప్రత్యర్థి దాఖలు చేసిన అభ్యర్థనను కోర్టు ఎలా పరిగణనలోకి తీసుకుంటుందని విచారణ సందర్భంగా ధర్మాసనం ప్రశ్నించింది.

## వేగంగా భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జీఎంఆర్‌తో కలిసి బ్రహ్మాండమైన ఎయిర్‌పోర్టును నిర్మించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇక్కడికి వచ్చారని.. అనుకున్న సమయానికంటే ముందుగానే నిర్మాణం చేపట్టాలని ఆదేశించారని అన్నారు. ఆ ఆదేశాలు మేరకు అనుకున్న సమయానికే జీఎంఆర్ సంస్థ ఎయిర్‌పోర్టును నిర్మించిందని చెప్పారు. ఎయిరో డ్రో లైసెన్స్ కూడా వచ్చిందని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. ఎయిర్‌పోర్టు ప్రారంభమైన వారం తర్వాత ఆపరేషన్స్ నిర్వహిస్తామన్నారు. మోదీ షెడ్యూల్ ఖరారైన తర్వాత తేదీ ప్రకటిస్తామని కేంద్ర మంత్రి వెల్లడించారు. విశాఖ ఎయిర్‌పోర్టు కార్యకలాపాలను భోగాపురానికి తరలిస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో 4 కోట్ల మంది ప్రయాణించే విధంగా టెర్మినల్ నిర్మాణం జరుగుతుందన్నారు. 78,000 చదరపు మీటర్ల మేర టెర్మినల్ బిల్డింగ్ నిర్మించామని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు.. దేశంలోనే బెస్ట్ ఎయిర్‌పోర్టు డిజైన్‌గా ఉందని కితాబిస్తున్నారని అన్నారు. ఉత్తరాంధ్ర కళలు, సాంప్రదాయాన్ని ఉట్టిపడేలా ఇంటీరియర్ డిజైన్ చేపట్టినట్లు చెప్పారు. దేశంలోనే అత్యంత బెస్ట్ ఎయిర్‌పోర్ట్‌గా భోగాపురం నిలవనుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# ధవళేశ్వరం బ్యారేజ్‌కు కొత్త గేట్లు

2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రూ.31.77 కోట్లతో మొత్తం 175 గేట్లలో 58 గేట్లను మార్చినట్లు తెలిపారు. ప్రస్తుతం మిగిలిన 117 గేట్ల మార్పిడికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.150.09 కోట్లను మంజూరు చేశారని చెప్పారు. గోదావరి డెల్టా సమగ్ర ఆధునీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, డిపిఆర్ తయారీకి రూ.13.4 కోట్లను కేటాయించి లైడార్ సర్వేను పూర్తి చేసినట్లు వెల్లడించారు. డిపిఆర్ సిద్ధమైన వెంటనే ఆధునీకరణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజ్ గేట్ల పునర్నిర్మాణ పనులను ఈ వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

## ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యం

రాష్ట్రంలో పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేస్తూ 'డిజిటల్ గవర్నెన్స్' దిశగా చట్టాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు చేర్చేందుకు ఈ విధానం ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 4800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా.. ఇందులో 4300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వం సీరియస్ గా ఉందని, అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్ తో సమస్యకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటి నుంచి 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందన్నారు. అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని తెలిపారు. ఇందుకు వివిధ విభాగాల అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ 100 రోజుల్లో ఈ అంశాన్ని కొలిక్కి తీసుకు రావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిలైజ్ చేయాలన్నారు. నిరంతరం మానీటరింగ్ చేసేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, హెచ్ఆర్డి వైస్ చైర్మన్ శాంతి కుమారి, వేతన సవరణ కమిషనర్ ఎన్. శివ శంకర్,ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా విభాగం కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# టెంపుల్ టూరిజం తరహాలో హస్తకళల పర్యాటకం

విబి జీ రాం జీ పథకం కింద క్లస్టర్లవారీగా కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. హస్తకళల పరిరక్షణకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. హస్తకళాకారుల ఆరోగ్య పరిరక్షణకు క్లస్టర్ల వారీగా నిరంతరం వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ (లేపాక్షి) ఏర్పాటు చేసిన 'ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవం 2026'ను పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. మంగళవారం విజయవాడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళా వేదికలో ఏర్పాటు చేసిన ఈ మహోత్సవంలో రాష్ట్ర నలుమూలల నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ హస్త కళాకారులు ఉత్పత్తి చేసిన కళా రూపాలను ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా తోలుబొమ్మలాట కళాకారులు ప్రదర్శించిన రామాయణంలోని రావణ సంహార ఘట్టాన్ని తిలకించారు. సతీమణి అన్నా కొణిదల కోసం ఉప్పాడ జాందానీ చీరలు కొనుగోలు చేశారు. ప్రతి స్టాల్ ను సందర్శిస్తూ, హస్తకళా ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ కళాకారులకు తనవంతు ప్రోత్సాహం అందించారు. కళాకారులతో మమేకమవుతూ, వారి నైపుణ్యాన్ని అభినందించారు. కళాకారుల సాధకబాధకాలు అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కళాకారుల కోరిక మేరకు క్లస్టర్ల వారీగా గ్రూపు ఫోటోలు దిగారు. మన రాష్ట్రానికే సొంతమైన హస్తకళల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు.

**తోలుబొమ్మలాటలో ఆకట్టుకున్న రావణ సంహార ఘట్టం :** ఆంధ్రప్రదేశ్ హస్తకళా మహోత్సవంలో మొదటి అడుగుగా కాకినాడకు చెందిన తోలుబొమ్మల కళాకారులు ఏర్పాటు చేసిన స్టాల్ ను పవన్ కళ్యాణ్ సందర్శించారు. సనాతన ధర్మ ఔన్నత్యాన్ని తెలియజేసే విధంగా రూపొందించిన రామాయణ, భారత, భాగవత కళారూపాలను పవన్ కళ్యాణ్ పరిశీలించారు. తోలుబొమ్మలాట కళాకారులు ప్రదర్శించిన రావణ సంహార ఘట్టం అందర్నీ ఆకట్టుకుంది. తరతరాలుగా తోలుబొమ్మలాటను నమ్ముకుని జీవనాధారం సాగిస్తున్న తమ కుటుంబాలు, నేడు అంతర్జాతీయ స్థాయి ప్రదర్శనలు ఇచ్చే స్థితికి చేరుకున్నట్టు కళాకారులు వివరించారు. తోలుబొమ్మలాట ఔన్నత్యాన్ని చాటేలా రాబోయే గోదావరి పుష్కరాల్లో తోలుబొమ్మలాట ప్రదర్శన ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం ఉప్పాడ చీరల స్టాల్ ని పవన్ కళ్యాణ్ సందర్శించారు. మూడు ఉప్పాడ జాందానీ పట్టు చీరలను సతీమణి అన్నా కొణిదల కోసం, తన కోసం కొన్ని వస్త్రాలు కొనుగోలు చేశారు. అరటిపీచుతో తయారు చేసిన హ్యాండ్ బ్యాగులు, ఫైల్స్ తదితర పర్యావరణహిత ఉత్పత్తులను ఆసక్తిగా తిలకించారు. తయారీ విధానాన్ని కళాకారులను అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి హ్యాండ్ బ్యాగ్ కొనుగోలు చేశారు.

**స్టాల్స్ సందర్శిస్తూ.. సాధకబాధకాలు తెలుసుకుంటూ...** తిరుపతి వుడ్ కార్వింగ్ కళాకారులు రూపొందించిన చెక్క బొమ్మల స్టాల్ ను సందర్శించి, అద్భుత కళా ఖండాలను మలచిన కళాకారులను ప్రశంసించారు. వారి నుంచి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ప్రతిమను కొనుగోలు చేశారు. శ్రీకాళహస్తి కలంకారి వస్త్రాల స్టాల్లో పెన్ కలంకారీ ఆర్ట్ తో రూపొందించిన వస్త్రాలు, దుప్పట్లు పవన్ కళ్యాణ్ ని ఆకట్టుకున్నాయి. కలంకారీ చేనేత కళాకారుల కష్టం ప్రతి ఒక్కరు తెలుసుకునేలా వీడియో డాక్యుమెంటరీలు రూపొందించాలని అధికారులకు సూచించారు. పెడన కలంకారీ స్టాల్ సందర్శనలో తమకు ప్రభుత్వం నుంచి ఇండిగో కలర్స్, కామన్ ఫెసిలిటీ సెంటర్ల ప్రస్తావన రాగా సౌకర్యాల కల్పనకు భరోసా ఇచ్చారు. నరసాపురం లేస్ స్టాళ్లు సందర్శించిన సందర్భంలో వారికి వస్తున్న ఆరోగ్య సమస్యలను కళాకారులు ప్రస్తావించారు. కళాకారుల ఆరోగ్య పరిరక్షణ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఉపముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. క్లస్టర్ల వారీగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు.

**మన కళలకి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెస్తాం :** బ్యాటరీ సహాయం లేకుండా నడిచే సైంటిఫిక్ చెక్క బొమ్మల స్టాల్ పవన్ కళ్యాణ్ ని ఆకట్టుకుంది. చెక్కతో చేసిన టెలీస్కోప్ తదితర ఉత్పత్తులను ఆసక్తిగా తిలకించారు. పంచాయతీల పరిధిలో ఉన్న ప్రతి స్కూల్లో ఈ సైంటిఫిక్ బొమ్మలు ఏర్పాటు చేయాలని సూచించారు. గిరిజన సవర కళాకారులు ఏర్పాటు చేసిన స్టాల్ లో సుదీర్ఘ సమయం గడిపారు. సంప్రదాయ సవర కళలో పురాణ కథలు, జాతీయ నాయకుల చిత్రాలతో కూడా రూపొందించాలని సూచన చేశారు. ఒక కళాఖండాన్ని తయారు చేసిన కళాకారుడికి గుర్తింపు దక్కే విధంగా ప్రతి ఆర్ట్ మీద ప్రత్యేక క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి, అందులో కళాకారుడి పేరు, అతను రూపొందించిన కళకి సంబంధించిన స్టోరీ అందులో పొందుపర్చాలని అధికారులకి సూచించారు. మన కళలకి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు దక్కాలని, జపాన్ తరహాలో ఆర్టిస్టులను గౌరవించాలని సూచించారు. సవర కళాకారుల కోసం విబి జీ రాం జీ పథకం కింద ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నరసాపురం లేస్ కళాకారులు కళ్లకు ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. అలాగే చేనేతలకు కండరాలు, ఎముకలు, శ్వాసకోశ వ్యాధులు వస్తాయి. కలంకారీలకు శ్వాసకోశ వ్యాధులు వస్తాయి. ప్రతి కళాకారుడు ఏకాగ్రతతో ఆ కళను మలిచే క్రమంలో వచ్చే ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి. హస్త కళాకారుల ఆరోగ్య పరిరక్షణకు క్లస్టర్ల వారీగా చర్యలు చేపట్టాలని పవన్ కళ్యాణ్ సూచించారు.అనంతరం మన హస్తకళలకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇస్తున్న ప్రాధాన్యతను, కల్పిస్తున్న ప్రచారాన్ని తెలియబర్చే విధంగా ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీ ఆయన్ను ఆకట్టుకుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ , హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తదితర ప్రముఖులను కలసిన సందర్భంలో పవన్ కళ్యాణ్ అందజేసిన కళారూపాలకు సంబంధించిన ఫోటోలు వివరాలతో సహా గ్యాలరీలో ప్రదర్శించారు. ఈ గ్యాలరీ ఉపముఖ్యమంత్రివర్యులను ఆకట్టుకుంది. వివిధ క్లస్టర్ల నుంచి మహోత్సవానికి వచ్చిన హస్త కళాకారులతో గ్రూపు ఫోటోలు దిగారు. హస్తకళల అభివృద్ధి దిశగా తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఏలూరు కార్పెట్ కళాకారులు, అనంతపురం అరటి పీచు కళాకారుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం కింద 30 మంది చొప్పున కళాకారులను ఎంపిక చేసి వారికి రెండు నెలల పాటు శిక్షణ అందిస్తారు. గుంటూరు, కాకినాడల్లో పునరుద్ధరించిన లేపాక్షి షోరూంలు, రాజమహేంద్రవరం విమానాశ్రయంలో నూతనంగా ఏర్పాటు చేసిన షోరూంను వర్చువల్ గా ప్రారంభించారు.

**లేపాక్షి ఈ కామర్స్ యాప్ ఆవిష్కరణ :** హస్తకళా మహోత్సవం వేదిక నుంచి లేపాక్షి ఈ కామర్స్ యాప్ ను పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు. ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్ తో పాటు యాపిల్ యాప్ స్టోర్ లోనూ అందుబాటులో ఉంటుంది. ఈ యాప్ ద్వారా మన రాష్ట్ర హస్తకళా ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్త మార్కెటింగ్ అవకాశాలు దక్కనున్నాయి. దీంతో పాటు రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివిధ క్లస్టర్లలో ఏర్పాటు చేసిన 100 ఉద్యమ్ వర్క్ షాపులను ప్రారంభించారు. 2 వేల మంది కళాకారులను అధికారిక పారిశ్రామిక వ్యవస్థలోకి తీసుకురావడం లక్ష్యంగా ఈ వర్క్ షాపులను నిర్వహిస్తున్నారు. అనంతరం సంప్రదాయ హస్తకళల పరిరక్షణ, ప్రచారంలో విశేష కృషి చేసిన పలువురిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళి, వస్త్ర పరిశ్రమల శాఖ మంత్రి ఎస్. సవిత విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ , రాష్ట్ర చేనేత, హస్తకళల విభాగం సలహాదారు సుచిత్ర ఎల్లా , హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ , పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ కళ్యాణం శివశ్రీనివాస్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి, అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు , పీసీసీఎఫ్ పి.వి. చలపతిరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ , ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైతు కుటుంబాలు ఎంట్రప్రెన్యూర్లుగా ఎదిగేలా పారిశ్రామికీకరణ

**మొదటి పేజీ తరువాయి**

**100 ఎక్స్‌పీరియన్స్ సెంటర్ల ఏర్పాటు లక్ష్యం**

'పర్యాటకరంగంలో అపార అవకాశాలు ఉన్నాయి. తిమ్మమ్మ మర్రిమాను సహా రాష్ట్రవ్యాప్తంగా 100 టూరిస్ట్ స్పాట్‌ల దగ్గర ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. పోలవరం, దిండి, గండికోట, కంబం చెరువు, లంబసింగి లాంటి ప్రాంతాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి. లంబసింగి, అరకు సమీపంలో రిసార్ట్ ఏర్పాటుకు జిందాల్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేస్తోంది. ఏటికొప్పాక, కొండపల్లి , ధర్మవరం, మంగళగిరి, ఉప్పాడ, పొందూరు కళారూపాల్ని కూడా తీర్చిదిద్దాలి. ఇందుకోసం వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలి. నేచర్, వాటర్, అమ్యూజ్మెంట్ పార్కులను అనుసంధానించాలి. సూర్యలంక మాస్టర్ ప్లాన్ త్వరితగతిన రూపొందించాలి. కుప్పంలో కంగుంది కోట, చిత్తూరు జిల్లాలో ఎలిఫెంట్ సఫారీ వంటివి అభివృద్ధి చేయాలి. ముఖ్యంగా పర్యాటక రంగం నుంచి జీఎస్‌డీపీకి వాటా పెరిగేలా చూడాలి.' అని ముఖ్యమంత్రి చెప్పారు. మరోవైపు రాష్ట్రంలో పర్యాటకరంగ అభివృద్ధికి అవసరమైన హోటల్ గదులు పెద్దఎత్తున వస్తున్నాయని సీఎం అన్నారు. 2024లో 4,390 హోటల్ రూములు ఉంటే... ఈ రెండేళ్లలో 9,364 హోటల్ రూముల నిర్మాణానికి అనుమతులు ఇచ్చామన్నారు. దీంతో రాష్ట్రంలో 13,753 హోటల్ రూములు అందుబాటులోకి వస్తుండగా... దీనికి కృషి చేసిన అధికారులకు సీఎం అభినందనలు తెలిపారు.

**సోలార్ సెల్స్ తయారీలో అగ్రగామి కావాలి**

రెన్యువబుల్ ఎనర్జీ విస్తృతం కావడంతో సోలార్ సెల్స్ తయారీ పరిశ్రమలను ఆహ్వానించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. సోలార్ సెల్స్‌లో ఏపీ అగ్రగామిగా నిలవాలన్నారు. ఇంకా ఏర్పాటు చేయాల్సిన 38 ఎంఎస్ఎంఈ పార్కులను త్వరితగతిన ప్రారంభించాలని నిర్దేశించారు. రైల్వే టెర్మినల్స్‌కు ఎంఎస్ఎంఈ పార్కులను ఇంటిగ్రేట్ చేయాలన్నారు. లాజిస్టిక్స్ యూనివర్సిటీ, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లతో యువతకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటయ్యే పరిశ్రమలకు గ్రీన్ ఎనర్జీ వినియోగించేలా చూడాలన్నారు. బీపీసీఎల్, ఆమ్కా ప్రాజెక్టులు త్వరగా గ్రౌండింగ్ అయ్యేలా సంప్రదింపులు జరపాలన్నారు. రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశానికి మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, గొట్టిపాటి రవికుమార్, దుర్గేష్, సీఎస్ సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఎల్-నినో ప్రభావం పై అప్రమత్తంగా ఉండాలి

తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర అత్యవసర కార్యకలాపాల కేంద్రం నుంచి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ-ఘాణపిూ ద్వారా జ్యూ, ఝమీ, వాట్సాప్, సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా వంటి అన్ని వేదికల ద్వారా వాతావరణం, వరదలు, పిడుగులకు సంబంధించిన హెచ్చరికలను ప్రజలకు వేగంగా చేరవేయాలని సూచించారు. నైరుతి రుతుపవనాల కోసం రూపొందించిన ప్రామాణిక కార్యాచరణ విధానాలను అన్ని శాఖలు కచ్చితంగా అమలు చేయాలని, ప్రతిరోజూ చేపట్టిన సన్నద్ధత చర్యలపై సమర్పించాలని మంత్రి ఆదేశించారు. జిల్లా యంత్రాంగం, పోలీసు, రెవెన్యూ, ఫైర్ సర్వీసులు, జలవనరులు, ఆరోగ్యం, విద్యుత్, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలు సహా అన్ని శాఖలు నిరంతర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

**కరవు పరిస్థితులపై ప్రత్యేక దృష్టి..** ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశమున్నందున 688 మండలాల్లో 105 మండలాలు తీవ్రంగా, 208 మండలాలు మధ్యస్థ స్థాయిలో ప్రభావితమయ్యే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా శ్రీ సత్యసాయి, అనంతపురం, అన్నమయ్య జిల్లాలు తీవ్ర ప్రభావానికి గురయ్యే అవకాశముండగా, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, వైఎస్సార్ కడప, తిరుపతి, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో మధ్యస్థ స్థాయి ప్రభావం ఉండే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ శాఖ రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యామ్నాయ విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. డైరెక్ట్ సీడెడ్ రైస్ సిస్టమ్ ఆఫ్ రైస్ ఇంటెన్సిఫికేషన్ నమూనాల అమలును ప్రోత్సహించాలని, గ్రామ స్థాయిలో వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు అందించాలని సూచించారు. ఉద్యానవన శాఖ తేమ కొరత వల్ల నష్టపోయే తోటలను రక్షించే చర్యలు చేపట్టాలని, డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్ వంటి పద్ధతులను ప్రోత్సహించాలని ఆదేశించారు.

**పశుసంవర్ధక, మత్స్య, తాగునీటి సరఫరాపై ప్రత్యేక చర్యలు..**పశుసంవర్ధక శాఖ పశుగ్రాసం, దాణా, తాగునీటి ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయడంతో పాటు పశువైద్య సేవలను బలోపేతం చేయాలని మంత్రి సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించే పశువైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.మత్స్యశాఖ సముద్ర వాతావరణ హెచ్చరికలను ప్రతి మత్స్యకార గ్రామానికి సకాలంలో చేరవేయాలని, సముద్రం అల్లకల్లోలంగా ఉన్న సమయంలో చేపల వేటను పూర్తిగా నిలిపివేయాలని సూచించారు. ప్రతి చేపల వేట పడవలో భద్రతా పరికరాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.గ్రామీణ నీటి సరఫరా శాఖ సమస్యాత్మక గ్రామాల్లో నిరంతరాయంగా తాగునీటి సరఫరా జరిగేలా చూడాలని, పనిచేయని పథకాలను 48 గంటల్లో పునరుద్ధరించాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ కార్యాచరణ సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

**పట్టణాలు, గ్రామాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి...**పంచాయతీరాజ్ శాఖ గ్రామాల డ్రైన్లు, కాలువలు, చెరువుల పూడికతీత పనులను పూర్తి చేయాలని, గ్రామస్థాయి విపత్తు నిర్వహణ కమిటీలను చురుకుగా పనిచేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ పరిపాలన శాఖ పట్టణాల్లో వర్షపు నీటి కాలువల పూడికతీత పనులు వెంటనే పూర్తి చేసి, డీ-వాటరింగ్ పంపులు, అత్యవసర యంత్రాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. పట్టణాల్లో నీటిమునిగే పరిస్థితులు రాకుండా నిరంతర పర్యవేక్షణతో పాటు దోమల నివారణ చర్యలు, సురక్షిత తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.

**జలవనరులు, విద్యుత్, రోడ్ల నిర్వహణపై ఆదేశాలు...**జలవనరుల శాఖ రిజర్వాయర్లు, నదుల నీటిమట్టాలను 24 గంటలూ పర్యవేక్షించాలని, బలహీనమైన గండ్లు, కరకట్టలు బలోపేతం చేయాలని, దిగువ ప్రాంతాలకు ముందుగానే వరద హెచ్చరికలు జారీ చేయాలని ఆదేశించారు. రోడ్లు & భవనాల శాఖ దెబ్బతిన్న రహదారులను అత్యవసరంగా పునరుద్ధరించాలని, జేసీబీలు, క్రేన్లు, ఇతర అత్యవసర పరికరాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎనర్జీ శాఖ ఆసుపత్రులు, తాగునీటి పథకాలు, కీలక మౌలిక సదుపాయాలకు నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ అంతరాయం ఏర్పడిన వెంటనే పునరుద్ధరణ చేపట్టాలని ఆదేశించారు.

**ఆరోగ్యం, అత్యవసర సేవలు సిద్ధంగా ఉండాలి...**వైద్య ఆరోగ్య శాఖ మందులు, ఫ్లూయిడ్స్, అత్యవసర వైద్య సామగ్రి తగినంతగా నిల్వ ఉంచాలని, అంబులెన్సులు, ర్యాపిడ్ మెడికల్ బృందాలను సిద్ధంగా ఉంచాలని మంత్రి సూచించారు. నీటి ద్వారా, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని ఆదేశించారు. పోలీసు, అగ్నిమాపక, బృందాలు 24 గంటలూ అత్యవసర స్పందనకు సిద్ధంగా ఉండాలని, వరదలకు గురయ్యే జిల్లాల్లో రక్షణ బృందాలు, పడవలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, రక్షణ పరికరాలు ముందుగానే మోహరించాలని సూచించారు. మాక్ డ్రిల్లులు నిర్వహించి శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు.

**విపత్తు ఉపశమన చర్యలు - నిధుల విడుదల..** రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి కింద 2025--26 ఆర్థిక సంవత్సరంలో రూ.277.63 కోట్లు, 2026--27 ఆర్థిక సంవత్సరంలో రూ.479.01 కోట్లు విడుదల చేసినట్లు సమావేశంలో వివరించారు. 2024 జూన్ 1 నుంచి 2026 జూన్ 30 వరకు పిడుగుపాటు వల్ల మరణించిన 141 మంది కుటుంబాలకు రూ.5.61 కోట్లు ఎక్స్‌గ్రేషియా, పశువుల నష్టానికి రూ.30.81 లక్షలు ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు. రాష్ట్ర విపత్తు ఉపశమన నిధి కింద దీర్ఘకాలిక ఉపశమన ప్రాజెక్టులకు రూ.521.17 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇటీవల రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో అదనంగా రూ.83.70 కోట్లు ఆమోదించినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వానికి చీణవీఖీ కింద రూ.531.33 కోట్ల విలువైన ప్రాజెక్టు ప్రతిపాదనలు సమర్పించినట్లు అధికారులు వివరించారు.

**యువ ఆపదమిత్ర పథకం...** రాష్ట్రంలో కమ్యూనిటీ ఆధారిత విపత్తు నిర్వహణను బలోపేతం చేసే లక్ష్యంతో ఈ ఏడాది 1,214 మంది యువ ఆపదమిత్ర వాలంటీర్లకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇందులో 1,114 మంది చీజజ, 100 మంది చీూ వాలంటీర్లు ఉన్నారు. అదనంగా 52 మంది మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇచ్చామని, జూలై--సెప్టెంబర్ 2026 మధ్య చిత్తూరు, తిరుపతి, వైఎస్సార్ కడప జిల్లాల్లో మరో 300 మంది చీజజ వాలంటీర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సమావేశం ముగింపులో మంత్రి మాట్లాడుతూ నైరుతి రుతుపవనాల కాలం ముగిసే వరకు ప్రతి శాఖ హై అలర్ట్‌లో ఉండాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు సన్నద్ధత, ప్రతిస్పందన చర్యలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని, ప్రజల ప్రాణాలు, జీవనోపాధి రక్షణతో పాటు అత్యవసర సేవలను వేగంగా పునరుద్ధరించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సకాలంలో ముందస్తు హెచ్చరికలు, సమర్థవంతమైన ప్రతిస్పందన, వేగవంతమైన పునరుద్ధరణ ద్వారా విపత్తుల ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొంటూ, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు.

**వర్షపాతం లోటుపై ఆందోళన...**ఈ సందర్భంగా అధికారులు రాష్ట్రంలో వర్షపాతం పరిస్థితులపై వివరించారు. జూన్ నెలలో రాష్ట్రంలో -25 శాతం వర్షపాతం లోటు నమోదవగా, జూలై నెలలో ఇప్పటివరకు -41 శాతం లోటు నమోదైందని తెలిపారు. ప్రస్తుత అంచనాల ప్రకారం జూన్ నుంచి నవంబర్ వరకు కొనసాగే నైరుతి రుతుపవనాల సీజన్ మొత్తం -27 శాతం వర్షపాతం లోటుతో ముగిసే అవకాశం ఉందని వెల్లడించారు.

బృందం ఈ సవరించిన అంచనాలను వ్యవసాయ శాఖకు వివరించగా, రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 1,161 రైతు సేవా కేంద్రాలను అధిక ముప్పు ఉన్న కేంద్రాలుగా గుర్తించినట్లు తెలిపారు. అలాగే సమగ్ర పంపింగ్ ప్రణాళికకు మద్దతుగా పోలవరం వద్ద రాబోయే నీటి ప్రవాహాలు, శ్రీశైలం వద్ద నీటి లభ్యతపై అంచనాలు సిద్ధం చేయడానికి మీతో కలిసి పనిచేస్తున్నట్లు, కాలువలు, ఆయకట్టు నీటి నిర్వహణ కోసం రూపొందించిన వ్యవస్థల్లో అమలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. ఈ సమీక్ష సమావేశంలో విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్, పురపాలక ఁ పట్టణ అభివృద్ధి శాఖ డైరెక్టర్ సంపత్ కుమార్, బెటాలియన్ కమాండంట్ ప్రసన్న కుమార్, రాజకుమారి,డైరెక్టర్ ఫైర్ సర్వీసేస్ మురళీ మోహన్, ఏపిఎస్డీఎంఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కౌసర్ బానో, ఏవో రవి కుమార్, సిబివో రామాయణపు తనూజ తో పాటు పలు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఆగష్టు 13 నుండి విజయవాడ టూ వారణాసి, కోల్‌కతా నగరాలకు

# కొత్త ఇండిగో విమాన సర్వీసులు ప్రారంభం

**విజయవాడ క్యాంపు కార్యాలయంలో మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ**

**వారానికి మూడు రోజులు సేవలు**

**పర్యాటక, వ్యాపార రంగాల అభివృద్ధికి కొత్త విమాన సర్వీసులు దోహదపడతాయి: మంత్రి కందుల దుర్గేష్**

విజయవాడ ప్రజాభూమి ప్రతినిధి

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ ప్రయా ణికులకు ఇండిగో ఎయిర్‌లైన్స్ సరికొత్త శుభవార్త అందించింది. ఆగస్టు 13, 2026 నుండి విజయవాడను ఆధ్యాత్మిక నగరమైన వారణాసి, మరి యు చారిత్రక నగరమైన కోల్‌కతాతో అనుసంధానిస్తూ విజయవాడ నుండి కొత్త విమాన సర్వీసులను ప్రారంభించను న్నట్లు ఇండిగో సేల్స్ ప్రతినిధులు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన అధికారిక పోస్టర్‌ను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా విజయవాడ నుండి వారణాసి, కోల్‌కతా నగరాలకు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభం కావడం పట్ల మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సర్వీసులు ప్రయాణి కులకు ఎంతో సమయాన్ని ఆదా చేయడమే కాకుండా, పర్యాటక, వ్యాపార రంగాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.వారంలో నిర్ణీత రోజులలో (మంగళ, గురు, శనివారాల్లో) ఈ సర్వీసులు అందుబాటులో ఉంటాయని ఇండిగో ప్రతినిధులు పేర్కొన్నారు.వివరాల్లోకి వెళ్తే 6E 6502 నెంబర్ గల ఫ్లైట్ సాయంత్రం 6.20 కి విజయవాడ ఎయిర్పోర్ట్ నుండి ప్రారంభమై రాత్రి 8:15 గం. లకు వారణాసి చేరుతుందన్నారు.. అంతకుముందు 6E 6501 నెంబర్ గల ఇండిగో ఫ్లైట్ వారణాసి నుండి సాయంత్రం 3.55 కు బయలుదేరి సాయంత్రం 5.50 కి విజయవాడ చేరుకుంటుందని మంత్రి దుర్గేష్ తెలిపారు..అదే విధంగా 6E 6502 నెంబర్ గల ఫ్లైట్ విజయవాడ నుండి సాయంత్రం 6.20 కి ప్రారంభమై వయా వారణాసి మీదుగా రాత్రి 10.15 గం. లకు కలకత్తా చేరుతుందని తెలిపారు..మరియు 6E 6501 నెంబర్ గల ఫ్లైట్ మధ్యాహ్నం 2.10 గం.లకు కలకత్తా నుండి బయలుదేరి వారణాసి మీదుగా సాయంత్రం 5.50 గం. లకు విజయవాడ చేరుతుందన్నారు..కార్యక్రమంలో ఏపీ సేల్స్ మేనేజర్ మోహిత్ కృష్ణ, విజయవాడ అసిస్టెంట్ మేనేజర్ (ఆపరేషన్స్) సుభాని పాల్గొన్నారు.





# అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలి

**జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**

**ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై అవగాహన**

**సహాయం కోసం మీ బిఎల్ఓ లను సంప్రదించాలి**

**పెనమలూరులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం**

ప్రజాభూమి బ్యూరో కృష్ణ జిల్లా

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పూర్తిగా నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నా మని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా రాజకీయ పార్టీలు, బూత్ స్థాయి ఏజెంట్లు, ప్రజలు సమష్టిగా సహకరించా లని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పిలుపునిచ్చారు.మంగళవారం ఉదయం పెనమలూరు మండలంలోని ఎంపీడీవో కార్యాల యంలో పెనమలూరు నియోజకవర్గానికి చెందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సమగ్రంగా అవగాహన కల్పించారు.ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎలాంటి పక్షపాతం లేకుండా పూర్తిగా పారదర్శకంగా సర్ కార్యక్రమం కొనసాగుతోం దన్నారు. ఈ ప్రక్రియపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, సందేహాలు ఉంటే ఈఆర్వో, ఏఈఆర్వో లేదా తనను నేరుగా సంప్రదించవ చ్చని సూచించారు.సాధారణంగా జిల్లా స్థాయిలోనే సమావేశాలు నిర్వహించినప్పటికీ, ఈసారి నియోజకవర్గ స్థాయిలోనే రాజకీయ పార్టీలతో నేరుగా సమావేశమవుతున్నామని తెలిపారు. దీనివల్ల రాజకీయ పార్టీల్లో విశ్వాసం పెరగడంతో పాటు, వారి సందేహాలను నివృత్తి చేసి ప్రక్రియను మరింత సమర్థవంతంగా అమలు చేయడం సాధ్యమవుతుందన్నారు. పెనమలూరుతో ప్రారంభించి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఇటువంటి సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలోని ప్రతి ఓటరుకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తున్నారని, తిరిగి వచ్చిన ఫారాల ఆధారంగా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా రూపొందుతుందని చెప్పారు. ఫారం తిరిగి




అందని వారి పేర్లు డ్రాఫ్ట్ జాబితాలో ఉండవని స్పష్టం చేశారు. అందువల్ల ప్రతి అర్హుడైన ఓటరు తప్పనిసరిగా ఫారం నింపి తిరిగి ఇవ్వాలని కోరారు.గ్రామీణ ప్రాంతాల్లో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ సజావుగా జరుగుతు న్నప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో అద్దె ఇళ్లలో నివసించడం, తరచూ నివాసం మారడం, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల్లో ప్రవేశానికి పరిమితులు ఉండడం, ఉద్యోగాల నిమిత్తం ఇంట్లో ఎవరూ అందుబా టులో లేకపోవడం వంటి కారణాలతో బీఎల్ఓ లకు ఫారాల సేకరణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ఇటువంటి పరిస్థితులను అధిగ మించేందుకు పొరుగువారి ద్వారా సమా చా రం సేకరించడం, అపార్ట్‌మెంట్ సంఘాలతో సమన్వయం చేసుకోవడం వంటి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు నియమించిన బూత్ స్థాయి ఏజెంట్లు (బిఎల్ఏ)చురుకుగా వ్యవహరించి ఓటర్లకు అవగాహన కల్పించాలని, ఫారాలు సకాలంలో బీఎల్ఓలకు అందేలా సహకరించా లని విజ్ఞప్తి చేశారు. ఇది ఎన్నికల సంఘం ఒక్కదాని బాధ్యత మాత్రమే కాదని, ప్రజాస్వా మ్యాన్ని బలోపేతం చేసే ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు.తాత్కాలికంగా ఇతర ప్రాంతాలు లేదా విదేశాల్లో ఉన్న ఓటర్లు కూడా ఆన్‌లైన్ ద్వారా ఎన్యూమరేషన్ ఫారం సమర్పించే అవకాశం ఉందని తెలిపారు. ఈసీఐ నెట్ యాప్‌లో "బుక్ ఎ కాల్ విత్ బీఎల్ఓ" సదుపా యాన్ని ఉపయోగిస్తే సంబంధిత బీఎల్ఓ స్వయం గా ఫోన్ చేసి సహాయం చేస్తారని చెప్పారు. అదేవిధంగా ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ల ద్వారా కూడా అవసరమైన సహాయం పొందవచ్చన్నారు. అబ్సెంట్, షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్ కేటగిరీలకు సంబంధించిన జాబితాలను ఇప్పటికే బూత్ స్థాయి ఏజెంట్లకు అందజేశామని తెలిపారు.



రాజకీయ పార్టీలు ఆ జాబితాలను పరిశీలించి, సంబంధిత ఓటర్లను సంప్రదించి అవసరమైన ఫారాలు సమర్పించేలా సహకరించాలని కోరారు.డేటా మ్యాపింగ్‌కు సంబంధించి కొన్ని కేసుల్లో సాంకేతిక కారణాల వల్ల మ్యాపింగ్ జరగకపోయినా, ఎన్నికల సంఘం మార్గదర్శ కాల ప్రకారం నోటీసులు జారీ చేసి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. 1987కు ముందు, 1987 నుంచి 2004 మధ్య, 2004 తర్వాత జన్మించిన వారి విషయంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం అవసరమైన పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని వివరిం చారు. కుల ధ్రువీకరణ పత్రం, జనన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్, భూ రికార్డులు తదితర ఎన్నికల సంఘం ఆమోదించిన పత్రాలను సమర్పించడం ద్వారా అర్హులైన ఓటర్ల పేర్లు తుది ఓటర్ల జాబితాలో కొనసాగుతాయని తెలిపారు. ఓటర్లకు సహాయార్థం హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు:ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు సంబంధించి ఎన్యూమరేషన్ ఫారం నింపడం, సమర్పించడం లేదా ఇతర సందేహాల నివృత్తి కోసం నియోజకవర్గ స్థాయిలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజి తెలిపారు. పెనమలూరు నియోజకవర్గానికి సంబంధించిన మండలాల వారీగా హెల్ప్‌డెస్క్ ఫోన్ నంబర్లు ఈ విధంగా ఉన్నాయి.పెనమలూరు తహసీల్దార్ కార్యాలయం – 9398025224కంకిపాడు తహసీల్దార్ కార్యాలయం – 701353 9973ఉయ్యూరు తహసీల్దార్ కార్యాలయం – 9705536 206తాడిగడప మున్సిపాలిటీ – 900016 8972ఉయ్యూరు మున్సిపాలిటీ – 99661 42299ఎన్యూమరేషన్ ఫారానికి సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, ఫారం అందకపో యినా లేదా ఇతర సహాయం అవసరమైనా ప్రజలు సంబంధిత హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించా లని జిల్లా కలెక్టర్ సూచిం చారు.సమావేశంలో ఉయ్యూరు ఆర్డిఓ ఎస్ కరుణ కుమారి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్లు, ఆయా మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.




# రికార్డుల నిర్వహణలో పారదర్శకత, నిబంధనల అమలే అధికారులకు రక్షణ కవచం

**ఆర్థిక క్రమశిక్షణ, పకడ్బందీ డాక్యుమెంటేషన్, ఆదాయ వనరుల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులతో జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**

ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

గ్రామపంచాయతీ పరిపాలనలో నిబంధనలను కచ్చితంగా పాటించడం, ప్రతి పనికి సంబంధించిన రికార్డులను పకడ్బందీగా నిర్వహించడం, ఆర్థిక క్రమశిక్షణతో వ్యవహరించడం ద్వారా మాత్రమే అధికారులు భవిష్యత్తులో ఎదురయ్యే క్రమశిక్షణాపరమైన ఇబ్బందులను నివారించగలరని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అన్నారు. జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మచిలీపట్నం లోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో గ్రామపంచాయతీ పరిపాలనపై గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు.గ్రామపంచా యతీల్లో నమోదవుతున్న అనేక క్రమశిక్షణా చర్యలకు ఉద్దేశపూర్వక తప్పిదాల కంటే అవగాహన లోపం, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం, నిబంధనల అమలులో లోపాలే ప్రధాన కారణాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి నిర్ణయానికి సంబంధించిన ఆధారాలు, రికార్డులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని సూచించారు.టెండర్ ద్వారా చేపట్టాల్సిన పనులను నామినేషన్ పద్ధతిలో అమలు చేసే ప్రయత్నాలు చేయరాదని, ప్రభుత్వం నిర్దేశించిన ఆర్థిక పరిమితులు, టెండర్ విధానాలు, పరిపాల నా, సాంకేతిక అనుమతులను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. టెండర్ నోటీసుల ప్రచు ర ణ, ప్రచారం, బిడ్డర్ల ఎంపిక, మూల్యాంకనం వంటి ప్రతి దశకు సంబంధించిన పూర్తి రికార్డులను భద్రపరచాలని చెప్పారు.పరిపాలనా అనుమతులు లేకుండా పనులు చేపట్టడం, నిబంధనలకు విరు ద్ధంగా చెల్లింపులు చేయడం వల్ల అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటారని హెచ్చరించారు. ఇంజి నీరింగ్ శాఖ కొలతల పుస్తకం (ఎం-బుక్), చెక్ మెజర్‌మెంట్, పాస్ ఆర్డర్ తదితర పత్రాలను పరిశీ లించిన తర్వాతే చెల్లింపులు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన వస్తువులకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్, ఫోటోలు, వినియోగ వివరాలు వంటి రికార్డులను కూడా తప్పనిసరిగా నిర్వహించా లని తెలిపారు.అందుబాటులో ఉన్న నిధులు, తప్పనిసరి వ్యయాలు, మిగిలే వినియోగ నిధులపై స్పష్టమైన అవగాహనతో గ్రామపంచాయతీలు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కలెక్టర్ సూచిం చారు. నిధుల కొరతతో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఒక రూపాయి ఖర్చు చేస్తే ప్రజలకు ఎక్కువ ప్రయోజనం చేకూరే పనులను ఎంపిక చేసుకోవాలని అన్నారు.ప్రజల భాగస్వామ్యంతో స్మశానవాటికల అభివృద్ధి వంటి కార్యక్రమాలను చేపట్టాలని, ప్రభుత్వ నిధులతో పాటు దాతల సహకారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అలాగే గ్రామపంచాయతీలు ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకుండా షాపింగ్ కాంప్లెక్స్‌లు, ఇతర ఆదాయ వనరులు కలిగిన ఆస్తులను అభివృద్ధి చేసి స్వంత ఆదాయాన్ని పెంచుకునే దిశగా ఆలోచిం చాలని తెలిపారు.గ్రామపంచాయతీ కార్యదర్శులు కేవలం ప్రభుత్వ ఉద్యోగులుగా కాకుండా గ్రామాభివృద్ధికి బాధ్యత వహించే నిర్వాహకులుగా వ్యవహరించాలని, వివిధ శాఖల పథకాలను సమన్వయం చేసి గ్రామాలకు శాశ్వత ప్రయోజనం చేకూరే ఆస్తుల సృష్టిపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు.కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిణి ఎం ధనలక్ష్మి, డి ఎల్ పి ఓ రజావుల్లా, మచిలీపట్నం డి ఎల్ డి ఓ రామానందం, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.





# సహకార బ్యాంకింగ్‌లో ఉత్తమ విధానాల అధ్యయనానికి అమృత్‌సర్ పర్యటనలో మాజీ మంత్రి, కృష్ణా డీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్

ప్రజాభూమి బ్యూరో కృష్ణ జిల్లా

సహకార బ్యాంకింగ్ రంగంలో ఆధునిక విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న బ్యాంకింగ్ సేవలు మరియు సంస్థాగత సామర్థ్యాన్ని అధ్యయనం చేసే లక్ష్యంతో మాజీ మంత్రి, కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (KDCC బ్యాంక్) చైర్మన్ నెట్టెం రఘురామ్ ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ డీసీసీ బ్యాంకుల చైర్మన్ల ప్రతినిధి బృం దంతో కలిసి పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్ సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్‌ను ఈరోజు సంద ర్శించారు. ఈ సందర్భంగా అమృత్‌సర్ డీసీసీ బ్యాంకు యాజమాన్యంతో వ్యాపారాభి వృద్ధి, డిపాజిట్ల పెంపు, రుణాల నిర్వహణ, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, వినియోగదారుల-కేంద్రీకృత సేవలు, పాలనా విధానాలు, సాంకేతికత ఆధారిత బ్యాంకింగ్, ఆర్థిక సమ్మిళితం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.అలాగే అమృత్‌సర్ డీసీసీ బ్యాంకు అమలు చేస్తున్న ఉత్తమ బ్యాంకింగ్ విధానాలు, పూర్తి స్థాయి CBS వ్యవస్థ, RTGS/NEFT సేవలు, ATM నెట్‌వర్క్, సమాచార భద్రతా వ్యవస్థలు, రైతులకు అందిస్తున్న రుణ సేవలు తదితర అంశాలను ప్రతినిధి బృందం పరిశీలించి విలువైన అవగాహన పొందింది.ఈ అధ్యయన పర్యటన ద్వారా సహకార బ్యాంకుల మధ్య విజ్ఞాన మార్పిడి మరింత బలోపేతమై, సభ్యులకు నాణ్యమైన సేవలు, రైతులకు మెరుగైన ఆర్థిక సహకారం, సాంకేతికత ఆధారిత బ్యాంకింగ్ విస్తరణకు దోహదపడుతుందని నెట్టెం రఘురామ్ తెలిపారు.


## పాతముప్పర్రు గ్రామపంచాయితీ,పెదపాడు మండలం

### టెండర్ నోటీసు,బహిరంగ వేలం

ఆర్.ఓ.సి. నెం.08/2026 — తేది : 08.02.2026

పాతముప్పర్రు గ్రామపంచాయతీ పరిధిలో 2026-2027 సంవత్సరమునకు సంబంధించి గ్రామ పంచాయతీ లో పనిచేయుటకు సిబ్బంది కొరకు టెండర్లు ఎల్ఈడి వీధి దీపాలు మరియు దీపాల విడిభాగాలు, పారిశుద్ధ్య సామాన్లు, మంచినీటి సరఫరా సామాన్లు, ఆర్ సి సి తూరలు,పాత చౌకులు, పాత ఇనుప సామాన్లు, పాత పాడైపోయిన రిక్షాలు మొదలగునవని ఈ క్రింది తెలిపిన విధముగా వేలం వేయబడును. మరియు సదరు బహిరంగ వేలం నందు పాల్గొనువారు ఈ దిగువున ఉదహరించిన విధముగా గజిట్ నోటిఫికేషన్ షరతులకు లోబడి వేలం పాటలు యందు పాల్గొనవచ్చును. మరియు ఇతర వివరములకు కార్యాలయం పనిచేయు వేళల యందు సంబంధిత గుమస్తా నుండి తగు సమాచారం తెలుసుకొనవచ్చును

**షెడ్యూలు**

| వ.నెం. | పని వివరములు/సప్లై వివరములు | టెండర్ ధరావతు రూ.పై. |
|---|---|---|
| 1. | సిబ్బంది టెండర్లు 2026-2027 సం॥నకు : పారిశుద్ధ్య పనుల నిర్వహణ పనులకు గాను కాంట్రాక్టు సిబ్బంది 2 మొత్తం 5 మందికి విడివిడిగా టెండర్ దాఖలు చేయవలెను. | రూ. 100/- |
| 2. | మంచినీటి సరఫరా పర్యవేక్షణ | రూ. 100/- |
| 3. | ఎలక్ట్రిషియన్ మరియు వీధి దీపముల నిర్వహణ 1 | రూ. 100/- |
| 4. | ఎస్ఈడి వీధిదీపాల విడిభాగాలు మరియు పూర్తి సెట్లు సరఫరా చేయుట. | రూ. 2,000/- |
| 5. | పారిశుద్ధ్య సామాన్లు సరఫరా చేయుట (శ్రీ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులకు లోబడి). | రూ. 2,000/- |
| 6. | మంచినీటి సరఫరా సామాన్లు సరఫరా చేయుట | రూ. 2,000/- |
| 7 | ఆర్. సి. సి. తూరలు సరఫరా చేయుట. పాత చోకులు,పాత పాడైన ఇనుప సామాన్లు | రూ. 2000/- |

పంచాయతీ కార్యదర్శి,
గ్రామ పంచాయతీ పాతముప్పర్రు



## PASSPORT MISSING

I,DASARI DHANASRI
D/o Narasimha Rao Door No.1-53
Jalipudi Village,Eluru Mandalam.
Eluru District, Pin 534004

I Lost my Passport no :U8437416
When Iam Travelling From
Galaigudem to Jalipudi by bike
On 5.7.2026,if any One Found pl
Inform me.

cell ; 94834-80561

ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

బుధవారం 8 జూలై 2026

## వ్యవసాయంలో సమతుల ఎరువుల వాడకంతో అధిక దిగుబడులు: డాక్టర్ ఫణి కుమార్

ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి



చిరుధాన్యాల సాగులో శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు, సమతుల్య ఎరువుల వినియోగాన్ని పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏలూరు జిల్లా శాస్త్రవేత్త డాక్టర్ కె. ఫణి కుమార్ తెలిపారు. ఆగిరిపల్లి గ్రామంలో ఎల్‌నినో పరిస్థితుల్లో చిరుధాన్యాల సాగులో అనుసరించాల్సిన మెరుగైన యాజమాన్య పద్ధతులు, జీవన ఎరువుల ప్రయోజనాలపై రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. అధికంగా యూరియా వాడకాన్ని తగ్గించి, సేంద్రియ-రసాయనిక ఎరువులను సమతుల్యంగా వినియోగించాలని సూచించారు. అలాగే మామిడి తోటల్లో తేనె పెట్టెలను ఏర్పాటు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలోని ఏరువాక కేంద్రం, వ్యవ సాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్. నాగేంద్ర బాబు రైతులు రైతు సమాచార కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరగా, మండల వ్యవసాయ అధికారి జె. భవాని ప్రభుత్వ వ్యవసాయ పథకాల ప్రయోజనాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం, గ్రామ సచివాలయం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ విభాగం ప్రైవేటీకరణను విరమించుకోవాలి

–దస్తావేజుల లేఖర్ల ధర్నా



ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

రిజిస్ట్రేషన్ విభాగాన్ని పీపీపీ (త్రిపా) విధానం ద్వారా ప్రైవేటీకరించే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ దస్తావేజుల లేఖర్లు మరోసారి ఆందోళనకు దిగారు. రాష్ట్ర దస్తావేజుల లేఖర్ల సంఘం అధ్యక్షుడు పెనుమాక వెంకట సుబ్బారావు నేతృత్వంలో ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు దస్తావేజుల లేఖర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంఘం అధ్యక్షుడు పెనుమాక వెంకట సుబ్బారావు మాట్లాడుతూ, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌లపై ఆధారపడి ఎన్నో ఏళ్లుగా జీవనం సాగిస్తున్న దస్తావేజుల లేఖర్లకు పీపీపీ విధానం తీవ్ర నష్టం కలిగిస్తుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి పైగా దస్తావేజుల లేఖర్లు, వారి కుటుంబాలు ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాయని, ప్రైవేటీకరణ అమల్లోకి వస్తే వారి ఉపాధి ప్రమాదంలో పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ సేవలను ప్రభుత్వ పరిధిలోనే కొనసాగించాలని, పీపీపీ విధానం పేరుతో ప్రజా సేవలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం సమంజసం కాదని పేర్కొన్నారు. దస్తావేజుల లేఖర్ల ఉపాధిని కాపాడేలా ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని, ప్రైవేటీకరణ ప్రతిపాదనను పూర్తిగా ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. 7,8 తేదీలలో దస్తావేజుల రచన, స్టాంపులను విక్రయాలు పూర్తిగా నిలిపివేస్తామని, అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు సమర్పించినట్లు తెలిపారు.

# పొగాకు రైతులు మద్దతు... కదం తొక్కిన రైతాంగం

- వ్యవసాయం దండగా అన్న చంద్రబాబు
- పోలవరం నియోజకవర్గంలో వేలాదిగా వెళ్ళిన రైతులు

ప్రజాభూమి ప్రతినిధి–జీలుగుమిల్లి



తరచుగా ఏజెన్సీ, మెట్ట ప్రాంతంలో వాణిజ్య పంటల్లో భాగంగా పండించే పంట పొగకు ఈ పొగాకు పంటకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కనీసం వారి వైపు కన్నెత్తి చూడడం లేదని గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైస్సార్సీపీ ర్యాలీకి పిలుపునిచ్చింది. పోలవరం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తెల్లం బాలరాజు, మెట్ట ప్రాంత సీనియర్ నాయకులు జెట్టి గురునాధరావు చింతలపూడి నియోజకవర్గ ఇన్చార్జ్ విజయరామరాజు , నేతృత్వంలో నిర్వహించిన ట్రాక్టర్ల ర్యాలీ కి వైస్సార్సీపీ అభిమానులు కార్యకర్తలు , రైతులు సిపిఐ సిపిఎం పార్టీ పక్ష నాయకులు భారీగా తరలి వచ్చారు. ఈ ర్యాలీలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు మాట్లాడుతు కూటమి ప్రభుత్వంపై చంద్రబాబు నాయుడు తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు ఎప్పుడు అధికారంలోకి వచ్చిన ప్రజలకు చేసేది ఏమీ లేదు అని వీరు ఎప్పుడు అధికారంలోకి వచ్చిన వారి కార్యకర్తలు జోబులు నింపుకోవడం కోసమేనని రైతులు ని పట్టించుకోరని ఈ రోజు రాష్ట్రంలో చూసినట్టయితే పొగాకు రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కనీసం రైతులు కి ఎరువులు కూడా అందుబాటు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు వ్యవసాయం దండుగ అనిన వ్యక్తి అని గతంలో 2002 లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇదే పొగాకు రైతులకు నిర్ణీతమైన ధర లేనప్పుడు ఆ రోజు బాలరాజు, జెట్టి గురునాథ రావు, రైతులను తీసుకొని హైదరాబాద్ వెళ్ళి పొగాకు రైతులు సమస్యలు చెప్పినప్పుడు వెంటనే స్పందించి రైతులకు మేలు చేశారని తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు పొగాకు రైతులు కి సుమారు ఒక కేజీ కి 400 నుంచి 450 రూపాయలు మద్దతు ధర ఉండేదని రైతులు రైతు కూలీలు సంతోషంగా జీవన సాగించే వారు అని తెలియజేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొని పొగాకు రైతులకు కేజీ కి 350 రూపాయలు కనీస మద్దతు ధర ప్రకటించాలని హెచ్చరించారు లేకపోతే ఈ ఉద్యమం మరింత చేపడతామని తెలియజేశారు. అంతేకాకుండా ఈ కార్యక్రమానికి విచ్చేసిన వివిధ నియోజకవర్గ ముఖ్య నాయకులకు జిల్లా ఇన్చార్యులకు మండల పట్టణ మండల ప్రెసిడెంట్లకు కార్యకర్తలకు సిపిఐ సిపిఎం పార్టీ వామపక్ష నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసుకున్నారు.

# జిల్లాలో ఎంఎస్‌ఎం పార్కుల ఏర్పాటుకు చర్యలు.

ప్రజా భూమి ప్రతినిధి–ఏలూరు జిల్లా

జిల్లాలో 7 నియోజకవర్గాలకుగాను 4 నియోజకవర్గాలలో ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని, మరో 3 నియోజకవర్గాలలో ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటుకు భూసేకరణ చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రాష్ట్ర భూపరిపాలన శాఖ ముఖ్య కమీషనర్ జి. జయలక్ష్మి కి చెప్పారు. నియోజకవర్గాలలో ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటు, 22ఏ భూ సమస్యల పరిష్కారం, రీసర్వే, పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, రెవిన్యూ వన్, తదితర అంశాలపై రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర భూపరిపాలన శాఖ ముఖ్య కమీషనర్ జి. జయలక్ష్మి రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ జయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గంలోనూ ఎంఎస్‌ఎంఈ పార్కులు ఏర్పాటుకు త్వరిత గతిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆగష్టు నెలలో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలన్నారు. రైతుల కెవైసి పూర్తిచేసి, రైతుల పేర్లు, భూమి విస్తీర్ణం, సర్వే నెంబర్, తదితర వివరాలను పరిశీలించి తప్పులు లేకుండా పట్టాదార్ పాస్ పుస్తకాల



ముద్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్ నుండి పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి జిల్లాలో చేపట్టిన చర్యలు గురించి సిసిఎల్ఏ జయలక్ష్మి కి వివరించారు. ఏలూరు జిలాల్లో చింతలపూడి నియోజకవర్గంలో ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు తుది దశలో ఉందన్నారు. ఏలూరు పోలవరం, కైకలూరు లో పురోగతిలో ఉన్నాయని, దెందులూరు, నూజివీడు, ఉంగుటూరు నియోజకవర్గాలలో భూసేకరణ దశలో ఉన్నాయన్నారు. జిల్లాలో ఆగష్టు నెలలో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. జె. అభిషేక్ గౌడ, ఇంచార్జ్ డిఆర్ఓ దేవకీదేవి, నూజివీడు సబ్ కలెక్టర్ బి. వినూత్న, ఆర్డీఓలు లక్ష్మీప్రసన్న, రమణ, ప్రభృతులు పాల్గొన్నారు.

# ఆక్వా రైతులకు కూడా ఏపీ ప్రభుత్వం ఎంఎస్పి ఇచ్చేలా కృషి చేయాలి

- నెక్ మాదిరిగా ఆక్వాకు కూడా ఏపీ ప్రభుత్వం పబ్లిసిటీ చేయాలి
- ఏపీ రాష్ట్ర ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు గాంధీ భగవాన్ రాజు డిమాండ్

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

వరి రైతులు మాదిరిగా ఆక్వా రైతులకు కూడా రొయ్యల పంటకు ఎం ఎస్ పి, ( మినిమం సపోర్ట్ ప్రైస్ )గిట్టుబాటు ధర కల్పించాలని ఇందుకోసం ఏపీ రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం చంద్రబాబు నాయుడు, వ్యవసాయ మంత్రి అచ్చం నాయుడు, అప్సడ వైస్ చైర్మన్ ఆనం వెంకటనారాయణ రెడ్డి కృషి చేయాలని ఏపీ రాష్ట్ర ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభవన్రాజు డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 100 కౌంట్ రొయ్యలకు కనీసం 300 రూపాయలు రైతులకు వచ్చేలా గిట్టుబాటు ధరలు కల్పించాలని గాంధీ భగవాన్ రాజు కోరారు. బహిరంగ మార్కెట్లో కోడిగుడ్లు విక్రయాలు పెరిగేటందుకు కోసం నెక్కును ఏర్పాటు చేసినట్లుగానే రొయ్యలను కూడా మార్కెట్లో విస్తృతంగా విక్రయాలు పెరిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం విస్తృత పబ్లిసిటీ కల్పించి, 30% డొమెస్టిక్ విక్రయాలు పెంచి రైతులను ఆదుకోవాలని గాంధీ భవన్రాజు కోరారు. ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ పరిధిల ఆంక్షలు లేకుండా యూనిట్కు రూపాయి నర విద్యుత్ సబ్సిడీని జూన్ నెల నుంచే అమలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఎమ్మార్పీ, ఇన్ వాయిస్ ధరలతో రైతులను



ఏమార్చకుండా యుద్ధ ప్రాతిపదికన మేత ధరలు కిలోకి రూ. 4 తగ్గించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు, వ్యవసాయ మంత్రి అచ్చం నాయుడు, అప్సాడ వైస్ చైర్మన్ రామ్ నారాయణ రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీడ్ కంపెనీలు యజమానులు రా మెటీరియల్ కాస్ట్ పెరిగిపోయిందని చెబుతున్నారని, అలాగైతే కిలో రొయ్యలకి రూ. 60 రూపాయలు వరకు ప్రాసెసింగ్ ప్లాంట్ ఎజమానులు ఎందుకు తగ్గించి కొంటున్నారు ప్రశ్నించారు. ఏపీలోనే రొయ్యల సాగు జరుగుతుంది అని, ఈ రంగం ద్వారా వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తుందని అందువల్ల రాష్ట్ర ప్రభుత్వమే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రొయ్యల రైతులును ఆదుకోవాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఐదు జిల్లాల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకుని కార్యాచరణ రూపొందించుకోవడం జరుగుతుందని, ఆ సమావేశాలకు రైతులు అధిక సంఖ్యలో హాజరై సమస్యల పరిష్కారం కోసం ఐక్యతతో కృషి చేసుకోవ డానికి రైతులంతా సహకరించాలని గాంధీ భగవాన్ రాజు సమావేశంలో కోరారు. సమావేశంలో మేడిది జాన్ డేవిడ్ రాజు, అంగర విజయప్రసాద్, పి సత్యనారాయణ రాజు, సజ్జ వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పైడిమెట్ట పాఠశాల విద్యార్థులకు రూ.10 వేల విలువైన నోట్‌బుక్స్ అందించిన దాతలు



ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి

తాళ్లపూడి మండలం పైడిమెట్ట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన దాతలు రూ.10 వేల విలువైన నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లను అందజేసి విద్యార్థులకు అండగా నిలిచారు. గ్రామానికి చెందిన కొడమంచిలి ఇమ్ము, ముప్పిడి రాజు, కొప్పాక జవహర్, జొన్నకూటి సుధాకర్, పసలపూడి నానిబాబు, విత్తం నాని విద్యార్థులకు విద్యా సంవత్సరానికి సరిపడా నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లను ఏర్పాటు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దున్నా దుర్గారావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం గ్రామస్తులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. విద్యాభివృద్ధికి తోడ్పాటునందించిన దాతలను పాఠశాల ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొల్లి దుర్గారావు, కొప్పాక అబ్బులు, కొడమంచిలి చంద్రశేఖర్, జొన్నకూటి నాగేశ్వరరావు, కొప్పాక అంథోని రాజు, జొన్నకూటి పౌలు, కొల్లి చిన్నబాబు, కొప్పాక లక్ష్మి, జొన్నకూటి నాగమణి, కోటిచుక్కల జ్యోతి, రాచూరి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎంఆర్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుక

ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి




పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జన్మదినోత్సవం మరియు ఎంఆర్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తాళ్లపూడి మండలం పైడిమెట్ట గ్రామంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మంద కృష్ణ మాదిగకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎంఆర్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేసి మానవతా సేవను చాటారు. సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎంఆర్పీఎస్ చేస్తున్న సేవలను కొనియాడుతూ, ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జగ్గజీవన్ సమాఖ్య అధ్యక్షులు జొన్నకూటి ప్రమోద్ కుమార్, కొప్పాక జవహర్ విజయానంద కుమార్, దున్నా దుర్గారావు, పసలపూడి ఆశీర్వాదం, కొల్లి దుర్గారావు, కొడమంచిలి చంద్రశేఖర్, గెడ్డం గణేష్, కొల్లి చిన్నబాబు, కొడమంచిలి విమల్, నాగరాజు, కొడమంచిలి సత్యానందం, కొప్పాక ఆంతోని రాజు, మల్లిపూడి రాజేష్, గెడ్డం మోహన్, కొప్పాక మధు తదితరులు పాల్గొన్నారు.

# 90 శాతం సబ్సిడీతో వరి విత్తనాలు పంపిణీ

- పట్టా పాస్ బుక్‌కి ఆధార్ ఫోన్ లింక్ అయినవారికి మాత్రమే
- 100 శాతం సబ్సిడీతో కంది విత్తనాలు

ప్రజా భూమి ప్రతినిధి–కూనవరం



మండలంలోని వ్యవసాయ కార్యాలయం నందు రైతులకు 90 శాతం సబ్సిడీతో వరి విత్తనాలు ఇవ్వడం జరిగింది. దీనిలో యం పి యు 1121 రకం ధర 126/- మరియు బిపిటి 5204 ధర 108/- రకం వరి పొలం గట్ల మీద వేసుకోవడానికి కందులు 100 శాతం సబ్సిడీతో రైతులకు అందుబాటులో ఉంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని సిహెచ్ దేవి మండల నాయకులూ రైతులు పాల్గొనడం జరిగింది. ఈ విత్తనాలు అన్ని కూడా డి కృషి అనే యాప్ ద్వారా ఆన్లైన్ లో ఇవ్వడం జరుగుతుంది. దీని కొరకు రైతులు, ఆధార్ తో లింక్ ఐన పట్టా పాస్ బుక్ మరియు ఫోన్ తీసుకొని రాగలరు అని వ్యవసాయ శాఖ సిబ్బంది తెలియచేశారు.

# చిన్న చినుకుకే సుమారు 40 లక్షలు కొట్టుకుపోయిన సిసి రోడ్

**ఇది ఆర్ అండ్ బి శాఖ పనితనం.**

ప్రజా భూమి ప్రతినిధి–కూనవరం





మండలంలోని పోచవరం పంచాయతీ పరిధిలో పోలిపాక నుండి మురుమూరు మధ్యలో ఉన్న జాతీయ రహదారి ప్రతి సంవత్సరం వస్తున్న గోదావరి వరద పోటుకు కొట్టుకుపోవడంతో అక్కడ శాశ్వతంగా రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం సుమారు 40 లక్షల రూపాయలను నిధులు మంజూరు చేసినట్టు సమాచారం కానీ అక్కడ రోడ్డు నిర్మాణం చేపట్టిన సదరు గుత్తేదార్ రోడ్డు నిర్మాణంలో సరైన పద్ధతిలో నిర్మాణం చేయించకపోవడంతో నేడు చిన్న పాటి వర్షానికి రోడ్డు మొత్తం గుంతలుగా ఏర్పడింది కనీసం గోదావరి ఆ రోడ్డు మీద రాకమునుపే ఇలా ఉంటే ఇక గోదావరి వస్తే పరిస్థితి ఏమిటి సదరు గుత్తేదారు సరైన పద్ధతిలో రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదని అనేక మార్లు మా పత్రికలో వార్తలు ప్రచురించడం జరిగింది అయినా సదరు అధికారి ఆర్ అండ్ బి శాఖ అధికారి నాణ్యత గుర్తించకపోకుండా అతను కనీసం రోడ్డు నిర్మాణం ఎలా జరుగుతుంది అని కూడా చూడకుండా తన క్రింద సిబ్బందితో పనులు పూర్తి చేయించారు నేడు ఆ రోడ్డు నిర్మాణం పూర్తిగా అధ్వానంగా ఉంది సంబంధిత ఉన్నత అధికారులు చొరవ తీసుకొని ఆ రోడ్డు నిర్మాణం మరల నిర్మించాలని వాహనదారులు ప్రజలు కోరుకుంటున్నారు.

## రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

రూరల్ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రహదారి భద్రతా నియమాలు మరియు డ్రైవింగ్ లైసెన్స్‌లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థులకు రవాణా శాఖ మంజూరు చేసిన ఎల్ఎల్ఆర్ స్లాట్‌లను ఎమ్మెల్యే స్వయంగా అంద జేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను తప్ప నిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించడం ద్వారా ప్రమాదాల తీవ్రతను తగ్గించవచ్చని సూచించారు.

## పీఎంఏవై అర్హుల ఎంపికలో పారదర్శకతకు గ్రామసభలు: హౌసింగ్ ఈవో సుందర్

ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి



ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) గృహనిర్మాణ పథకం లబ్ధిదారుల ఎంపికను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అం దేలా గ్రామసభల్లో క్షుణ్ణంగా పరిశీలన చేపడుతున్నామని హౌసింగ్ ఈవో సుందర్ తెలిపారు. గ్రామస్తులు తమ వివరాలను గ్రామసభల్లో వెల్లడించి అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. ఆగిరిపల్లి మండల పరిధిలోని ఆగిరిపల్లి, అమ్మవారిగూడెం, పోతవరపాడు, కృష్ణవరం, ఈదర గ్రామాల్లో ఆయా గ్రామ సచివాలయ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి పీఎంఏవై గృహనిర్మాణ పథకానికి సంబంధించిన అర్హులు, అనర్హుల జాబితాలను పరిశీ లించారు. ఆగిరిపల్లి, ఈదర గ్రామసభల్లో హౌసింగ్ ఈవో సుందర్ స్వయంగా జాబితాలను పరి శీలించి గ్రామస్తుల నుంచి అభ్యంతరాలు, వివరాలు స్వీకరించారు. మిగిలిన గ్రామాల్లో బుధ వారం, గురువారం కూడా గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు. బుధవారం తోటపల్లి, నూగొండపల్లి, కేఈదర, సీతారామపురం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి పీఎంఏవై లబ్ధిదా రులను ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర కుమార్, ఈవో వరలక్ష్మి, ఉమాకాంత్, ఇంజనీరింగ్ సహాయకులు శంకర్ బాబు దుర్గాప్రసాద్, మాదల సత్యకుమార్, పామర్తి నరసింహారావు, గ్రామాల సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాభూమి



# భూముల సమస్యలపై జిల్లాల వారీగా ఉన్నతా ధికారుల కీలక సమీక్ష

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, సీసీఎల్ఏ జి. జయలక్ష్మి నేతృత్వంలో వీడియో కాన్ఫరెన్స్

ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం

రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే, 22-A నిషేధిత భూముల జాబితా సవరణ, కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ మరియు ఐ.వీ. ఆర్.ఎస్. కాల్స్ ద్వారా అందుతున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార పురోగతిపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు మంగళవారం ఒక ఉన్నత స్థాయిలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి. జయలక్ష్మి సంయుక్తంగా విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో జిల్లాల వారీగా క్షేత్రస్థాయి పురోగతిని సమీ క్షించారు. ఈ కాన్ఫరెన్స్‌లో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుండి జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియా దేవి జిల్లా అధి కారులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ జి. సాయి ప్రసాద్ మాట్లాడుతూ.రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను అత్యంత పారద ర్శకంగా, గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. భూ రికార్డుల ప్రక్షాళన ద్వారా రైతులకు శాశ్వత భూ హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 22–ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న అర్హులైన రైతుల దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, చట్టపరమైన నిబంధనల ప్రకారం పరిష్కరించాలని స్పష్టం చేశారు. పాస్ పుస్తకాల పంపిణీలో ఎలాంటి అలసత్వం వహించరాదని, ఐవీ ఆర్ఎస్ కాల్స్ ద్వారా వచ్చే భూ సమస్యల ధృవీకరణ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియా దేవి ప్రసంగిం చారు. జిల్లాలో జరుగుతున్న



భూ పరిపాలన సంస్క రణల వివరాలను ఆమె వెల్లడించారు.కోనసీమ జిల్లాలో భూ రీ సర్వే ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు క్షేత్రస్థాయిలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో రికార్డులను పక్కాగా క్రోడీకరించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన పట్టాదార్ పాస్ పుస్తకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో 22-A పరిధిలో ఉన్న భూములకు సంబంధించి రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తు న్నామన్నారు నిబంధనల ప్రకారం అర్హత ఉన్న భూములను డీ-నోటిఫై చేసేందుకు ప్రతిపాదన లను వేగవంతం చేశామన్నారు రీ సర్వే తుది రికార్డులు ల్యాండ్ రిజిస్టర్లు తయారైన వెంటనే ముద్రిం చిన కొత్త పాస్ పుస్తకాలను పారదర్శకంగా పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.రీ సర్వే మరి యు భూ సేవలపై నేరుగా రైతుల నుంచి సేకరిస్తున్న ఐవీఆర్ఎస్ కాల్స్ ఫీడ్‌బ్యా క్‌ను ఎప్పటికప్పుడు విశ్లే షిస్తున్నామని,. రైతులు వ్యక్తం చేస్తున్న సందేహాలు, ఫిర్యాదులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేలా రెవెన్యూ మరియు సర్వే సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామ న్నారు ?ఈ సమీక్షా సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి సుబ్బారావు జిల్లా సర్వే శాఖ అధికారి కే ప్రభాకర్ ఆర్డీవో ఏ సరళా వతి ఉప తహశీల్దార్లు వంశీ మరియు రెవెన్యూ విభాగపు ముఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

# రుద్రం కోట గ్రామంలో ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజా భూమి ప్రతినిధి-వేలేరుపాడు.

ఎమ్మార్పీఎస్ 32,వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు తుంగ.శ్రీను మాదిగ అధ్యక్షతన ఘనంగా మంగళవారం రుద్రం కోట ఆటో స్టాండ్ వద్ద జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ అలాగే ఎం ఎస్ పి రాష్ట్ర నేత, భారత్ ఎక్స్లెన్స్ అవార్డు గ్రహీత విసంపల్లి. సిద్దు మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మూడు దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ఎంతోమంది మాదిగ బిడ్డలు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి, మాదిగ జాతి విముక్తికై అభివృద్ధికై తమ ప్రాణాలను ఫణంగా పెట్టినారని వారి త్యాగం వృధా కాకుండా ఉండాలి అంటే, ప్రతి మాదిగ



పల్లెలో ఇంటర్ డిగ్రీ చదివి ఆపకుండా యూనివర్సిటీల్లో చదివి గొప్ప ప్రయోజకులు కావాలని పేర్కొన్నారు.ముందుగా డబ్బులతో ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మ దగ్గరకు నాయకులను ఆహ్వానిస్తూ తీసుకెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా వెలేరుపాడు మండల బీజేపీ పార్టీ నాయకులు సారె. బాబ్జి,టిడిపి మండల అదిఖారప్రతినిధి అమరవరపు. వెంకటేశ్వర్లు, వైసిపి మండల నాయకులు గుద్దేటి. భాస్కర రావు, జనసేన మండల నాయకులు కొవ్వాల. క్రాంతి కుమార్ ఎంఆర్పిఎస్ నూతన జండా దిమ్మ దగ్గర కొబ్బరికాయలను కొట్టి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జెండాను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత విస్సంపల్లి. సిద్దు మాదిగ ఆవిష్కరించారు. అన్ని పార్టీల నాయకులతోపాటు మాదిగ మహిళలు మాదిగ పెద్దలతో కేక్ కటింగ్ చేసి మిఠాయిలు పంచడం జరిగింది.

ఈ కార్యక్రమంలో కొవ్వాల. నరేష్ మాదిగ,కొవ్వాల. శివప్రసాద్ మాదిగ, కొవ్వాల. రవికుమార్ మాదిగ, కొక్కెర పాటి. శ్రీనివాసరావు మాదిగ, కొవ్వాల. రమేష్ మాదిగ, కొవ్వాల. శ్యామ్ మాదిగ, కొవ్వాల. ప్రశాంత్ మాదిగ, రాజు మాదిగ,, నరేష్ మాదిగ. మహిళా నాయకులు చిట్టెమ్మ మాదిగ, అలివేలు మాదిగ, రమణ మాదిగ, లక్ష్మీ మాదిగ, డప్పు కళాకారులు, విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## ఓటరు జాబితా సవరణ వేగవంతం



ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ సర్వే కౌంటర్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీడీవో అబ్దుల్ సలాం మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమానికి మరో ఏడు రోజుల గడువు మాత్రమే మిగిలి ఉందన్నారు. మండలవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 77 శాతం డిజిటలీకరణ పూర్తయిందని తెలిపారు. ఆగిరిపల్లి గ్రామంలో ఏడుగురు సిబ్బందితో ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నామని, గ్రామంలోని మొత్తం 6,750 మంది ఓటర్లలో ఇప్పటివరకు 4,500 మంది వివరాలను పరిశీలించి నమోదు ప్రక్రియ పూర్తి చేశామని చెప్పారు. మిగిలిన ఓటర్లు కూడా తమ దరఖాస్తు ఫారాలను సంబంధిత బీఎల్‌వోలకు త్వరగా అందజేసి ఓటు హక్కును భద్రపరచుకోవాలని సూచించారు.

## జి.వి.ఎస్.వి.ఆర్.ఎం పాఠశాల విద్యార్థులకు టీ షర్టులు బహూకరణ

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

పాలకొల్లు జీవి.ఎస్వీ.ఆర్ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ప్రముఖ దాత, ఆనంద సాయి స్వీట్ హోమ్ అధినేత, కోరాడ గోవింద రాజులు సహకారంతో విద్యార్థిని విద్యార్థులకు రూ. 20వేలు విలువైన టీ షర్టులను బహుకరించే కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పాఠశాల హెచ్.ఎం రాయపూడి భవానీప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దాత కోరాడ గోవిందరాజులు మాట్లాడుతూ సేవ చేయడంలో కలిగే ఆనందం వెలకట్టలేనిదన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దుస్తులను బహుకరించడం ఆనందంగా ఉందన్నారు. రాయపూడి భవాని ప్రసాద్ మాస్టారు ఏ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసినా.. ప్రతి సంవత్సరం



విధిగా తన సహాయ సహకారాలను ఆ పాఠశాల విద్యార్థులకు క్రమం తప్పకుండా అందిస్తానని చెప్పారు. విద్యార్థుల సౌకర్యాల కల్పనలో రాయపూడి మాస్టారు ప్రధాన భూమిక పోషిస్తారని, దాతల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేయడంలో, విద్యార్థులను వెన్నుతట్టి ప్రోత్సహించడంలో ప్రధానోపాధ్యాయుడు రాయపూడి ఎప్పుడూ ముందు ఉంటారని కొనియాడారు. విద్యార్థులందరికీ తండ్రి మాదిరిగా రాయపూడి సేవలందిస్తూ ఉంటారని, ఇంతమంది విద్యార్థుల, వారి తల్లిదండ్రుల అభిమానాన్ని సంపాదించడం చిన్న విషయం కాదన్నారు. భవాని ప్రసాద్ మాస్టారును ప్రత్యేకంగా అభినందించారు. టిడిపి నాయకులు, మాజీ వార్డ్ కౌన్సిలర్ ధనాని సూర్య ప్రకాష్ మాట్లాడుతూ రాయపూడి భవాని ప్రసాద్ ఏ పాఠశాలలో పనిచేసినా ఆ పాఠశాలకు అవసరమైన అన్ని సౌకర్యాలను దాతల సహకారంతో ఆయనే స్వయంగా కల్పించడం, పాఠశాలకు వన్నె తేవడం జరుగుతుందని చెప్పారు. ఇది చాలా గొప్ప విషయమని అన్నారు. ఎన్నో సందర్భాల్లో సొంత డబ్బును ఖర్చు చేసి రాయపూడి విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తూ ఉంటారని కొనియాడారు. తన వంతు సహకారం ఎప్పుడూ అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో చిలుకూరి భీమన్న చౌదరి, అప్పారి మహేష్, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అందరూ ప్రోత్సహించాలి

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను అందరూ వినియోగించుకోవాలని, విద్యార్థులను అన్నివిధాలా ప్రోత్సహించాలని వాకర్స్ క్లబ్ పాలకొల్లు అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. మంగళవారం సాయంత్రం ఎలమంచిలి నెంబర్ 1మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వారికి అవసరమైన 7 వేల రూపాయల విలువైన నోటు పుస్తకాలు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయిని చిలుకూరి పద్మశ్రీ దేవి అధ్యక్షత వహించగా క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్ ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు కోశాధికారి పోతుల ఉమాశంకర్ రావు,



పాఠశాల ఉపాధ్యాయులు గంటా సురేష్ బాబు, కాపా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మాదిగలు ఆర్థికంగా రాజకీయంగా అభివృద్ధి చెందాలి

ప్రజాభూమి ప్రతినిధి-చాట్రాయి

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 32వ వ్యవస్థాపక దినోత్సవ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ 62వ జయంతి కార్యక్రమాన్ని చాట్రాయి మండలంలోని తుమ్మ గూడెం గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నూజివీడు నియోజకవర్గ ఎంఆర్పిఎస్ అధ్యక్షుడు తొమ్మంద్రు రుద్రయ్య మాదిగ అధ్యక్షత వహించగా ఎమ్మార్పీఎస్ పొలిటి బ్యూరో సభ్యుడు ఏలూరు జిల్లా ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ కూచిపూడి సత్యం మాదిగ పాల్గొని మాట్లాడుతూ మాదిగలు సామాజికంగా ,ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలని 32 సంవత్సరా లు పోరాటం చేసి సాధించుకున్న ఏబిసిడి వర్గీకరణ రిజర్వేషన్ ఫలాలను మాదిగలు అందిపుచ్చుకోవాలని అన్నారు. ప్రతి మాదిగ బిడ్డ చదువుకొని ఉన్నతమైన స్థాయికి చేరాలని అప్పుడే ఏబిసిడి వర్గీకరణ ఫలితం దక్కుతుందని అన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగల శేఖర్ మాదిగ మాట్లాడుతూ కుల ఉద్యమం ఏదైనా ఉంది అంటే అది





ఒక్క ఎమ్మార్పీఎస్ ఉద్యమమేనని దీనికి నాయకత్వం వహిస్తున్న మందా కృష్ణ మాదిగ నాయకత్వంలో మనమందరం ముందుకు వెళ్లాలని ఆయన పిలుపుమేరకు అన్ని కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని మాదిగలు మాదిగ అని గర్వంగా చెప్పుకునే స్థాయికి కృష్ణ మాదిగ తీసుకువచ్చారని అన్నారు దేశంలోని ఆదర్శవంతమైన నాయకుడిగా కృష్ణ మాదిగ ఎదిగాడని అలాంటి నాయకుడి పోరాటాన్ని మనం ఎప్పుడూ గుర్తుంచుకోవాలని అన్నారు. అనంతరం కృష్ణ మాదిగ జయంతి సందర్భంగా కేక్ కట్ చేయడం జరిగింది. ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దుబ్బాకు దేవరాజు మాదిగ, ఏలూరు జిల్లా క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు కంకట వెంకటేశ్వరరావు మాదిగ, మురళీకృష్ణ మాదిగ, వెంకటేశ్వరరావు మాదిగ, విలియం మాదిగ చాట్రాయి మండలం ఎంఆర్పిఎస్ అధ్యక్షుడు మొ లుగుమాటి రవి రాం మాదిగ, ఆదినారాయణ మాదిగ, ఆదామ్ మాదిగ ,బాలస్వామి మాదిగ , మాదిగ లు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# దివ్యాంగులకు వినికిడి యంత్రాల పంపిణీ..

## ప్రజాసేవే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే బడేటి చంటి

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ సుపరిపాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పనిచేస్తున్నారని ఆయన ప్రశంసించారు.ఏలూరు పవర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 17 మంది లబ్ధిదారులకు వినికిడి యంత్రాలను ఎమ్మెల్యే బడేటి చంటి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,



ప్రభుత్వ పథకాల ద్వారా అవసరమైన వారికి సహాయం అందిం చడంతో పాటు, దాతల సహకారంతో మరింత మందికి చేయూత అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం ముందంజలో కొనసాగుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతు న్నాయని, రానున్న రోజుల్లో కూడా ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రయోజనాలు చేర్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి,ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏలూరు నగర టీడీపీ అధ్యక్షులు చోడే వెంకటరత్నం, నాయకులు ఆర్నేపల్లి తిరుపతి, కడియాల విజయలక్ష్మి, జాలా బాలాజీ పాల్గొన్నారు.

## ఓటు హక్కు పరిరక్షణకు కృషి చేయండి



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత ప్రధానమని, ఓటు హక్కు పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ నూతన ఓటర్ల జాబితా రూపకల్పన సహకరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు బొర్రా నరేష్ కుమార్ కోరారు. మండలంలోని వడ్డిగూడెం గ్రామ పంచాయతీలోని సర్ వోటర్ వెరిఫికేషన్ కార్యక్రమంలో బిఎల్ఓతో బిఎల్ఏ లు అనుసంధానమై చేస్తున్న కార్యక్రమాలను టీడీపీ నాయకులు మంగళవారం పరిశీలించారు. ప్రజాప్రతినిధులు నేతలు అధికారులు ప్రతి ఒక్కరి ఓటు హక్కును పరిరక్షించాలని, సవరణ ప్రక్రియపై అప్రమత్తంగా వ్యవహరించాలని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పనులను వేగవంతం చేయాలని బిఎల్ఓ లను కోరారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు, చంద్ర శేఖర్, బిఎల్ఏ లు ముత్యాల శంకర్రావు, చక్రపాణి, శ్రీధర్, బింగి విష్ణుమూర్తి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ జాతి ముద్ద బిడ్డ మందకృష్ణ మాదిగ

ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం



మాదిగ జాతి అభివృద్ధికి, మాదిగల హక్కుల కోసం ఏబీసీడీ వర్గీకరణకు అలుపెరగని పోరాటం చేసిన మాదిగ జాతి ముద్ద బిడ్డ మందకృష్ణ మాదిగ అని, మాజీ జడ్పీటీసీ ముత్యాల రామారావు అన్నారు. మండలంలోని వడ్డిగూడెం పంచాయతీ బీసీ కాలనీ గ్రామం వద్ద మంగళవారం ఎంఆ ర్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకను, స్తానిక ఎంఆర్పీ ఎస్ సభ్యుల ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఆర్పీఎస్ సభ్యులు, ముఖ్యఅతిథిగా విచ్చేసిన కూటమి నాయకుల ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి అందరికి పంచి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 30 సంవత్సరాల నుంచి మంద కృష్ణ మాదిగ తన కుటుంబానికి దూరమై ఆరోగ్యం కోల్పోయి తిండి ఉన్నా లేకపోయినా, జనాలను రోడ్ల మీదకు తీసుకుని వచ్చి, అంబేద్కర్ చెప్పినట్లు సమీకరించు బోధించు పోరాటం చెయ్ ఇవన్నీ కూడా ఏ రోజు మార్గం తప్పకుండా అదే పద్దతి ఫాలో అవుతూ, అంబేద్కర్ స్పూర్తిని ఆయుధంగా పెట్టుకొని, ఎస్సీ వర్గీకరణ కోసం అకుంఠిత దీక్షతో పోరాడిన వ్యక్తి మంద కృష్ణ మాదిగ అని కొనియాడారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు, ఎంఆర్పీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రారంభం కాని ఆర్టీసీ బస్టాండ్ సిసి రోడ్ పనులు

### -సిసి రోడ్డు వేస్తున్నామని పత్రికా ప్రకటన చేశారు అంతే..



ప్రజా భూమి ప్రతినిధి-కూనవరం

మండలంలోని ఆర్టీసీ బస్టాండ్ బురదమయం అవటంతో ఇక్కడ ఉన్న మండా రాజు అధికారుల చుట్టూ తిరిగి ఎంతో వ్యాయప్రాయాసాలతో ఆర్టీసీ బస్టాండ్ కు పూర్వవైభవం తేవాలని అధికారుల చుట్టూ తిరిగి బస్టాండ్ కు సీసీ రోడ్డును తీసుకురావడం జరిగింది. ఆర్టీసీ సిబ్బంది హడావిడిగా వచ్చి కొలతలు తీసుకుని నాలుగు లక్షల 77 వేల రూపాయలు సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు వచ్చాయని వెంటనే పనులు ప్రారంభించడం జరుగుతుందని అధికారులు వెంట కాంట్రాక్టు కూడా తీసుకురావడం జరిగింది. రెండు రోజుల్లో పనులు మొదలుపెడతామని చెప్పి ఓటమి ప్రభుత్వ నాయకుల సమక్షంలో సిసి రోడ్డు నిర్మాణానికి ముగ్గు వేయించి నేటికీ వారాలు గడుస్తున్న వారు మాత్రం పనులు మాత్రం మొదలు పెట్టలేకపోగా అసలు అధికారులు చారవాణి ( ఫోన్) సమాధానం కూడా ఇవ్వటం లేదు ఇంతకీ ఆర్టీసీ బస్టాండ్ కి నిధులు వచ్చాయా వస్తే వాటిని వేరే ప్రాంతానికి తరలించారా అనేది అనుమానంగా ఉంది అని ప్రయాణికులు అనుకుంటున్నారు కావున మా ప్రాంతంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ కి సీసీ రోడ్డు నిర్మాణం త్వరతగతిన చేయాలని మండల ప్రజలు ప్రయాణికులు కోరుకుంటున్నారు.

## గిరిజనేతర నిర్వాసితులను మోసం చేస్తున్న ప్రభుత్వ అధికారులు



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

మండలంలోని రామవరం గ్రామపంచాయతీ పరిధిలో గల గిరిజనేతర కుటుంబాలైనటువంటి, శబరి రాయి గూడెం, రామవరం, రామవరం పాడు, చోపల్లి, సోములు గూడెం, ఏవీ గూడెం, గ్రామాలకు గత సంవత్సరము 2025 న రెండు బస్సులు పెట్టి అధికారులు తాడువాయి గ్రామంలో నిర్వాసితుల కాలనీ కట్టించు కోవటానికి చూపించారు, కానీ ఇప్పుడు వేరొక చోట ఇస్తామని అంటున్నారని, గిరిజనేతర నిర్వాసితులను అధికారులు మోసం చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. గత ఏడాది చూపించిన భూమి మాకు నచ్చిందని తీర్మానించమని, కానీ మంగళవారం 7.7.2026 న తహసిల్దార్ ఆఫీస్ కు పిలిపించుకొని ఆ ప్లేస్ మీకు ఇవ్వటం జరగదు, మరొక ప్లేసు కొయ్యలగూడెం దగ్గర, పెరికపొడి గ్రామములో స్థలము ఉన్నది వేల్లిచూసుకోండి అని చెప్పారని, నిర్వాసితులను ప్రభుత్వము, ప్రభుత్వ అధికారులు ఇలా మోసం చేసుకుంటా పోతుంటే ఈ నిర్వాసితులకు న్యాయం ఎలా జరుగుతుందని ఆ గిరిజనేతర కుటుంబాలు ఆందోళన చెందుతున్నారు. గిరిజనేతర కుటుంబాల అందరికీ వన్ టైం సెటిల్‌మెంట్ నీ అంట కడతానికి జరుగుతున్న నాటకం అని, ఒకపక్క 2013 భూ సేకరణ చట్టంలో పోలవరం ప్రాజెక్టు వల్ల నిర్వాసితులగుతున్న నిర్వాసిత కుటుంబాలకు 27 రకాల మౌలికసదుపాయాలు కల్పిస్తూ పునరావాస కాలనీలు కట్టించి మేము తీరుతామని, గ్రామ సభల్లో చెప్పిన అధికారులు ఏమైపోయారు ఇప్పుడు రోజుకో కొత్త నాటకం ప్రభుత్వము, ప్రభుత్వ అధికారులు ఆడుతున్నారనీ, ఇలా చేస్తే నిర్వాసితులు మళ్లీ మళ్లీ ఉద్యమ బాట పట్టాల్సిన రోజులు వస్తాయనీ హెచ్చరించారు.

# ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా


బుధవారం 08 జూలై 2026

## క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్..

**- : గార్లదిన్నె మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద, కల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎస్ఐఆర్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్..- : వేగంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను చేపట్టాలి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తనిఖీ చేశారు. మంగళవారం ముందుగా గార్లదిన్నె మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద పోలింగ్ కేంద్రాలు 42 నుంచి 49 పరిధిలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈరోజు గార్లదిన్నె మండలంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)ను తనిఖీ చేసి పర్యవేక్షణ చేయడం జరిగిందన్నారు. ఎస్.ఐ.ఆర్ లో చివరి కొన్ని రోజులు ఉన్నాయని, జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారుగా 60 శాతం దాకా ఈ ప్రక్రియను పూర్తి చేయగలిగామని, మిగిలిన 40 శాతం మంది ఎవరైతే ఉన్నారో రాబోయే రెండు మూడు రోజుల్లో వీలైనంత వరకు త్వరలోనే ఈ ఎన్యుమరేషన్ ఫారాలను వెనక్కి ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఎస్.ఐ.ఆర్ కింద ఎన్యు





మరేషన్ ఫారాలను ఇచ్చినప్పుడు ఆ ఎన్యుమరేషన్ ఫారాలను ఫిల్ చేసి ఇస్తే చాలు అని, దాంతో పాటు డాక్యుమెంట్లుగాని, 2022 ఓటర్ లిస్ట్ మ్యాపింగ్ గాని, అవేమీ తప్పనిసరి కాదని, మీ దగ్గర ఇన్ఫర్మేషన్ ఉంటే ఇవ్వండి, లేని పరిస్థితుల్లో అయితే మాత్రం దయచేసి ఆ ఎన్యుమరేషన్ ఫారాలను కనీసం ఫిల్ చేసైనా మీ బి.ఎల్.ఓకి అందించేటట్టు చూడాలన్నారు. బి.ఎల్.ఓలు కూడా మీ ఇంటింటికి వస్తారు, అదే కాకుండా ప్రతి ఒక్క పొలిటికల్ పార్టీ వారు వస్తారని, ప్రతి ఒక్కరూ ఎన్యుమరేషన్ ఫారాలను ఫిల్ చేసి ఇవ్వాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్ ద్వారా ప్రతిరోజూ కనీసం 50 మంది ఓటర్ల వివరాలను సేకరించవచ్చన్నారు. దయచేసి బూత్ లెవల్ ఏజెంట్లను సంప్రదించి, ఎన్యుమరేషన్ ఫారాలను నింపమని కోరుతున్నామన్నారు. ఒకవేళ మీరు ఆ ఫారమ్‌లను నింపలేకపోతే, ఆ ఓట్లు ఓటరు జాబితా నుండి తొలగించబడతాయని, ఖచ్చితంగా ఈఎఫ్ ఫారమ్‌లను నింపాలన్నారు. ఒకవేళ 2002 ఓటర్ల జాబితాకు సంబంధించిన మ్యాపింగ్ లేదా సరైన పత్రాలు లేకపోయినా, కనీసం ఈఎఫ్ ఫారమ్‌ను నింపాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఎన్ని ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు, ఎన్ని తిరిగి తీసుకుని అప్లోడ్ చేశారు అంటూ బిఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. పలువురు బిఎల్ఏలు, ఓటర్లతో మాట్లాడి ఎస్ఐఆర్ లో సమస్యలను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం గార్లదిన్నె మండలంలోని కల్లూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పోలింగ్ కేంద్రం 18 పరిధిలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. బిఎల్ఓలు, బిఎల్ఏలు, ఓటర్లతో మాట్లాడారు. నిర్ణీత గడువులోపు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఈరమ్మ, ఇంచార్జి ఎంపిడిఓ బాబా ఫక్రుద్దీన్, బిఎల్ఓలు షహనాజ్ బేగం, ప్రతిభ, రాజేంద్ర, బిఎల్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థినికి ఘన సన్మానం

ప్రజాభూమి, హిందూపురం టౌన్



పాంచజన్య పాఠశాల పూర్వ విద్యార్థిని కీర్తనను మంగళవారం పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. న్యాయవాది సిద్దు, పద్మావతి దంపతుల కుమార్తె సాయి కీర్తన ఇంజనీరింగ్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు డాక్టర్ పిఎస్. శ్రీనివాసులు, కరస్పాండెంట్ నందకుమార్ కీర్తనను సన్మానించి మాట్లాడుతూ, తమ పాఠశాలలో 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యాభ్యాసం చేసి, అత్యున్నత మార్కులు సాధించి కర్నూలు పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ లో గోల్డ్ మెడల్ సాధించడమే కాకుండా, కాలేజ్ టాపర్, ఉమెన్స్ టాపర్, బ్రాంచ్ టాపర్ గా నిలిచిందని ప్రశంసించారు. భవిష్యత్తులో సివిల్ సర్వీస్ లో ఐఏఎస్ ర్యాంకు సాధించి దేశ సేవ చేయాలనే సంకల్పంతో మా పాఠశాలకు వచ్చిన పూర్వ విద్యార్థిని చూసి గర్వపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గాయిత్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ పత్రాలు బీఎల్‌వోలకు అందజేయాలి

**- మ్యాపింగ్ ప్రక్రియలో ఎలాంటి తప్పులకు తావివ్వొద్దు**

**- సహాయ ఎన్నికల నమోదు అధికారి జీ. శివశంకర్ రెడ్డి**

ప్రజాభూమి, వేంపల్లె



ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా తమ ఎన్యూమరేషన్ పత్రాలను పూర్తిగా నింపి, సంబంధిత బీఎల్‌వోలకు నిర్ణీత గడువులోగా అందజేయాలని సహాయ ఎన్నికల నమోదు అధికారి, తహసీల్దార్ జీ. శివశంకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఆయన పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి తప్పనిసరిగా బూత్ లెవల్ అధికారికి అందజేయాలని సూచించారు. గడువులోగా పత్రాలు సమర్పించని వారు ముసాయిదా ఓటరు జాబితాలో పేరు కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, మ్యాపింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా బీఎల్‌వోలు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. మొత్తం 46,022 మంది ఓటర్లలో ఇప్పటివరకు 28 వేల మంది మ్యాపింగ్ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లోకేష్, సిబ్బంది సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మున్సిపల్ వైకాపా ఇన్చార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గంగాధర్ రెడ్డి ల జన్మదిన వేడుకలు

**50 కేజీల భారీ కేక్ ఏర్పాటుచేసిన మాజీ కౌన్సిలర్ కోడి రమణ**

ప్రజాభూమి,పులివెందుల



పులివెందుల మున్సిపల్ వైకాపా ఇన్చార్జి వైయస్ మనోహర్ రెడ్డి, పట్టణ వైకాపా కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి జన్మదిన వేడుకలను మాజీ కౌన్సిలర్ కోడి రమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వైయస్ మనోహర్ రెడ్డి నివాస ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో 50 కేజీల భారీ కేక్‌ను కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కోడి రమణ వైయస్ మనోహర్ రెడ్డి, హాల్ గంగాధర్ రెడ్డిని దుశ్శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం వారి చేతుల మీదుగా 50 కేజీల కేక్‌ను కట్ చేయించి హాజరైన వైకాపా నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కోడి రమణ మాట్లాడుతూ మీ ఇరువురు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని దేవుడిని ప్రార్థిస్తున్నానన్నారు. మంచికి మారుపేరు, ప్రజా సేవకుడు వైయస్ మనోహర్ రెడ్డి అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ చైర్మన్ చిన్నప్ప, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, నాగరాజు తదితర వైకాపా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పులివెందుల చేరుకున్న మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి

**జన సంద్రంలో జగన్ క్యాంపు కార్యాలయం**

**పులివెందులలో ప్రజా దర్బార్ నిర్వహించిన జగన్**

ప్రజాభూమి,పులివెందుల



రెండు రోజుల పర్యటనలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మంగళవారం ఉదయం 11:30 గంటలకు పులివెందులకు చేరుకున్నారు. హెలీప్యాడ్ వద్ద పలువురు నాయకులు పూల బొకేలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి వాహనంలో క్యాంపు కార్యాలయానికి చేరుకొని ప్రజా దర్బార్ నిర్వహించారు. జగన్ వాహనం హెలీప్యాడ్ నుంచి క్యాంపు కార్యాలయానికి వెళ్లే దారి పొడుగునా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు "జై జగన్" అంటూ నినాదాలు చేస్తూ స్వాగతం పలికారు. యువకులు ఉత్సాహంగా ఆయనతో సెల్ఫీలు దిగారు. జగన్ వాహనం నుంచి అభివాదం చేస్తూ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.క్యాంపు కార్యాలయానికి చేరుకున్న అనంతరం జగన్ ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా, నియోజకవర్గాల నుంచి వచ్చిన పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై ఆయనను కలిశారు. జగన్ వచ్చిన వారందరినీ ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.జగన్‌ను కలిసేందుకు క్యాంపు కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో వైకాపా నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. కార్యాలయం ఆవరణ జన సంద్రంగా మారింది. భద్రతా సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.బుధవారం ఉదయం 7:30 గంటలకు జగన్ ఇడుపులపాయ చేరుకొని దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకల్లో పాల్గొననున్నారు.

## మొక్కలు నాటిన న్యాయమూర్తులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం న్యాయమూర్తులు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అదనపు జిల్లా జడ్జి వి. వెంకటేశ్వరరావు నేతృత్వంలో సీనియర్ సివిల్ జడ్జి హేమలత, జూనియర్ సివిల్ జడ్జిలు నిఖిల్ రెడ్డి, లలితాలక్ష్మీ హారిక కోట, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్య న్యాయస్థాన ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణం దెబ్బతినకుండా ఉంటుందని న్యాయమూర్తులు తెలిపారు. మొక్కలు నాటడం తో పాటు వాటిని సంరక్షించడం కూడా బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా న్యాయస్థానాల సిబ్బంది పాల్గొన్నారు.

## సైద్ధాంతిక శిక్షణతో ఉద్యమాలకు పదును..!

- **జూలై 27, 28, 29 తేదీల్లో లేపాక్షిలో సీపీఐ రాజకీయ సైద్ధాంతిక శిక్షణ తరగతులు**
- **రైతు భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి**
- **అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించొద్దు -సీపీఐ నాయకులు**

ప్రజాభూమి, హిందూపురం టౌన్

పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యలపై సమర్థవంతమైన ఉద్యమాలు చేపట్టేందుకు రాజకీయ సైద్ధాంతిక అవగాహన అవసరమని, ఈ నెల 27, 28, 29 తేదీల్లో లేపాక్షిలో నిర్వహించనున్న సీపీఐ శ్రీ సత్యసాయి జిల్లా రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం హిందూపురం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో సీపీఐ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి శిక్షణా తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ మాట్లాడుతూ, పరిశ్రమల పేరుతో రైతుల వద్ద భూసేకరణ చేపట్టిన ప్రభుత్వం వెంటనే ఆ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, లేనిపక్షంలో రైతులకు భూములను తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఎకరా, రెండు ఎకరాల భూములు కలిగిన చిన్న రైతుల నుంచి భూములు సేకరించడం అన్యాయమని, వందల ఎకరాల భూములు కలిగిన పెద్ద భూస్వాముల వద్ద నుంచి పరిశ్రమలకు అవసరమైన భూములు సేకరించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతు సంఘం కార్యనిర్వహణ అధ్యక్షులు కాటమయ్య మాట్లాడుతూ, హంద్రీనీవా కాలువలో పెరిగిన



కంపచెట్లను వెంటనే తొలగించి నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించాలని, సత్యసాయి జిల్లాలోని అన్ని చెరువులకు సాగునీరు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ హిందూపురం తాలూకా కార్యదర్శి వినోద్ కుమార్ మాట్లాడుతూ, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ గడువును ఈ నెల 14వ తేదీ నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు పొడిగించాలని కోరారు. ఉపాధి కోసం బెంగళూరు, హైదరాబాద్, చెన్నై తదితర నగరాలకు వలస వెళ్లిన అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా వారికి తగిన అవకాశం కల్పించాలన్నారు. ఓటరు జాబితాలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించినట్లు గుర్తిస్తే వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి పునరుద్ధరించుకునేలా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ప్రజా సమస్యలపై మరింత బలమైన ఉద్యమాలు నిర్మించేందుకు రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులు కీలకమని, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని వాటిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహాదేవ్, జిల్లా అధ్యక్షుడు లింగన్న, ఉపాధ్యక్షుడు గోవిందరెడ్డి, సహాయ కార్యదర్శి చలపతి, తాలూకా సహాయ కార్యదర్శి ఇస్మాయిల్, కార్యవర్గ సభ్యులు చౌలూరు రవికుమార్, నరసింహమూర్తి, సమీవుల్లా, కమల్ భాషా, సబీరా, చాంద్ భాషా, శ్రీనివాసులు, జబీఉల్లా, మాబ్జాన్, లింగప్ప, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో లోక్ అదాలత్ ను విజయవంతం చేద్దాం

**-అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వరరావు**

ప్రజాభూమి, హిందూపురం టౌన్



పోలీసు అధికారులు, న్యాయవాదులు, న్యాయస్థాన సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి జాతీయ మెగా లోక్ అదాలత్ ను విజయవంతం చేద్దామని అదనపు జిల్లా జడ్జి వి.వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి హేమలత, జూనియర్ సివిల్ జడ్జిలు నిఖిల్ రెడ్డి, లలితా లక్ష్మీ హారిక కోట, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్యలతో కలిసి మెగా లోక్ అదాలత్ నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా జడ్జి మాట్లాడుతూ, నిబంధనల మేరకు రాజీ కాదగిన కేసులను ఖచ్చితంగా పరిష్కరించాలన్నారు. ఈ నెల 11వ తేదీన ప్రత్యేక బెంచ్ లను ఏర్పాటు చేసి కేసులను పరిష్కరించడం జరుగుతుందన్నారు. కక్షిదారులకు లోక్ అదాలత్ లో కేసులు పరిష్కరించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను పోలీసులు న్యాయవాదులు అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా పోలీసు స్టేషన్ల వారీగా సాధ్యమైనంత ఎక్కువ సంఖ్యలో కేసులను పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. న్యాయశాఖ పరంగా అవసరమైన పూర్తి సహకారాన్ని అందిస్తామని న్యాయమూర్తులు తెలిపారు. చెక్ బౌన్స్, మున్సిపాలిటీ, బిఎస్ఎన్ఎల్, బ్యాంక్ బ్యాంక్, భరణం వంటి కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనంత గోపాలకృష్ణ, సిఐలు రాజగోపాల్ నాయుడు, ఆంజనేయులు, ఎస్సైలు, ఆయా న్యాయస్థానాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి -పిడిఎస్ యూ నాయకులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పిడిఎస్ యూ జిల్లా అధ్యక్షులు బాబావలి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎంజీఎం ప్రభుత్వ పాఠశాలను పిడిఎస్ యూ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు బాబావలి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన కోడిగుడ్లు, మధ్యాహ్నం భోజనాన్ని అందించాలన్నారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం నుంచి విద్యార్థులకు ఇవ్వాల్సిన మొత్తాన్ని పూర్తి స్థాయిలో అందించే విధంగా చూడాలని విద్యార్థి సంఘంగా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థి సంఘం నాయకులు నాగేంద్ర, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ భృతి, మహిళలకు 1500 హామీల అమలు ఊసే లేదు

**మేనిఫెస్టో హామీలు గాలికొదిలేశారు**

**ప్రజా సమస్యల పరిష్కారమే వైకాపా లక్ష్యం**

**ప్రజాదర్బార్ నిర్వహించిన ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి**

ప్రజాభూమి, పులివెందుల



ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మంగళవారం తన నివాస ప్రాంగణంలో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు 1500 రూపాయల హామీ వంటి మేనిఫెస్టో హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. తన నివాస ప్రాంగణానికి వచ్చిన పలువురు ప్రజలు, వైకాపా నాయకులు, కార్యకర్తల నుంచి అవినాష్ రెడ్డి వినతులు స్వీకరించారు. సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు..ఈ సందర్భంగా అవినాష్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. నిరుద్యోగ యువతకు నెలకు 3000 రూపాయల భృతి, మహిళలకు నెలకు 1500 రూపాయల ఆర్థిక సహాయం అనే హామీలు కేవలం ఎన్నికల మాటలుగానే మిగిలిపోయాయన్నారు. ప్రజలను మోసం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, సంక్షేమ పథకాలు కుంటుపడుతున్నాయని అవినాష్ రెడ్డి విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలు, మెగా డీఎస్సీ నోటిఫికేషన్, ఉచిత ఇసుక తదితర అంశాల్లో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా కాకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.ప్రజల కష్టాలు తెలుసుకోవడానికి తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, వైకాపా శ్రేణులు ప్రజలకు అండగా నిలుస్తాయని అవినాష్ రెడ్డి భరోసా ఇచ్చారు.



## స్మార్ట్ కిచెన్‌తో కార్మికుల ఉపాధి కోల్పోకూడదు

**- రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డా. తులసిరెడ్డి విజ్ఞప్తి**

ప్రజాభూమి, వేంపల్లె



స్మార్ట్ కిచెన్‌ల ఏర్పాటుతో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఉపాధి కోల్పోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీసీసీ మీడియా ఛైర్మన్ డా. తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్మాణ దశలో ఉన్న స్మార్ట్ కిచెన్‌ను, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ 1995 ఆగస్టు 15న అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అమలవుతున్న ఈ పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆకలి సమస్యను నివారించడం, డ్రాప్అవుట్లు తగ్గించడం, పాఠశాలల్లో హాజరు శాతం పెంచడం లక్ష్యాలుగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. మధ్యాహ్న భోజన పథకం వల్ల విద్యార్థుల హాజరు శాతం పెరగడంతో పాటు పలువురికి ఉపాధి లభించిందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మండలానికి ఒక స్మార్ట్ కిచెన్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి పాఠశాలలకు భోజనం సరఫరా చేసే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించిందన్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో విద్యార్థులకు భోజనం ఆలస్యంగా అందుతోందన్న ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. ఇటువంటి సమస్యలకు తావులేకుండా నాణ్యమైన భోజనం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఉపాధి కోల్పోకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, స్టాలిన్, హెచ్ఎం శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు ధర్మారెడ్డి, జనార్దన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ధ్రువకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు ఉత్తన్న, అమర్నాథ్ రెడ్డి, రవీంద్రారెడ్డి, రమణ, నాగరాజు, వేమయ్య తదితరులు పాల్గొన్నారు.

# అధికారాన్ని సేవగా మార్చిన వైఎస్సార్

## ప్రజా హృదయ విజేత: డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా ఆయన 'లీడర్‌షిప్' ఒక కేస్ స్టడీ!

ప్రజాభూమి పోరుమామిళ్ళ : ఆంధ్రప్రదేశ్ రాజకీయ యవనికపై చెరపలేని ముద్ర వేసిన మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి (వైఎస్సార్) 77వ జయంతి సందర్భంగా... సంప్రదాయ శైలికి భిన్నంగా, ఆయన వ్యక్తిత్వంలోని సరికొత్త కోణాలను ఆవిష్కరిస్తూ ఒక ప్రత్యేక దృష్టి .

సాధారణంగా ఒక నాయకుడిని ఆయన సాధించిన విజయాలు, ప్రవేశపెట్టిన పథకాలతో కొలుస్తారు. కానీ, వైఎస్ రాజశేఖర్ రెడ్డిని కేవలం 'పథకాల ముఖ్యమంత్రి'గా చూస్తే ఆయనలోని అసలైన నాయకత్వాన్ని పూర్తిగా అంచనా వేయలేము. నేటి కార్పొరేట్ ప్రపంచం, మేనేజ్‌మెంట్ గురువులు బోధించే "ఎమోషనల్ ఇంటెలిజెన్స్" (భావోద్వేగ నైపుణ్యం), "ఎంపతి" (సహానుభూతి) లకు వైఎస్సార్ ఒక సజీవ నిఘంటువు. ఆయన 77వ జయంతి సందర్భంగా, నేటి తరానికి స్ఫూర్తినిచ్చే ఆయన నాయకత్వ సూత్రాలపై ఒక విశ్లేషణ.

1. 'కనెక్ట్' అవ్వడం కాదు... 'కలిసిపోవడం'! ఇప్పుడున్న డిజిటల్ యుగంలో నాయకులు ప్రజలతో కనెక్ట్ అవ్వడానికి సోషల్ మీడియాను వాడుతున్నారు. కానీ, వైఎస్సార్ ఎలాంటి సాంకేతికత లేని రోజుల్లోనే 'పాదయాత్ర' అనే అస్త్రంతో ప్రజల హృదయాల్లోకి నేరుగా నడిచివెళ్లారు.

కొత్త కోణం: పాదయాత్ర అనేది కేవలం ఓట్ల కోసం చేసిన ప్రచారం కాదు; అది ఒక నాయకుడు తన ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకోవడానికి చేసిన సుదీర్ఘ అధ్యయనం. ఎండనక, వాననక ఆయన వేసిన ప్రతి అడుగు... ప్రజల కళ్లలోని ఆశను, గుండెల్లోని బాధను చదవడం నేర్పింది.

2. విశ్వసనీయతకు బ్రాండ్ అంబాసిడర్

రాజకీయాల్లో "మాట ఇవ్వడం... తప్పడం" అనేది సర్వసాధారణం అనుకునే రోజుల్లో, "మాట తప్పను... మడమ తిప్పను" అనే నినాదాన్ని తన వ్యక్తిత్వంగా మార్చుకున్నారు వైఎస్సార్.

ఆచరణాత్మక నాయకత్వం: ఉచిత విద్యుత్ ఫైల్‌పై మొదటి సంతకం చేయడం ద్వారా, నాయకుడు అనేవాడు క్లిష్ట పరిస్థితుల్లోనూ తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలని నిరూపించారు. ఆయన చూపిన ఈ ధైర్యమే ప్రజల్లో ఆయనపై అచంచలమైన విశ్వాసాన్ని పెంచింది.

3. సంక్షేమం -- ఉచితం కాదు... అదొక 'మానవ పెట్టుబడి'



ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108 అంబులెన్స్ సేవలు... వీటిని కేవలం ఉచిత పథకాలుగా చూస్తే తప్పులో కాలేసినట్లే. అవి నిజానికి మానవ వనరులపై చేసిన పెట్టుబడులు.

దూరదృష్టి: ఒక పేద విద్యార్థికి ఫీజు చెల్లిస్తే ఆ కుటుంబం పేదరికం నుంచి బయటపడుతుందని, ఒక పేదవాడికి ప్రాణరక్షణ అందిస్తే ఆ కుటుంబం నిలబడుతుందని ఆయన విశ్వసించారు. ఆర్థికశాస్త్ర సూత్రాలను సామాన్యుడి సంక్షేమానికి అన్వయించిన అరుదైన నాయకుడిగా నిలిచారు.

4. రాజసం వెనుక గులాబీ హృదయం

ఆయన నవ్వులో ఎంతటి సమ్మోహన శక్తి ఉందో, ఆయన గంభీరత్వంలో అంతటి రాజసం ఉండేది. ప్రత్యర్థులను సైతం "భళా" అనిపించేలా రాజకీయం చేయడం ఆయన ప్రత్యేకత.

"రాజకీయం వ్యూహాలతో నడుస్తుంది... కానీ పరిపాలన కేవలం గుండెతోనే సాధ్యమవుతుంది." రాజకీయ వ్యూహాల్లో ఎంతటి కఠినత్వాన్ని ప్రదర్శించేవారో... ప్రజల సమస్యల దగ్గరకు వచ్చేసరికి అంతటి సున్నితత్వాన్ని చూపించేవారు.

ముగింపు: మరణం లేని మహానాయకుడు

కొంతమంది అధికారంలో ఉన్నప్పుడే నాయకులుగా వెలుగుతారు. కానీ, వైఎస్సార్ అధికారం కోల్పోయినప్పుడు ధైర్యంగా నిలబడ్డారు, అధికారంలోకి వచ్చాక ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు, భౌతికంగా దూరమైన తర్వాత ఒక చరిత్రగా మిగిలిపోయారు. భౌతిక కాయానికి ముగింపు ఉంటుంది. కానీ కోట్లాది మంది గుండెల్లో నిలిచిన "వైఎస్సార్" అనే నమ్మకానికి, సేవా స్ఫూర్తికి, ప్రజలపై ప్రేమకు ఎప్పటికీ ముగింపు లేదు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా ఆ మహానేతకు ఘన నివాళులు.

**బొల్లు రామ మోహన్**
**రచయిత**

# ఘనంగా రామాయపల్లె గ్రామంలో పోలేరమ్మ, పోతురాజు, త్రిశూలం ప్రతిష్ట మహోత్సవం

## పోలేరమ్మ, పోతురాజు ప్రతిష్ట హోమానికి ప్రజలందరూ సహకరించాలి రామాయపల్లి గ్రామ ప్రజలు విన్నపం





ప్రజాభూమి పోరుమామిళ్ల : ఘనంగా రామాయపల్లి గ్రామంలో పోలేరమ్మ గ్రామోత్సవం, నూతన పోతురాజు ప్రతిష్ట, త్రిశూలం ప్రతిష్ట 7,8,9,తేదీల్లో ఘనంగా మొదటి రోజు బిందె సేవా కార్యక్రమం, అభిషేకం కుంకుమార్చన హోమము తీర్థ ప్రసాదం రెండో రోజు జలాధివాసం పాలాభిషేకం, దాన్యాధివాసం, మూడో రోజు నూతన విగ్రహ ప్రతిష్ట శాంతి పూజ,చండీ హోమం,నవగ్రహ అష్టదిగ్బాల క హోమం, అనంతరం శాంతి హోమం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాదం,, అనంతరం దేను,దర్పణ దర్శనం జరుగును అలాగే ప్రతిరోజు మధ్యాహ్నం ఉదయం వచ్చిన భక్తాదులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగింది. మొదటి రోజు మన్యం వెంకటేశు, రెండో రోజు పిడుగు పేరయ్య, మూడో రోజు పిడుగు సిద్దయ్య వారి కుటుంబ సభ్యుల సహకారంతో వచ్చిన భక్తాదులకు భోజన సదుపాయం కల్పించడం జరిగింది. అలాగే పోలేరమ్మ దేవస్థానానికి స్థలం దాత గుర్రంకొండ శ్రీనివాసులు టైల్స్ పెయింట్ అక్కి దాసరి వెంకటరమణ, దేవుని హుండీ సిద్దు రవి, కుటుంబ సభ్యులు సహకారంతో జరుగును అదేవిధంగా పిడుగు చిన్న పేరయ్య 35 కేజీల పోలేరమ్మ పంచలోక విగ్రహం, బొగ్గరపు సిద్దేశ్వరమ్మ త్రిశూలం, పోతురాజు విగ్రహం బొగ్గవరపు రవణమ్మ, ప్రేమ్ తోరణం బొగ్గవరపు కొండమ్మ ఈ విధంగా పోలేరమ్మ దేవస్థానం అభివృద్ధి చెందుతూ గ్రామంలో అనేక మంది దాతలు వివిధ రూపాల్లో రేకులు అరుగులు కొళాయిలుఏర్పాటు చేయడం జరిగింది. దేవాలయం చుట్టూ మిస్ ఫోల్స్ బండలు దాతలు ముందుకు వచ్చి పోలేరమ్మ దేవాలయం అభివృద్ధికి సహకరించడం జరుగుతా ఉంది ఈ మూడు రోజులు పాటు జరిగే హోమంలో భక్తాదులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ముఖ్యంగా బుధవారం సాయంత్రం గ్రామోత్సవ కార్యక్రమం అత్యంత అంగరంగ వైభవంగా జరుగును భక్తాదులందరూ వచ్చి తిలకించి స్వామి వారి కృపకు పాత్రులు వదలని రామాయపల్లి గ్రామ ప్రజలు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు, బంధువులు కుటుంబ సభ్యులు, వివిధ గ్రామాల నుంచి రావడం మంచి అహులోదకరమైన వాతావరణంలో పోలేరమ్మ, పోతురాజు విగ్రహం ప్రతిష్ట కార్యక్రమం జరుగును.

# దండోరా జెండా రెపరెపల్లో ఆత్మగౌరవ స్ఫూర్తి

## కవలకుంట్ల, ఫాతిమాపురం, టీ.రామాపురంలో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



ప్రజాభూమి పోరుమామిళ్ళ : పోరుమామిళ్ళ మండలంలోని కవలకుంట్ల, ఫాతిమాపురం, టీ.రామాపురం గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం మరియు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. దండోరా జెండా ఆవిష్కరణలు, కేక్ కటింగ్, ఉద్యమ నినాదాలు, సామాజిక చైతన్య సందేశాలతో కార్యక్రమాలు ఉత్సాహభరితంగా సాగాయి. గ్రామాల్లో దండోరా జెండాను ఆవిష్కరించిన అనంతరం పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం జరిపారు. కార్యకర్తలు, యువత, మహిళలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉద్యమ ఐక్యతను చాటిచెప్పారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కమిటీ సభ్యులు ఓబులాపురం శోభన్ కుమార్, ఎంఈఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సగిలి జాకోబ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు నారిపోగు సింహరాయలు మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్ మూడు దశాబ్దాలుగా అణగారిన వర్గాల ఆత్మ గౌరవం, సామాజిక న్యాయం, రాజ్యాంగబద్ధ హక్కుల సాధన కోసం సాగుతున్న చారిత్రాత్మక ఉద్యమమని పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ, దండోరా జెండా కేవలం ఒక ఉద్యమ పతాకం మాత్రమే కాదని, అది స్వాభిమానం, సామాజిక చైతన్యం, సమాన అవకాశాల సాధనకు ప్రతీక అని అన్నారు. ఉద్యమ ఆశయాలను ప్రతి గ్రామానికి చేర్చడం, యువతలో చైతన్యం పెంపొందించడం, విద్య, సంఘటిత శక్తి, రాజ్యాంగంపై అవగాహన పెంచడం నేటి తరం బాధ్యత అని స్పష్టం చేశారు. సమాజంలో శాశ్వత మార్పు రావాలంటే ఉద్యమంతో పాటు విద్య, ఆర్థిక స్వావలంబన, నాయకత్వ వికాసం, సామాజిక ఐక్యత కూడా సమానంగా అవసరమని నాయకులు పేర్కొన్నారు. గ్రామస్థాయిలో ప్రతి కుటుంబం ఉద్యమ లక్ష్యాలను అర్థం చేసుకుని సామాజిక న్యాయం సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నారిపోగు మనోజ్ సాగర్, ఎమ్మార్పీఎస్ పోరుమామిళ్ళ మండలఅధ్యక్షులు వీరపోగు రాజేష్, మండల ప్రధాన కార్యదర్శి ఈరి బాలుడు, గ్రామ కమిటీ నాయకులు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, మాదిగ ఉద్యోగులసమాఖ్య సభ్యులు, యువత, మహిళలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోరుమామిళ్లలో ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

## ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలి ఏఐఎస్ఎఫ్ డిమాండ్



ప్రజాభూమి పోరుమామిళ్ల : విద్యార్థులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు వీరశేఖర్, సిపిఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్ ప్రభుత్వాలు చేస్తున్న తీరుపై ఆగ్రహం చెందారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి రవికుమార్ అధ్యక్షతన సమావేశం జరిగినది. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలను నాశనం చేసే జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని కోరారు పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ 7000 కోట్ల బకాయిలు విద్యార్థులకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంబడే బకాయిలు పూర్తిగా చెల్లిస్తామని వాగ్దానాలు, నమ్మబలికి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన అరకొర చెల్లించడం సిగ్గుచేటు అన్నారు. బద్వేల్ నియోజకవర్గం సంక్షేమ హాస్టల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రధానంగా బద్వేలు పట్టణంలో కళాశాల హాస్టల్ సొంతభవనం లేక అద్దె భవనంలో అవస్థలు పడుతున్నారని తక్షణమే సంక్షేమ మరియు రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టి పరిష్కరించాలని వారు కోరారు ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నమ్మ వలిగి నరేంద్ర మోడీ సర్కార్ నేడు విద్యార్థులను నిరుద్యోగులను విస్మరించిందని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూడా డబుల్ ఇంజన్ సర్కారులు అద్భుతమైన అభివృద్ధి అని గొప్పలు చెబుతున్నదని ఎంతో కష్టపడి ఆశలతో ఆశయాలకు చేరుకునే నీటి విద్యార్థుల యొక్క ప్రశ్నా పత్రం లీకైనప్పటికీ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడిచినప్పటికీ నేటికీ పాఠశాలలో సంక్షేమ హాస్టల్ లో విద్యార్థుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయని బద్వేల్ నియోజకవర్గంలో కొన్ని హాస్టళ్లకు వార్డెన్ లేకపోవడంతో ఒక్క వార్డుని రెండు లేక మూడు హాస్టళ్లకు ఇన్చార్జీలుగా వ్యవహరించడంతో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని తక్షణమే రెగ్యులర్ హాస్టల్ వార్డులను నియమించాలని వారు డిమాండ్ చేశారు పోరుమామిళ్ల మండల కేంద్రంలో అధిక శాతం మైనార్టీ విద్యార్థులు ఉన్న నేపథ్యంలో ప్రత్యేక కళాశాల ఏర్పాటు చేయాలని వారు కోరారు అనంతరం ఏఐఎస్ఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నుకున్నారు కమిటీ అధ్యక్షులుగా జశ్వత్,,కార్యదర్శిగా జబిఉల్లా, సహాయకార్యదర్శి గా తరుణ్,, హారీఫ్, ఉపాధ్యక్షులు గా శమీర్, సోహెల్, కోశాధికారిగా భాష తో పాటు 15 మంది కమిటీ సభ్యులు గా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది సిపిఐ ఏరియా కార్యవర్గ సభ్యులు సఫా, నాగరాజు, మండల నాయకులు చాంద్బాషా, కమిటీ సభ్యులు ఫాజిల్, ఇలియాజ్, పీరా వల్లి, వాసిమ్, షారుక్, తేజ తదితరులు పాల్గొన్నారు.

# సమాచార పౌర సంబంధాల శాఖ జోన్ -4 నూతన ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్



ప్రజాభూమి ప్రతినిధి,కడప: రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారుల సమన్వయ సహకారాలు, సమాచారశాఖ, మీడియా సమిష్టి కృషితో.. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి ఫలాలను ప్రజలకు చేరవేసేందుకు పాటుపడదాం అని ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్ కోరారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ లోని సమాచార పౌర సంబంధాల శాఖ ఆర్జేడీ కార్యాలయంలో.. జిల్లాలోని మీడియా స్టాఫర్లు, సిబ్బందితో ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్ ఆత్మీయ పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైెస్ ఆర్ కడప జిల్లాలో జోన్-4 కార్యాలయంలో ఆర్జేడీగా విధులు నిర్వర్తించే అవకాశం రావడం సంతోషంగా ఉం దన్నారు. జోన్-4 పరిధిలోని జిల్లాల్లో సమాచార శాఖ, మీడియా పబ్లికేషన్స్, ప్రసారాల ద్వారా విస్తృతమైన సేవలు అందాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఈ జిల్లాల్లో అక్షరాస్యత, పేదరిక నిర్మూలన, వ్యవసాయం, ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ రకాల కార్యక్రమాలను, సంక్షేమ అభివృద్ధి ఫలాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో మీడియా పాత్ర చాలా కీలకమైనదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజలు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల సమన్వయ సహకారంతో మీడియా ప్రతినిధులు కర్తవ్య నిబద్ధతతో, పారదర్శకంగా వృత్తి ధర్మాన్ని నెరవేర్చాలన్నారు. సమాచార శాఖను పటిష్టం చేయడంతో పాటు.. జోన్-4 పరిధిలోని జిల్లాల్లో పాత్రికేయులకు వృత్తి పరంగా సహాయసహకారాలు అందించడంలో ఎల్లపుడు ముందుంటామన్నారు. సమాచార శాఖ, పాత్రికేయుల మధ్య సత్సంబంధాలు కొనసాగినప్పుడే... ప్రభుత్వ ఫలాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందగలవని, అందుకోసం అందరం సమిష్టిగా కృషి చేయాలని మీడియా ప్రతినిధులకు పిలుపునిచ్చారు. అనంతరం పలువురు పాత్రికేయులు, సిబ్బంది ఆర్జేడీ కి పుష్ప గుచ్చాలు అందజేసి.. దుశ్శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు, సమాచార శాఖ ఎడి కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆశా డే సందర్భంగా డెంగ్యూపై అవగాహన కార్యక్రమం



ప్రజాభూమి, సిద్ధవటం: ఆశా డే సందర్భంగా సిద్ధవటం మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో మంగళవారం డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ, జూలై 1 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడడం, నీటి తొట్లలో పాత నీటిని తొలగించి కొత్త నీటిని నింపడం, ప్లాస్టిక్ గ్లాసులు, పూల కుండీలు, పాత టైర్లు, కొబ్బరి బోండాలు వంటి వాటిలో నీరు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దోమల ఉత్పత్తిని నివారించవచ్చని తెలిపారు. జ్వరం, ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు స్వీయ వైద్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆశా వర్కర్లు ప్రజలకు డెంగ్యూ నివారణ చర్యలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళీమోహన్, సీహెచ్ఓ లక్ష్మీనరసింహ, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు, సూపర్వైజర్లు శారదాదేవి, మౌలాలి, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారానికి చమర్తి కి ఆహ్వానం

## - 9న సిద్ధవటంలో తమ్మిశెట్టి శ్రీలేఖ ప్రమాణ స్వీకారం



ప్రజాభూమి, సిద్ధవటం: సిద్ధవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన తమ్మిశెట్టి శ్రీలేఖ జూలై 9 గురువారం నాడు నిర్వహించనున్న ప్రమాణ స్వీకార మహోత్సవానికి రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్మోహన్ రాజును మంగళవారం ఆహ్వానించారు. రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ సూచన మేరకు రాజంపేటలోని జగన్మోహన్ రాజు గెస్ట్ హౌస్‌లో ఆయనను కలిసిన జనసేన నాయకుడు, చైర్‌పర్సన్ భర్త దేరంగుల శ్రీకాంత్ శాలువాతో సత్కరించి, పూలమాల వేసి, స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఇస్తోందన్నారు. జూలై 9న సిద్ధవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా (బాబీ), రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్, పేరూరు కొండయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

# పగిలిన తాగునీటి పైపుతో నీరు వృథా..

## - మరమ్మతులకు స్థానికుల విజ్ఞప్తి



ప్రజాభూమి,సిద్ధవటం: మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధి ఆలీనగర్‌లో తాగునీటి పైపు పగిలిపోవడంతో గత రెండు రోజులుగా తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్ నంబర్-8 ఎదురుగా ఉన్న ప్రాంతంలో పైపు పగిలిపోవడంతో విలువైన తాగునీరు వృథాగా పోవడంతో పాటు వీధంతా జలమయమైందని తెలిపారు. మరోవైపు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పైపును మరమ్మతు చేసి తాగునీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనరసయ్యను వివరణ కోరగా, పైపు పగిలిన విషయం తమ దృష్టికి వచ్చిందని, రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

# అంధులకు అన్నదానం




ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల మున్సిపల్ వైకాపా ఇన్చార్జి వైయస్ మనోహర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి జన్మదిన పురస్కారించుకొని మంగళవారం శ్రీనివాస థియేటర్ సమీపంలోని వీరనారాయణ స్వామి అంధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైకాపా చేనేత జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ చైర్మన్ రసూల్, వైయస్సార్ చారిటబుల్ ట్రస్ట్ యజమాని ఇరికిరెడ్డి వీరారెడ్డి హాజరయ్యారు. వారు అంధుల మధ్యలో జన్మదిన కేక్ కట్ చేసి వారికి పంపిణీ చేశారు. అనంతరం దాసరి ఈశ్వరయ్య ఏర్పాటు చేసిన మాంసంతో కూడిన భోజనాన్ని అంధులకు వడ్డించారు. ఈ సందర్భంగా దాసరి ఈశ్వరయ్య మాట్లాడుతూ వైయస్ మనోహర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రతి సంవత్సరం ఏదో ఒక సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది అంధులకు అన్నదాన కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. వారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధవటం ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ..

## - అక్రమ మద్యం, గంజాయిపై కట్టుదిట్టమైన నిఘాకు ఆదేశాలు



ప్రజాభూమి, సిద్ధవటం: మండల కేంద్రంలోని సిద్ధవటం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం కడప జిల్లా మద్యనిషేధ, అబ్కారీ అధికారి జె. రమేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసులు, స్టేషన్ రికార్డులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్సైజ్ పరిధిలోని సిద్ధవటం, అట్లూరు, ఒంటిమిట్ట మండలాల్లో అక్రమ మద్యం, నాటు సారా, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల తయారీ, రవాణా, విక్రయాలను అరికట్టేందుకు అనుమానిత ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఏర్పాటు చేసి, ఆకస్మిక దాడులు నిర్వహించాలని ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ రాజశేఖర్, ఎస్సై నారాయణ పాల్గొన్నారు.

# ప్రజాభూమి



బుధవారం 08 జూలై 2026


# రైల్వే ప్రాజెక్టులు, భూసేకరణ, జాతీయ రహదారులు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,

రైల్వే ప్రాజెక్ట్,భూసేకరణ, జాతీయ రహదారులు పనులు శ్రీ సిటీ ఫేస్ -2, ఎల్ జి ఫేస్-2, కొల్లాడం, ఇరుగుళం, పెద్దేటిపాకం, రాళ్లకుప్పం, స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్పైపు లైన్ పనులు,ఏ డీబి రోడ్డులు, దుగ్గరాజపట్నం పనులు, కృష్ణపట్నం పోర్ట్, రైల్వే ప్రాజెక్ట్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి శ్రీ సిటీలోని ఎల్జి, రాయల్ ఎంఫిల్డ్ కంపెనీకి సంబంధించి పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులపై సమీక్షా పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక భద్దంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు తో కలసి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మిని సమావేశ మందిరంలో రైల్వే ప్రాజెక్ట్ పనులు,జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైప్ లైన్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి దుగ్గరాజపట్నం పనులు, శ్రీ సిటీ ఫేస్ -2, ఎల్ జి ఫేస్-2,స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, అంశాలు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, ఏ డీబి రోడ్డులపై నిర్మాణ పురోగతి




పనులపై జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పి డి లు, రవీంద్ర రావు, రైల్వే ప్రాజెక్టు అధికారి, సదరన్ రైల్వే అధికారి వామన మూర్తి, నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎల్. శివకుమార్, టి టి డి వెల్ఫేర్ అధికారి, ఎస్ఈ ఇరిగేషన్, ఆర్అండ్ బి ఎస్ఈ, పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారి, సంబంధిత మండలాల తహసీల్దార్లు, కాంట్రాక్టర్లు,తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... శ్రీ సిటీ ఫేజ్ -2, ఏ పి ఐ ఐ సి లోని ఎల్ జి ఫేజ్ -1,2, 3 కొల్లాడం, ఇరుగుళం,పెద్దేటి పాకం,రాళ్లకుప్పం, శ్రీ సిటీ ఫేజ్ -1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, రాయల్ ఎంఫిల్డ్ ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ భూసేకరణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ కోర్టు కేసులను కూడా త్వరగా పరిస్కారం అయ్యేలా చూడాలన్నారు. వెబ్ ల్యాండ్ పై వున్న సమస్యలను సత్వరమే పరిస్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, విసిఐసి రోడ్డు, ఏపిఐఐసి ప్రాజెక్ట్,వైజాగ్ చెన్నై కారిడార్ పైపు లైను పనులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు పురోగతిలో ఉన్న పనులపై నడికుడి - శ్రీకాళహస్తి, ఏర్పేడు - పూడి, గుమ్మడి పూండి-గూడూరు, గూడూరు-రేణిగుంట, పాకాల - తిరుపతి, తిరుపతి - కాట్పడి అర్కోణం - రేణిగుంట, సంబంధించిన రైల్వే ప్రాజెక్ట పనులను, దుగ్గరాజపట్నం, వేగవంతం చేయాలన్నారు. ఆరు లైన్లు రహదారులు నిర్మాణం, నాయుడుపేట-రేణిగుంట, రేణిగుంట- కడప రేణిగుంట నుండి చెన్నై రహదారుల పనులు పూర్తి చేయాలని భూ సేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకొని నాణ్యత తో పనులు పూర్తి కావాలని అన్నారు. ఎయిర్పోర్ట్, ఇస్రేర్, కరకంబాడి, ఎమ్ ఐ జి లే అవుట్ తిమ్మాజికం డ్రిగ, పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. అలాగే ఆర్ అండ్ బి , పంచాయ తీరాజ్ ఇంజనీరింగ్, ఇరిగేషన్ ఫారెస్ట్, జల వనరుల శాఖ అధికారులు అందరూ కలసి సమన్వయంతో పెండింగ్ పనులను నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయాలన్నారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఎడిబి రోడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. వడమాల పేట, ఏర్పేడు మండలాలలో పాదిరేడు అరణ్యం, పల్లం గ్రామాల నందు టీటీడీ ఉద్యోగస్తులకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై కూడా త్వరిత గతిన చర్యలు తీసుకొని పూర్తి చేయాల న్నారు. ఈ సమావేశంలో తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓలు, రామ్మోహన్, బానుప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్, రోజ్ మాండ్, ఏపీఐఐసీ తిరుపతి జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్స్ అధికారి రాంప్రసాద్, శ్రీ సిటీ జనరల్ మేనేజర్ భగవాన్,సంబంధిత తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు , సెక్షన్ ఆధికారులు భాస్కర్, చైతన్య, భూసేకరణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటకు సీసీ కెమెరాల కవచం.. నేరగాళ్ల గుండెల్లో వణుకు

**ప్రతి కదలికపై పోలీసు కన్ను: సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో మెగా నిఘా వ్యవస్థ నేరాలకు నో ఎస్కేప్ పట్టణమంతటా అత్యాధునిక నిఘా నేత్రలు**

ప్రజాభూమి ప్రతినిధి సూళ్లూరుపేట



సూళ్లూరుపేట పట్టణంలో శాంతిభద్రతలను మరింత పటిష్టపరిచేందుకు పోలీసు శాఖ సరికొత్త వ్యూహానికి శ్రీకారం చుట్టింది. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ ప్రత్యేక చొరవతో పట్టణ వ్యాప్తంగా అత్యాధునిక సీసీ కెమెరాల నిఘా నెట్వర్క్ను ఏర్పాటు చేయనున్నారు. ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాలు, కాలనీలు, ప్రవేశ మార్గాలతో పాటు పబ్లిక్ ప్రదేశాలు, బస్ స్టాండ్లు, మార్కెట్లను కూడా ఈ నిఘా నేత్రాల పరిధిలోకి తీసుకురానున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణమంతా కెమెరాల పర్యవేక్షణలోకి రానుంది. నేరాలకు చెక్.. ప్రజలకు భరోసా ఈ నిఘా వ్యవస్థ అమల్లోకి వస్తే పట్టణంలోని ప్రతి కదలిక పోలీస్ కంట్రోల్ రూమ్లో రికార్డు అవుతుంది. దొంగతనాలు, ఘర్షణలు, మహిళలు, విద్యార్థినులపై వేధింపులు, ట్రాఫిక్ ఉల్లంఘనలను తక్షణమే గుర్తించి, అవాంఛనీయ ఘటనలు జరిగిన వెంటనే నిందితులను వేగంగా పట్టుకోవడంలో ఇవి కీలకంగా ఉపయోగపడతాయని పోలీసులు పేర్కొన్నారు. అత్యవసర సమయంలో పోలీసులు వేగంగా స్పందించే అవకాశం లభిస్తుందని, దీంతో ప్రజల్లో రక్షణ భావన పెరుగుతుందని, అదే సమయంలో నేరాలకు పాల్పడే వారిలో భయం కలుగుతుందని అధికారులు తెలిపారు. ప్రజలు సహకరించాలి: సీఐ మురళీకృష్ణ ఈ సందర్భంగా సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ, సూళ్లూరుపేటను నేరహిత, సురక్షిత పట్టణంగా తీర్చిద్దడమే లక్ష్యమన్నారు. ప్రభుత్వంతో పాటు ప్రజలు, వ్యాపారులు కూడా స్వచ్ఛందంగా తమ ఇళ్లు, దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీసులకు సహకరించాలని కోరారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కట్ట పుట్టాలమ్మ గుడి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం.. ఆచూకీ తెలపాలని పోలీసుల విజ్ఞప్తి

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



తిరుపతి జిల్లా రేణిగుంట పట్టణంలోని కట్ట పుట్టాలమ్మ గుడి సమీపంలో మంగళవారం ఉదయం గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రేణిగుంట పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, మృతుడు సుమారు 45 నుంచి 50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తిగా గుర్తించారు. ఆయన ఎరుపు-నలుపు రంగు చెక్స్ షర్ట్ ధరించి ఉన్నారు. సంఘటనా స్థలంలో సగం తాగిన మద్యం సీసా లభ్యమైన నేపథ్యంలో, రాత్రి సమయంలో మద్యం సేవించి డీహైడ్రేషన్ లేదా ఇతర సహజ కారణాల వల్ల మృతి చెంది ఉండవచ్చని ప్రాథమికంగా పోలీసులు భావిస్తున్నారు. మృతదేహంపై ఎలాంటి బాహ్య గాయాలు లేవని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, మృతుడి పేరు, చిరునామా లేదా కుటుంబ సభ్యుల వివరాలు తెలిసిన వారు వెంటనే రేణిగుంట పోలీస్ స్టేషన్ను సంప్రదించి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## యువ నేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదర్శ వృధా ఆశ్రమం లో అల్పాహారం అందజేశారు

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.



ఏర్పేడు మండలం సరస్వతి కండ్రిగ గ్రామం లో పురుషోత్తం ఓ హారిక కుమార్తె( నీనా అక్షయ యాదవ్ ) పుట్టినరోజు సందర్భంగా వారి పేరు మీద సహాయం వృధా ఆశ్రమం లో ఉన్న వృద్ధులు లకు మధ్యాహ్నం (భోజనం, చికెన్) అందజేయ



దం జరిగింది ఈ సందర్భంగా యువ నేస్తం అసోసియేషన్ వ్యవస్థాపకులు మునిశేఖర్ యువ నేస్తం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు వినోద్ మాట్లాడుతూ ఎవ్వరు ఆకలితో చనిపోకూడదు అనే సంకల్పం తో యువ నేస్తం అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ అనే కార్యక్రమం నికి శ్రీకారం చుట్టారు ఇందులో భాగంగా ఈ రోజు ఆదర్శ వృధా ఆశ్రమం లో వృద్ధులకు మానసిక రోజులకు భోజనాలు ఏర్పాటు చేయడంజరిగింది ఈ కార్యక్రమం వాలంటీర్స్ యుగంధర్,వెంకటేష్, భాస్కర్ , దాము,తదితరులు పాల్గొన్నారు.

## యువనాయకత్వమే మన బలం జనసేన ఆకాంక్ష.

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.




తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం"నాయకత్వ లక్షణాలు... యువతకు అప్పగిస్తేనే బంగారు భవిష్యత్తు!""సేవే లక్ష్యం... యువ నాయకత్వమే మన బలం!":యువ నాయకులు పనబాకం జయరాం, శ్రీ కాళహస్తి నియోజకవర్గ పరిధిలో ఏర్పేడు మండలం ఆమందూరు పంచాయతీ కీ చెందిన జన సేన పార్టీ యువ నాయకులు ఈరోజు తిరుపతి పార్లమెంట్ సమాచార సారథులు సేకరణ కమిటీ అధ్యక్షులురు నెల్లిమల్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి సమక్షంలో కలిసి బాధ్యత కొరకు తమ దరఖాస్తు చేసుకోవడం జరిగింది, తమకు పార్టీ కమిటీల్లో బాధ్యతలు దక్కడం ద్వారా గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడానికి ఇదొక చక్కని అవకాశం అని యువ నాయకులు భావిస్తున్నారు.జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీసుకువచ్చిన ఈ నూతన విధానం వల్ల పార్టీ కోసం అంకితభావంతో పనిచేసేవారికి సముచిత స్థానం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు కూటమి ప్రభుత్వ విజయాలు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి మరియు పార్టీ నిర్మాణం కోసం నిరంతరం శ్రమించేందుకు సిద్ధమని యువ నాయకుడు పనబాకం జయరాం తమ దరఖాస్తుల ద్వారా స్పష్టం చేస్తున్నారు ఈ అవకాశం కల్పించిన మండల అధ్యక్షులు , గుడి మల్లం ఆలయం బోర్డు సభ్యులు కిరణ్ రామ్ శెట్టి కి ,జన సేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కి నా హృదయపూర్వక ధన్యవాదములు అలాగే సమాచార సేకరణ కమిటీ అధ్యక్షులురు నెల్లిమల్ల నియోజకవర్గ ఇన్చార్జి కి లోక మాధవి ఎమ్మెల్యే కి నా హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేసుకుంటున్నాను.

## సూళ్లూరుపేటలో ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతం

**తహశీల్దార్ శైలకుమారి పర్యవేక్షణ.**

ప్రజాభూమి ప్రతినిధి సూళ్లూరుపేట.



తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఓటర్ల నమోదు, డిజిటలైజేషన్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. సూళ్లూరుపేట తహశీల్దార్ శైలకుమారి నేడు పలు పోలింగ్ స్టేషన్లను స్వయంగా సందర్శించి పురోగతిని పర్యవేక్షించారు. మతకమడి (. 196), ఇల్లుపూరు (. 200) మరియు మంగళంపాడు (198, 199) పోలింగ్ స్టేషన్లను తహశీల్దార్ విజిట్ చేసి, నమోదు ప్రక్రియను సమీక్షించారు. డిజిటలైజేషన్ పురోగతి: ఈ ప్రాంతాలలో ఉన్న మొత్తం 26,753 మంది ఓటర్లకు సంబంధించి, ఇప్పటివరకు 65 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయబడిందని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల పరిధిలోని బి ఎల్ ఓ లు ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుండే అందుబాటులో ఉంటూ, ప్రజల నుండి ఎన్యూమరేషన్ ఫారమ్స్ సేకరిస్తూ, వాటిని వెంటనే డిజిటలైజ్ చేస్తున్నారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ అధికారులు, బి ఎల్ఓలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# గేట్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం

- రోడ్డు భద్రతా నియమాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన
- హెల్మెట్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్ ప్రాముఖ్యతపై వివరాలు
- మహిళల భద్రత, ఆత్మరక్షణపై ప్రత్యేక అవగాహన
- బాధ్యతాయుతమైన రహదారి వినియోగంతో ప్రమాదాలను నివారించాలని పోలీసుల సూచన

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన పెంపొందించే కార్యక్రమాల్లో భాగంగా సోమవారం తిరుపతి నగరంలోని భావానీనగర్లో ఉన్న గేట్ డిగ్రీ కళాశాలలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో తిరుపతి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎ. సంజీవ్ కుమార్ పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలను రక్షించుకోవచ్చని, ట్రాఫిక్ సిగ్నల్స్ను తప్పకుండా పాటించాలని, జీబ్రా క్రాసింగ్లను సక్రమంగా వినియోగించాలని, రహదారులపై






బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విద్యార్థులకు వివరించారు. అలాగే ట్రాఫిక్ నిర్వహణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో మహిళల భద్రత, ఆత్మరక్షణ పద్ధతులు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించి, ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., సందేశం ఇస్తూ యువతలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తమ బాధ్యతగా భావించాలని, ప్రజలందరూ రోడ్డు భద్రతకు సహకరించాలని పిలుపునిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 112కు సమాచారం అందించాలని తిరుపతి జిల్లా పోలీసు శాఖ ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# సంస్థాగత నిర్మాణ సమీక్షా సమావేశం నందు పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

ప్రజాభూమి ప్రతినిధి శ్రీకాళహస్తి టౌన్



తిరుపతి జిల్లా డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు ఆధ్వర్యంలో, తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సమీక్ష సమావేశము నకు ఏఐసిసి సంయుక్త కార్యదర్శి గణేష్ యాదవ్ ఆంధ్రప్రదేశ్ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలి ముఖ్యఅతిథులుగా పాల్గొని కాంగ్రెస్ పార్టీ బలోపేతం కొరకు చేపట్టవలసినటువంటి కార్యక్రమాలు భవిష్యత్తు కార్యాచరణను మార్గ నిర్దేశం చేశారు. వారు మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజలకు చేరువ అవ్వాలని భారతదేశానికి కాంగ్రెస్ పార్టీ చేసినటువంటి సేవలను ప్రజలలోకి తీసుకుని వెళ్లాలని, ప్రజలు సుభిక్షంగా జీవించాలనా, సుపరిపాలన అందాలన్నా కాంగ్రెస్ పార్టీ అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి, నెల్లూరు జిల్లా పరిశీలకులు మాంగాటి గోపాల్ రెడ్డి,పీసీసీ ప్రధాన కార్యదర్శి టమటం వెంకట నరసింహులు, ఏఐసీసీ ఓ బి సి కర్ణాటక పరిశీలకులు మురళి, తిరుపతి నగర అధ్యక్షులు గౌడ పేరు చిట్టిబాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త పంట శ్రీనివాసులు రెడ్డి, సూళ్లూరుపేట నియోజకవర్గ సమన్వయకర్త వెంకటాచలపతి, సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త బళ్ళ హరి, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త ఇంగిలాల భాస్కర్, తిరుపతి జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, రేణిగుంట మండలం అధ్యక్షులు రాహుల్ రాయల్, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, మరియు జిల్లా కార్యవర్గం జిల్లా అనుబంధ విభాగాలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి పార్టీ సీనియర్ నాయకుల తో భేటీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.

సత్యవేడు మండల పరిధిలోని మదనంబేడు పంచాయతీకి చెందిన సీనియర్ టిడిపి నాయకులు వెంకటేశ్వర్లు ముదిరాజ్ ఆయన అల్లుడు నరేంద్ర ముదిరాజ్ ఇరువురిని వారి నివాసం వద్ద ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నేరుగా కలిసి టిడిపి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని మీ సేవలు టిడిపి పార్టీకి బలోపేతం చేస్తాయని మీకు అండగా మీ వెంట నేను ఉంటాను అంటూ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు ముదిరాజ్ కి గజమాలను శాలువాలు కప్పి మనస్ఫూర్తిగా మీ సేవలు కావాలంటూ ఎమ్మెల్యే ఆహ్వానించారు. టిడిపి యువ నాయకుడు నరేంద్ర ముదిరాజ్ తో మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో యువతని మీ గ్రామంలోని పార్టీ శ్రేణులను కలుపుకొని మరింత చురుగ్గా పార్టీ కి మీ సేవలు అందించాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం ఎమ్మెల్యే కోనేటి టిడిపి నాయకుడు, క్లస్టర్ ఇంచార్జ్ విజేవన్ పరమశివం స్వర్గహస్తానికి చేరుకొని పరమశివం తమ్ముడు విజేవన్ లీలా గారిని పరామర్శించి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆ కలియుగ వెంకటేశ్వర స్వామి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను లీల గారితో మాట్లాడుతూ మీ అన్నగా రి సహాయ సహకారాలు మీ సూచనలు సలహాలు పార్టీ బలోపేతానికి ఉపయోగపడేలా అందరండలు పార్టీ శ్రేణులు కావాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఇలంగోవన్ రెడ్డి ,రవి రెడ్డి, సుందర్ రామిరెడ్డి, లోకనాథ్ రెడ్డి, నరేంద్ర ముదిరాజ్, నాగరాజు ముదిరాజ్, ఈశ్వరయ్య ముదిరాజ్, పలువురు టిడిపి నాయకులు ఉన్నారు.



# ముక్త్ భారత్ యాప్ పై ప్రజలకు అవగాహన సదస్సు

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



తిరుపతి జిల్లా కుష్టు, ఎయిడ్స్ మరియు క్షయ నివారణ అధికారిణి డాక్టర్ శైలజ ఆదేశాల మేరకు టీ బీ ముక్త్ భారత్ యాప్ వల్ల ఉపయోగాలు గురించి రేణిగుంట మరియు వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో హెల్త్ సూపర్వైజర్ కామరాజు ఆశాకార్యకర్తలు,ఎఎన్ఎం లకు అవగాహన కల్పించి అందరూ టీబీ ముక్త్ భారత్ యాప్ ను తమ మొబైల్ లో డౌన్లోడ్ చేసుకుని టీబీ నిర్మూలన లక్ష్యాన్ని సాధించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "టీబీ ముక్త్ భారత్ యాప్"ప్రజలు,ఆరోగ్య సిబ్బందికి అనేక విధాలుగా ఉపయోగపడుతుందని, ప్రధానంగా టీబీ అనుమానితులను గుర్తించి రెఫర్ చేయడానికి,టీబీ రోగులను నమోదు చేసి చికిత్స పురోగతిని పర్యవేక్షించడానికి,,రోగులు క్రమం తప్పకుండా మందులు తీసుకునేలా గుర్తు చేసే సౌకర్యం కూడా ఇందులో ఉంటుందని,



రోగులకు అవసరమైన ప్రభుత్వ సేవలు,పథకాల సమాచారం తెలుస్తుందని, సమీప టీబీ పరీక్షా కేంద్రాలు,వాటి వివరాలు కూడా తెలుసుకోవచ్చని తెలిపారు.ఈ యాప్ ద్వారా నిక్షయ్ పోషణ వంటి ప్రభుత్వ ప్రయోజనాల సమాచారం పొందవచ్చని,టీబీపై అవగాహన,నివారణ చర్యలు,లక్షణాలపై ఆరోగ్య విద్యా సమాచారం అందుతుందని వివరించారు.సమాజంలోని నిక్షయ్ మిత్రులు రోగులకు పోషకాహార సహాయం అందించేందుకు ఉపయోగపడుతుందని, ఆరోగ్య శాఖకు కూడా టీబీ కేసుల పర్యవేక్షణ, నివేదికల నిర్వహణ సులభమవుతుందని వివరించారు.రెండు వారాలకుపైగా దగ్గు, దగ్గులో కళ్లె పడటం, కళ్లెతోపాటు రక్తం పడటం, జ్వరం,బరువు తగ్గడం, రాత్రి పూట చెమట పట్టడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పరీక్ష చేయించుకోవాలని,టీబీ పూర్తిగా నయమయ్యే వ్యాధియని,మందులను వైద్యుల సూచనల మేరకు పూర్తి కోర్సు తీసుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.రేణిగుంట వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి. మాట్లాడుతూ "టీబీని గుర్తిద్దాం -- పూర్తిగా చికిత్స తీసుకుందాం -- 2030 సంవత్సరానికి టీబీ ముక్త్ భారత్ సాధనకు కలిసి పనిచేద్దాం."అని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు,ఆశాకార్య కర్తలు,సూపర్వైజర్ లు బాబు,నాగరాజు,మురళి, లలిత,కామరాజు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పురుషోత్తమ రెడ్డి,డాక్టర్ సందీప్,డాక్టర్ చక్రపాణి పాల్గొన్నారు.

# సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ విజయభాస్కర్‌కు డాక్టరేట్

- జేఎన్‌టీయూ అనంతపురం నుంచి పీహెచ్‌డీ పట్టా
- 15 ఏళ్ల విద్యాసేవకు మరో మైలురాయి
- కళాశాలకు గర్వకారణమని చైర్మన్ అశోక్‌రాజు ప్రశంస





ప్రజాభూమి ప్రతినిధి పుత్తూరు

పుత్తూరులోని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో ఆచార్యుడిగా, పరీక్షల నియంత్రణాధికారిగా విధులు నిర్వహిస్తున్న విజయభాస్కర్ జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ), అనంతపురం నుంచి డాక్టరేట్ పట్టా అందుకుని కళాశాలకు గర్వకారణంగా నిలిచారు. "బహుళ ప్రమాణాల వైర్‌లెస్ సమాచార వ్యవస్థల కోసం పునర్నిర్మాణ సామర్థ్యం గల సాఫ్ట్‌వేర్ ఆధారిత రేడియో వ్యవస్థలు" అనే పరిశోధన అంశంపై డాక్టర్ మునస్వామి పర్యవేక్షణలో విజయభాస్కర్ పరిశోధన నిర్వహించారు. తన సిద్ధాంత గ్రంథాన్ని జేఎన్‌టీయూ అనంతపురానికి సమర్పించగా, విశ్వవిద్యాలయం పరిశోధన, అభివృద్ధి విభాగం పరిశీలన అనంతరం ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ చైర్మన్ అశోక్‌రాజు మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా అధ్యాపకుడిగా, పరీక్షల నియంత్రణాధికారిగా విజయభాస్కర్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. విద్యా బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ పరిశోధనలో అత్యున్నత విద్యార్హత సాధించడం ప్రతి అధ్యాపకుడికి ఆదర్శప్రాయమని కొనియాడారు. విజయభాస్కర్ సాధించిన ఈ ఘనత కళాశాలకు గర్వకారణమని పేర్కొంటూ ఆయనకు అభినందనలు తెలిపారు. విజయభాస్కర్ డాక్టరేట్ సాధించిన సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన సాధించిన ఈ విజయం విద్యా రంగంలో మరెంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆకాంక్షించారు.

# తిరుపతి సబ్ డివిజన్ పోలీసుల ప్రత్యేక గంజా ర్యాపిడ్ టెస్ట్

- మాదక ద్రవ్యాల నిర్మూలనకు జిల్లా పోలీసుల ప్రత్యేక చర్యలు
- 259 మందికి గంజా ర్యాపిడ్ టెస్ట్ నిర్వహణ
- పాజిటివ్‌గా తేలిన వ్యక్తి ద్వారా సరఫరా నెట్‌వర్క్‌పై విచారణ
- మాదక ద్రవ్యాలరహిత సమాజ నిర్మాణానికి పోలీసుల కట్టుబాటు






ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు ఆదేశాల మేరకు తిరుపతి సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనతో పాటు యువతలో అవగాహన పెంపొందించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం తిరుపతి లోని హరే రామ హరే కృష్ణ (ఇస్కాన్ టెంపుల్) సమీపంలోని గ్రౌండ్‌లో గంజా ర్యాపిడ్ టెస్ట్ ద్వారా ప్రత్యేక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు, ఆటో డ్రైవర్లు, స్విగ్గీ, జొమాటో డెలివరీ సిబ్బంది, టాక్సీ డ్రైవర్లు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు, రౌడీ షీటర్లు, అనుమానిత వ్యక్తులు తదితరులకు కలిపి మొత్తం 259 మందికి యూరిన్ నమూనాలను సేకరించి గంజా ర్యాపిడ్ టెస్ట్ నిర్వహించారు. పరీక్షల్లో గంజాయి వినియోగం ఉన్నట్లు పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని, గంజాయిని ఎక్కడి నుంచి కొనుగోలు చేశాడు, ఎవరి ద్వారా సరఫరా జరిగింది, కొనుగోలు విధానం, పంపిణీ నెట్‌వర్క్ తదితర అంశాలపై సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే అతనికి మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై కౌన్సెలింగ్ నిర్వహించి, విచారణలో లభించే ఆధారాల మేరకు ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన ఉద్దేశం మాదక ద్రవ్యాల వినియోగదారులను గుర్తించడం మాత్రమే కాకుండా, వాటి మూలాలు, సరఫరాదారులు, పంపిణీ వ్యవస్థను పూర్తిస్థాయిలో ఛేదించడమేనని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గంజా లేదా ఇతర మాదక ద్రవ్యాల వినియోగం, నిల్వ, రవాణా, విక్రయం, సరఫరాలో పాల్గొనే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని, ప్రజలు కూడా మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించి సమాజ రక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు, గంజా ర్యాపిడ్ టెస్టులు, అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి తిరుపతి జిల్లా పోలీస్ శాఖ కట్టుబడి పనిచేస్తుందని వెల్లడించారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా అత్యవసర సేవల నంబర్ 112కు సమాచారం అందించాలని తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియను గడువు లోపు పూర్తి చేయాలి

## 167- నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి శారదా దేవి



ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి

ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమాన్ని గడువు లోపు పూర్తి చేయాలని తిరుపతి నియోజకవర్గ ఓటర్ నమోదు అధికారి శారదా దేవి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం తిరుపతి నియోజకవర్గ పరిధిలోని పూలవాణి గుంట, కొరమేను గుంట, కొర్లగుంట తదితర ప్రాంతాల్లో జరుగుతున్న సర్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అన్ని చోట్ల ఇప్పటికే ఎన్యూమరేషన్ ఫారాలను ఇవ్వడం జరిగిందని,ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వివరాలు నమోదు చేయించాలని తెలిపారు. దశలవారీగా బిఎల్‌ఏలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, వ్యక్తిగతంగా కలిసి వారికి అవసరమైన మార్గదర్శకాలు, అవగాహన కల్పించాలని తెలిపారు. అందరూ ఈ ప్రక్రియను ఎటువంటి అవకతవకలు జరగకుండా, జాగ్రత్తగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.లు లలిత, శిల్ప, బూత్ లెవెల్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# నమోదు కాని ఓటర్ల వివరాలను పరిశీలించిన రాష్ట్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడు రామిరెడ్డి ధ్వజా రెడ్డి

**- ప్రతి అర్హ ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు కావాలని సూచన**
**-ఎన్‌ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని పార్టీ నాయకులకు దిశానిర్దేశం**



ప్రజాభూమి ప్రతినిధి రైల్వే కోడూరు

రైల్వే కోడూరు పట్టణంలోని 18వ వార్డు పడగలపల్లిలో మంగళవారం నిర్వహించిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో నమోదు కాని ఓటర్ల వివరాలను రాష్ట్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడు, మండల అధ్యక్షుడు రామిరెడ్డి ధ్వజా రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా నమోదు కాని ఓటర్ల వివరాలను స్వీకరించిన ఆయన, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా జాబితా వెలుపల ఉండకుండా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోట శివసాయి, ఎంపీటీసీ రౌఫ్, రాజా, చింతకాయల నరసింహులు, కుమార్, నాగేంద్ర, చంద్రబాబు నాయుడు తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పంచాయతీ పోరుకు కూటమి సమరశంఖం.. ఎమ్మెల్యే విజయశ్రీ దిశానిర్దేశం



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.

అధికార గర్వం వద్దు.. ప్రజల్లోకి వెళ్లండి: 19 గ్రామాల కూటమి నేతలకు ఎమ్మెల్యే సూచన. లిరాబోయే పంచాయతీలు మనవే: నాయుడుపేట రూరల్ సమన్వయ కమిటీలో నెలవల ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ పిలుపు.రాబోయే పంచాయతీ ఎన్నికల్లో కూటమి జెండా ఎగరేయడమే లక్ష్యంగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కూటమి శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. మంగళవారం నాయుడుపేటలోని డా. బి.ఆర్. అంబేడ్కర్ భవనంలో జరిగిన 'నాయుడుపేట రూరల్ సమన్వయ కమిటీ' సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే, నాయకులు, కార్యకర్తలకు వ్యూహాత్మక సూచనలు చేశారు.

ప్రజల్లోకి వెళ్లి సమస్యలు పరిష్కరించండి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ.. నాయకులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రతి గ్రామంలో ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను స్వయంగా తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుని ప్రజల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలను ప్రజలకు వివరించాలని, అదే సమయంలో గత రెండేళ్లుగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు.

ఐక్యంగా పనిచేయాలి

"రాబోయే పంచాయతీలు మనవే" అనే నినాదంతో గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎన్నికల్లో ప్రతి గ్రామంలోనూ కూటమి విజయమే లక్ష్యంగా విభేదాలు పక్కనబెట్టి ఐక్యంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నాయుడుపేట రూరల్ పరిధిలోని 19 గ్రామ పంచాయతీల ముఖ్య నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, యూనిట్ ఇన్‌చార్జులు, బీఎల్‌ఏలు, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుపతి నగరంలో కొత్త తరహాలో చోరీలకు పాల్పడుతున్న ముఠా.



ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి

ద్విచక్ర వాహనాన్ని అదుపుతప్పినట్లు చేసి సాయం కోరి సహాయానికి వచ్చిన వ్యక్తి నుండి అపహరిస్తున్న వైనం.ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బైరాగిపట్టెడ ఆదివారం పట్ట పగలే లక్ష 50 వేల విలువ గల ఫోన్ అపహరణ. సీసీ ఫుటేజ్ లో రికార్డ్ అయిన దృశ్యాలు.సోమవారం సాయంత్రం బొంతాలమ్మ గుడి వద్ద అదే తరహాలో 25వేల ఫోన్ చోరీ.మంగళవారం అన్నారావు సర్కిల్ వద్ద అదే తరహాలో మరో రెండు ఫోన్లు చోరీ. నగరంలో కొత్త తరహాలో చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ చోరులు.ఇంకా ఎంతమంది చొరుల బారిన పడి ఆశ్చర్యానికి గురికావలసి వస్తుందో వేచి చూడాలి.

# ప్రైవేట్ సంస్థల "యాప్" లను వెంటనే రద్దు చేయాలి

## సి.ఐ.టి.యు ఆటో యూనియన్ జిల్లా నాయకులు బి.వి. రమణయ్య డిమాండ్



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

ఆటో డ్రైవర్లను నష్టపరుస్తున్న ర్యాపిడో,ఉబర్,ఓలా,లాంటి ప్రైవేటు సంస్థల యాప్ ల వల్ల ఆటో డ్రైవర్ల కుటుంబాల తీవ్రంగా నష్టపోతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రైవేట్ సంస్థల యాప్ లను వెంటనే రద్దు చేయాలని సి.ఐ.టి.యు ఆటో యూనియన్ జిల్లా నాయకులు బి.వి.రమణయ్య మంగళవారం రోజు గూడూరు లోని సి.ఐ.టి.యు కార్యాలయంలో జరిగిన మార్కెట్ సెంటర్ ఆటో యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రపంచవ్యాప్తంగా అమెరికా,ఇరాన్ యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు పెరిగాయని, ఆ కారణంతో పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలు విపరీతంగా పెంచారని, నేడు మడిచమురు ధర 80 డాలర్ల కి తగ్గినా దేశంలో పెట్రోల్,డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించడం లేదని, నిత్యావసర వస్తువుల ధరలు అయితే ఆకాశానశీటుతున్నాయని,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ధరలు తగ్గించాలని,అలాగే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్టాండ్ కార్యదర్శి యమ్.అర్జున్,సహాయ కార్యదర్శి కె.శీనయ్య,ట్రెజరర్ ఎస్.డి.ఖాదర్ బాషా,కమిటీ మెంబర్లు వి.కోటయ్య,ఎస్.కె.షారుక్, ఆర్. సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# సర్ కార్యక్రమంపై సంబంధిత అధికారులు అడిగి వివరాలు తెలుసుకున్న రెడ్డి వారి గురవారెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.

మంగళవారం ఏర్పేడు మండలం పాపా నాయుడు పేటలో సర్ కార్యక్రమం సంబంధించి బి ఎల్ ఓ బిఎల్ఏ పాటు నాయకులతో ప్రత్యేకంగా సమావేశమై సర్ కార్యక్రమంపై వివరాలు తెలుసుకున్న ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి వారి గురవారెడ్డి అనంతరం మాట్లాడుతూ సర్ కార్యక్రమం ప్రతిష్టాత్మకం అయింది 2002 తర్వాత ఎన్నికల కమిషన్ ఇప్పుడు నిర్వహిస్తా ఉంది దీని ద్వారా నిజమైన ఓటరు ను కాపాడుకుంటూ బోగస్ ఓట్లను ఎరివేస్తూ నూతన ఓటరు కి అవకాశం కల్పించాలి దానికి బిఎల్వోలతో కలిసి బిఎల్ఏ ఎక్కువ కృషి చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కోరారు పాపా నాయుడు పేట గ్రామంలో సుమారు 63% ఘణన ఫార్మ్స్ అందజేసి సర్ కార్యక్రమం జరిగింది ఇక వారం రోజులు మాత్రమే అవకాశం ఉంది కాబట్టి త్వరితగతిన సర్ కార్యక్రమాన్ని పూర్తి చేయాల్సిందిగా కోరారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి వారి గురవారెడ్డి తో పాటు క్లస్టర్ ఇంచార్జ్ కిష్టప్ప మొదలి బిఎల్ఏ హరి పార్టీ నాయకులు శ్రీనివాసులు అధికారులు పాల్గొన్నారు.

# బీడీసీ సెంటర్ ని ఆకస్మిక తనిఖీ నిర్వహించిన రెడ్డి వారి గురువారెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.

మంగళవారం ఏర్పేడు మండలం పాపా నాయుడు పేట పంచాయతీలో ఉన్నటువంటి జిల్లా గ్రంథాలయ సంస్థ ద్వారా నడుస్తున్న బీడీసీ సెంటర్ ను ఆకస్మికంగా సందర్శించి న ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురవారెడ్డి. అక్కడ బీడీసీ సెంటర్ (మినీ గ్రంథాలయం) నిర్వాహకురాలు మంజులమ్మను మీ సెంటర్ కి ఏ ఏ పేపర్లు వస్తున్నాయి దగ్గరలో ఉన్న రేణిగుంట శాఖ గ్రంథాలయం నుండి 15 రోజులకు ఒకసారి పాఠకులకు అవసరమయ్యే బుక్స్ తీసుకువచ్చి అందిస్తున్నారా అనే విషయాలను చైర్మన్ అడిగి తెలుసుకున్నారు చైర్మన్ మాట్లాడుతూ పాపా నాయుడు పేట మండలంలోని పెద్ద పంచాయతీ ఇక్కడ 3500 పైన జనాభా వున్నారు మరి ఇటువంటి పంచాయతీలో పేపర్లు పుస్తకాలు ప్రజలకు పాఠకులకు అందుబాటులో ఉంచాలని బిడిసి నిర్వాహక రాలు ని ఆదేశించారు అదేవిధంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. మంత్రివర్యులు నారా లోకేష్.గ్రంథాలయాలను గ్రామీణ స్థాయిలో ప్రోత్సహించి ప్రజలకి పాఠకులకు మెరుగైన సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యముతో కూటమీ ప్రభుత్వం పని చేస్తా ఉంది అటువంటి ప్రభుత్వం చేస్తున్నటువంటి సౌకర్యాలను ఈ యొక్క బీడీసీ సెంటర్ ద్వారా పాఠకులు ప్రజలు ఉపయోగించుకోవాలని అని గురువారెడ్డి కోరారు అనంతరం క్లస్టర్ ఇంచార్జ్ కిష్టప్ప మొదలి పార్టీ నాయకులు శ్రీనివాసులు హరి తదితరులతో ప్రత్యేకంగా చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి సమావేశమై గ్రామంలో ఉన్న బీడీసీ సెంటర్ (మినీ గ్రంథాలయం) అభివృద్ధికి మీ వంతు సహకరించాలని కోరారు అదేవిధంగా పాపానాయుడుపేట బీడీసీ సెంటర్ కు న్యూస్ పేపర్లను పుస్తకాలు ఎక్కువగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని రేణిగుంట గ్రంథాల అధికారిని చైర్మన్ ఆదేశించారు.

# నూతనంగా శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లు ని శాలువాతో సన్మానించిన ఏఐఎస్‌ఎఫ్ నాయకులు - విద్యార్థి,యువత సమస్యలపై చర్చ




ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.

నూతనంగా శ్రీకాళహస్తి వన్‌టౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లు ని ఏఐఎస్ఎఫ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా సహాయ కార్యదర్శి కోగిలి మునిచందు మాట్లాడుతూ, శ్రీకాళహస్తి పట్టణంలో విద్యార్థులు, యువతలో మద్యపానం మరియు ఇతర మత్తు పదార్థాల వినియోగం రోజురోజుకు పెరుగుతుండటం ఆందోళనకరమని అన్నారు. మత్తుకు బానిసలవుతున్న కొందరు విద్యార్థులు, యువకులు గొడవలు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. విద్యాసంస్థల పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి మత్తు పదార్థాల విక్రయాన్ని అరికట్టడంతో పాటు యువతలో చట్టాల పట్ల అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, విద్యార్థులు, యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, విద్యాసంస్థలు, తల్లిదండ్రులు, ప్రజాసంఘాల సహకారంతో యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజల సహకారంతో శ్రీకాళహస్తి పట్టణంలో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు భరత్, వివేక్, సుందర్ రాజ్, ప్రజానాట్యమండలి నాయకుడు రాజా తదితరులు పాల్గొన్నారు.


# చికెన్ షాపులో విషాదం.. విద్యుత్ షాక్‌తో వ్యాపారి మృతి



ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు

వాకాడు మండలం కొండాపురం పంచాయతీ పరిధిలోని వడ్డిపాలెం గ్రామానికి చెందిన మల్లి నాగరాజు (45) మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు.స్థానికుల వివరాల ప్రకారం, నాగరాజు వడ్డిపాలెం మెయిన్ రోడ్డులో చికెన్ దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించేవారు.ప్రతిరోజులాగే మంగళవారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో చికెన్ కటింగ్ మిషన్‌ను శుభ్రం చేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారువెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలిసింది.నాగరాజు ఆకస్మిక మృతితో వడ్డిపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.కుటుంబ సభ్యుల రోదనలు గ్రామస్తులను కలచివేశాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


# వీబీజీ రామ్ పథకం అమలుపై సమీక్ష.. సస్పెండ్ అయిన టెక్నికల్ అసిస్టెంట్‌పై విచారణ



ప్రజాభూమి ప్రతినిధి,వాకాడు

వాకాడు మండలంలో అమలవుతున్న వీబీజీ రామ్ పథకం నిర్వహణపై మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఎంపీడీవో సాయిప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశంలో పథకం అమలు, పనుల పురోగతి, నాణ్యత, పరిపాలనా అంశాలపై అధికారులతో సమీక్షించారు.ఈ సమావేశంలో ఏపీడీ వరప్రసాద్, ఏపీఓ విజయమ్మ, ఏవో శ్రీనివాసులు పాల్గొని పథకానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు.అనంతరం సస్పెన్షన్‌కు గురైన టెక్నికల్ అసిస్టెంట్ మల్లికార్జునపై శాఖాపరమైన విచారణ నిర్వహించారు.విచారణ సందర్భంగా సంబంధిత రికార్డులు, వివరాలను అధికారులు పరిశీలించి ఆయన వివరణను నమోదు చేసినట్లు సమాచారం.విచారణ నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులు తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు తెలియజేశారు.

# వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తకు మోహిత్‌రెడ్డి పరామర్శ



ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి రూరల్

తిరుపతి అర్బన్ మండలం న్యూ మంగళం పంచాయతీ చెన్నాయగుంటకు చెందిన వైఎస్ఆర్‌సీపీ కార్యకర్త నాగరాజుకు ఇటీవల బైపాస్ సర్జరీ జరిగింది. ఆ విషయం తెలుసుకున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మంగళవారం నాగరాజు ఇంటికి చేరుకుని ఆయనను పరామర్శించారు. ఆయనను పరామర్శించిన వారిలో వైఎస్ఆర్‌సీపీ నేతలు నారాయణరెడ్డి, శివశంకర్ రాజు, అశోక్‌రెడ్డి, రాంబాబు, దయ, అబ్దుల్ రజాక్‌లతో పాటు స్థానిక పార్టీ నాయకులు వున్నారు.



ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 10

బుధవారం 08 జూలై 2026

## గూడూరు 24 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ గా బాధ్యతల స్వీకారించిన బండి కరుణాకర్ రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,



గూడూరు 24 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) సీఈఓగా బండి కరుణాకర్ రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంఘం చైర్మన్ అల్లూరు కరుణాకర్ రెడ్డి ఆయనకు నియామక ఉత్తరాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.బండి కరుణాకర్ రెడ్డి గతంలో మోపూరు, చిట్టేడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో సీఈఓగా విధులు నిర్వహించి విశేష అనుభవాన్ని సంపాదించారు. ప్రస్తుతం గూడూరు 24 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సీఈఓగా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా సీఈఓ బండి కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ, సంఘం అభివృద్ధికి చైర్మన్, పాలకవర్గం, సిబ్బంది సహకారంతో కృషి చేస్తానన్నారు. రైతులకు ప్రభుత్వ పథకాలు, సహకార సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. రైతులకు నాణ్యమైన సేవలు అందిస్తూ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొని నూతన సీఈఓకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎస్ఐఆర్‌లో బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలి..

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.



ఓటు పదిలానికి ఇదే కీలక సమయం. ఓటు రక్షణకు మరో వారం రోజులు మాత్రమే గడువు. ఎన్యుమరేషన్ ఫారాల పూరణలో ఏమాత్రం అలసత్వం వద్దు. జూలై 15 తర్వాత ఫారాలు పూరించని వారి ఓటు జాబితాలో ఉండదని హెచ్చరిక. తర్వాత ఓటు తిరిగి పొందడం చాలా క్లిష్టమని స్పష్టం. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సూచన. చంద్రగిరి నియోజకవర్గంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో వైఎస్ఆర్‌సీపీ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని చంద్రగిరి నియోజక వర్గ వైఎస్ఆర్‌సీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సూచించారు. ఓటర్ల హక్కులను పరిరక్షించే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావివ్వొద్దని ఆయన స్పష్టం చేశారు. ఓటర్ల ఎన్యుమరేషన్ ఫారాల పూరణకు మరో వారం రోజులు మాత్రమే గడువు మిగిలి ఉందని, జూలై 15లోపు అర్హులైన ప్రతి ఓటరు ఫారం తప్పనిసరిగా పూర్తి చేసేలా బీఎల్ఏలు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఫారాల పూరణలో అలసత్వం ప్రదర్శిస్తే అర్హులైన ఓటర్లు కూడా ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.జూలై 15 తర్వాత ఎన్యుమరేషన్ ఫారం సమర్పించని వారి పేర్లు ఓటరు జాబితాలో ఉండే అవకాశాలు తగ్గిపోతాయని, అనంతరం ఓటు తిరిగి నమోదు చేయించుకోవడం కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. అందువల్ల ప్రతి బీఎల్ఏ బాధ్యతగా వ్యవహరించి ఒక్క అర్హుడి ఓటు కూడా గల్లంతు కాకుండా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటు అనేది ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, ఆ హక్కును కాపాడుకోవడం కోసం పార్టీ శ్రేణులు, బీఎల్ఏలు సమన్వయంతో పని చేయాలని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సూచించారు.

## భాజపా జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షుడిగా ఎల్లా అన్వేష్ నియామకం



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.



భారతీయ జనతా పార్టీలో చిన్న స్థాయి పదవుల నుంచి పార్టీ విధేయతతో పనిచేసిన ఎలా అన్వేష్‌ను జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా పార్టీ పెద్దలు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎలా అన్వేష్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు, జిల్లా యువమోర్చా అధ్యక్షులు బండారు పార్థసారథి, వరదయ్యపాలెం మండల అధ్యక్షులు దిలీప్ రాయల్‌తో పాటు వరదయ్యపాలెం మండల భాజపా సీనియర్ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జిల్లాలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్వేష్ ఈ సందర్భంగా తెలిపారు.

## రేపే 406 రైతన్నలకు పట్టాలు పంపిణీ, ఎమ్మెల్యే కోనేటి అధిమూలం

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.



ఉదయం 9.30 గంటలకు నీరువాయి గ్రామం ప్రభుత్వం అమృత పాఠశాల నందు పట్టాలు పంపిణీ చేయునట్లు మాజీ మార్కెటింగ్ చైర్మన్ డి. ఇలంగోవన్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పిచ్చా టూరు నీరు వాయి గ్రామానికి చెందిన నిరుపేద రైతులకు 406 మంది కి బుధవారం ఉదయం 9:30 నిమిషాలకు నిర్వహి ప్రభుత్వ పాఠశాల నందు సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేత ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న ఆశయాలను పట్టాలను పట్టు వీడని విక్రమార్కుడిలా పదవుల కన్నా అభివృద్ధి, ప్రజలే అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలను నియోజకవర్గ స్థాయిలో అమలుపరుస్తూ ముందుకు సాగుతున్నారని ఇలంగోవన్ రెడ్డి వెల్లడించారు. రేపు జరగబోయే శుభకార్యానికి మండలంలో ఉన్న టిడిపి, బిజెపి ,జనసేన, నాయకులు, కార్యకర్తలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాను.

## మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.



పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని మరియు ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణంలోని శివపార్వతి సర్కిల్లో అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు మరియు శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇంచార్జ్ ఇర్ల. రాజా మాదిగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ శ్రీకాళహస్తి నియోజకవర్గం యువసేన అధ్యక్షులు మన్నెపల్లి ఈశ్వర్ మాదిగ, శ్రీకాళహస్తి ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు వెంకట ముని మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గాజుపాకుల యతేష్ మాదిగ, మోహన్ మాదిగ, బాలరాజు మాదిగ, చలపతి మాదిగ తదితర ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థకు రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం

### ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పరిశ్రమలు సీఎస్ఆర్ నిధులతో ముందుకు రావాలి జిల్లా కలెక్టర్ హిమాంశు శుక్ల

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,



రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని, ప్రతి ప్రభుత్వ పాఠశాలను ఆధునికీకరించి విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే దిశగా చర్యలు చేపడుతోందని జిల్లా కలెక్టర్ హిమాంశు శుక్ల తెలిపారు. గూడూరు మండలం చెన్నూరు గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విజయలక్ష్మి తులసిదాస్ మెహత ఫౌండేషన్ (ముంబై) ఆధ్వర్యంలో, కలర్ షైన్ సంస్థ సహకారంతో నిర్మించిన అదనపు తరగతి గదులు, పాఠశాల ఆధునికీకరణ పనులను మంగళవారం కలెక్టర్ ప్రారంభించారు. సుమారు రూ.40 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ అభివృద్ధి పనులు విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా వాతావరణాన్ని అందించనున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు పరిశ్రమలు, వ్యాపార రంగాలపై కూడా అవగాహన కల్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు పరిశ్రమలను ప్రత్యక్షంగా సందర్శించి ఉత్పత్తి ప్రక్రియలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. చెన్నూరు సమీపంలోని కలర్ షైన్ కంపెనీలో ఐరన్ షీట్ల తయారీ ప్రక్రియను విద్యార్థులు ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశాలు కల్పించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు ప్రతిభావంతులని, వారి ప్రతిభను మరింత మెరుగుపరచేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. నెల్లూరు నగరంలో మంత్రి నారాయణ దాతల సహకారంతో 12 ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించి, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందించేలా చర్యలు తీసుకున్నారని కలెక్టర్ ప్రశంసించారు. ఇదే విధంగా పరిశ్రమలు కూడా తమ సీఎస్ఆర్ నిధుల ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేయూతనివ్వాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కలర్ షైన్ సీఈఓ సమీర్ ఎన్. మెహత, డైరెక్టర్ రాజీవ్ మెహత, యు.ఎన్. శర్మ, హెచ్ఆర్ అధికారి జయశ్రీలను కలెక్టర్ సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మట్టం శ్రావణి, ఎంఆర్వో ప్రసాద్ రావు, మండల స్థాయి అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, కలర్ షైన్ సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్షయ, కుష్టు ,ఎయిడ్స్ వ్యాధుల (ముక్త్ భారత్) యాప్ పై అవగాహన సదస్సు- డాక్టర్ శైలజ

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



తిరుపతి జిల్లా కుష్టు, ఎయిడ్స్ మరియు క్షయ నివారణ అధికారిణి డాక్టర్ శైలజ ఆదేశాలమేరకు టీబీ ముక్త్ భారత్ యాప్ వల్ల ఉపయోగాలు గురించి రేణిగుంట మరియు వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో హెల్త్ సూపర్వైజర్ కామరాజు ఆశాకార్యకర్తలు,ఎఎన్ఎం, లకు అవగాహన కల్పించి అందరూ టీబీ ముక్త్ భారథ్ యాప్ ను తమ మొబైల్ లో డౌన్లోడ్ చేసుకుని టీబీ నిర్మూలన లక్ష్యాన్ని సాధించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "టీబీ ముక్త్ భారత్ యాప్"ప్రజలు,ఆరోగ్య సిబ్బందికి అనేక విధాలుగా ఉపయోగపడుతుందని, ప్రధానంగా టీబీ అనుమానితులను గుర్తించి రెఫర్ చేయడానికి,టీబీ రోగులను నమోదు చేసి చికిత్స పురోగతిని పర్యవేక్షించడానికి,,రోగులు క్రమం తప్పకుండా మందులు తీసుకునేలా గుర్తు చేసే సౌకర్యం కూడా ఇందులో ఉంటుందని, రోగులకు అవసరమైన ప్రభుత్వ సేవలు,పథకాల సమాచారం తెలుస్తుందని, సమీప టీబీ పరీక్షా కేంద్రాలు,వాటి వివరాలు కూడా తెలుసుకోవచ్చని తెలిపారు.ఈ యాప్ ద్వారా నిక్షయ్ పోషణ వంటి ప్రభుత్వ ప్రయోజనాల సమాచారం పొందవచ్చుని,టీబీపై అవగాహన,నివారణ చర్యలు, లక్షణాలపై ఆరోగ్య విద్యా సమాచారం అందుతుందని వివరించారు. సమాజంలోని, నిక్షయ్,మిత్రులు రోగులకు పోషకాహార సహాయం అందించేందుకు ఉపయోగపడుతుందని, ఆరోగ్య శాఖకు కూడా టీబీ కేసుల పర్యవేక్షణ, నివేదికల నిర్వహణ సులభమవుతుందని వివరించారు.రెండు వారాలకుపైగా దగ్గు, దగ్గులో కళ్లె పడటం, కళ్లెతోపాటు రక్తం పడటం, జ్వరం,బరువు తగ్గడం, రాత్రి పూట చెమట పట్టడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పరీక్ష చేయించుకోవాలని,టీబీ పూర్తిగా నయమయ్యే వ్యాధియని,మందులను వైద్యుల సూచనల మేరకు పూర్తి కోర్సు తీసుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.రేణిగుంట వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి , మాట్లాడుతూ "టీబీని గుర్తిద్దాం-పూర్తిగా చికిత్స తీసుకుందాం -- 2030 సంవత్సరానికి టీబీ ముక్త్ భారత్ సాధనకు కలిసి పనిచేద్దాం."అని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు,ఆశాకార్య కర్తలు,సూపర్వైజర్ లు బాబు,నాగరాజు,మురళి, లలిత,కామరాజు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పురుషోత్తమరెడ్డి,డాక్టర్ సందీప్,డాక్టర్ చక్రపాణి పాల్గొన్నారు.

## జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ప్రజలకు ముఖ్య విజ్ఞప్తి

### వరదయ్యపాలెం పశు వైద్యశాలలో కుక్కలు, పిల్లులకు ఉచిత రేబీస్ టీకాలు - వరదయ్యపాలెం పశువైద్య అధికారి బి గౌరి

ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం.




మూగజీవాల ఆరోగ్య పరిరక్షణ అంటే కేవలం జంతువుల సంక్షేమం మాత్రమే కాదు, అది మానవ ఆరోగ్యానికి కూడా రక్షణ కవచం.లి జంతువులు--మనుషులు సహజీవనం చేస్తున్న నేటి పరిస్థితుల్లో ఇరువురి ఆరోగ్య భద్రత కోసం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరమని వరదయ్యపాలెం పశువైద్యశాల పశువైద్యాధికారి డాక్టర్ బి. గౌరి తెలిపారు. ప్రతి పెంపుడు జంతు యజమాని ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పెంపుడు జంతువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని ఆమె కోరారు. ప్రతి సంవత్సరం జూలై 6ను ప్రపంచ జూనోసిస్ వ్యాధుల నివారణ దినోత్సవంగా నిర్వహిస్తారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జూనోసిస్ వ్యాధులు అంటారు. వీటిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, ముందస్తు చర్యల ద్వారా వ్యాధులను నివారించడం, "ఒకే ఆరోగ్యం -- " అనే భావనను బలోపేతం చేయడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశం. ప్రపంచవ్యాప్తంగా వెలుగులోకి వస్తున్న కొత్త అంటువ్యాధుల్లో సుమారు 75 శాతం జంతువుల నుంచే మనుషులకు సంక్రమిస్తున్నాయని నిపుణులు వెల్లడిస్తున్నారు. అందువల్ల జంతువుల ఆరోగ్యాన్ని కాపాడటం ద్వారా మానవ సమాజాన్ని కూడా రక్షించవచ్చు. జూనోసిస్ వ్యాధుల్లో అత్యంత ప్రమాదకరమైనది రేబీస్ (కుక్క కాటు వ్యాధి). ఒకసారి వ్యాధి లక్షణాలు కనిపించిన తర్వాత ప్రాణాపాయం తప్పదు. అయితే సరైన సమయంలో రేబీస్ టీకాలు వేయించడం ద్వారా దీనిని పూర్తిగా నివారించవచ్చు. ఇళ్లలో పెంచుకునే కుక్కలు, పిల్లులు కుటుంబ సభ్యులతో సన్నిహితంగా ఉంటాయి. వాటికి రేబీస్ సోకినట్లయితే మనుషులకు కూడా వ్యాపించే ప్రమాదం ఉంటుంది అందుకే ప్రతి సంవత్సరం తప్పనిసరిగా రేబీస్ టీకాలు వేయించడం ప్రతి పెంపుడు జంతు యజమాని బాధ్యత.అలాగే పశువులు లేదా పెంపుడు జంతువుల్లో అసాధారణ లక్షణాలు, ప్రవర్తనలో మార్పులు, ఆహారం తినకపోవడం, అధిక లాలాజలం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే సమీప పశువైద్యశాలను సంప్రదించాలని డాక్టర్ బి. గౌరి సూచించారు.

ప్రజలకు విజ్ఞప్తి

పెంపుడు కుక్కలు, పిల్లులకు ప్రతి సంవత్సరం రేబీస్ టీకా వేయించండి.

జంతువులను ప్రేమించండి -- వాటి ఆరోగ్యాన్ని కాపాడండి. జూనోసిస్ వ్యాధులపై అవగాహన పెంపొందించండి. "ఒకే ఆరోగ్యం -- " లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డా. బి. గౌరి పేర్కొన్నారు.

## ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు - రోడ్డు భద్రతపై పోలీసుల అవగాహన కార్యక్రమం

### వాహన ధ్రువపత్రాల పరిశీలన.. రాంగ్ పార్కింగ్ వాహనాలపై చలానాలు

ప్రజాభూమి ప్రతినిధి, బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండల కేంద్రంలో సబ్ ఇన్‌స్పెక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ ట్రాఫిక్ నియమాల అమలులో భాగంగా ద్విచక్ర వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం, బీమా, కాలుష్య నియంత్రణ ధ్రువపత్రం తదితర పత్రాలను తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న వారికి జరిమానాలు విధించి, తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. అలాగే మండల కేంద్రంలోని ప్రధాన రహదారుల ఇరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే విధంగా నిలిపిన వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. రాంగ్ పార్కింగ్‌లో ఉన్న వాహనదారులకు చలానాలు జారీ చేసి, రహదారులపై క్రమశిక్షణ పాటించాలని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ హరిప్రసాద్ మాట్లాడుతూ, ప్రజల ప్రాణ భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని తెలిపారు. వాహనదారులు అవసరమైన ధ్రువపత్రాలు వెంట ఉంచుకుని, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు.

## సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ను కలిసిన గాలి మురళినాయుడు

ప్రజా భూమి ప్రతినిధి తొట్టంబేడు.



సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను తొట్టంబేడు మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు గాలి మురళినాయుడు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.సత్యవేడు పీఆర్ గెస్ట్ హౌస్‌లో జరిగిన ఈ భేటీలో టీడీపీ శ్రేణులు ఎమ్మెల్యేకు దుశ్శాలువా కప్పి, పండ్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.గాలి మురళినాయుడు మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేస్తున్న కృషిని అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యే చూపుతున్న చొరవ హర్షణీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ యేచంద్ర నాయుడు,యువత నాయకులు అశోక్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రగిరి జనసేన బాధ్యతల కోసం తపసి మురళిరెడ్డి దరఖాస్తు

### జనసేన ఆశయాల సాధనకు నిరంతరం కృషి చేస్తా: తపసి మురళిరెడ్డి.

### 'దేశం కోసం.. ధర్మం కోసం' సేవలు కొనసాగిస్తా: తపసి మురళిరెడ్డి.

ప్రజా భూమి ప్రతినిధి చంద్రగిరి.

చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో చేపట్టిన "నిర్మాణ సారథుల సమాచార సేకరణ" కార్యక్రమంలో భాగంగా, చంద్రగిరి నియోజకవర్గ పార్టీ పదవి బాధ్యతల కోసం తన దరఖాస్తును జనసేన పార్టీ సీనియర్ నాయకుడు, తిరుపతి ప్రెస్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు తపసి మురళిరెడ్డి పరిశీలకులు ధర్మరాజుకు సమర్పించారు. ఈ సందర్భంగా తపసి మురళిరెడ్డి మాట్లాడుతూ, జనసేన పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి తన వంతు సేవలను అంకితభావంతో అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ ఆశయాల సాధన కోసం నిరంతరం శ్రమిస్తూ, "దేశం కోసం -- ధర్మం కోసం" అనే లక్ష్యంతో ప్రజాసేవలో ముందుంటానని ఆయన పేర్కొన్నారు. జనసేన పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలతో కలిసి కృషి చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.



## విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన ఎంఈవో ముని సుబ్రహ్మణ్యం

ప్రజాభూమి ప్రతినిధి, బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండల పరిధిలోని చెల్లమాంబాపురం జిల్లా పరిషత్ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి ఎ. ముని సుబ్రహ్మణ్యం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం నాణ్యత, పరిశుభ్రత, మెనూ అమలు తదితర అంశాలను ఎంఈవో పరిశీలించి విద్యార్థులను భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారాన్ని దృష్టిలో ఉంచుకొని అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పాఠశాల యాజమాన్యం సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల హాజరు, బోధన కార్యక్రమాలు, మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాజముద్రలతో కూడిన పట్టా పాస్ బుక్స్ పంపిణీ కార్యక్రమం

### -ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పులివర్తి నాని

ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి రూరల్

తిరుపతి రూరల్ మండలం తనపల్లి పంచాయతీలో నిర్వహించిన పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని . కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే కి మండల స్థాయి అధికారులు, కూటమి ప్రభుత్వ నాయకులు, కార్యకర్తలు మరియు రైతులు ఘన స్వాగతం పలికారు. రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాల పంపిణీ చేపట్టిన కూటమి ప్రభుత్వం. తిరుపతి రెవెన్యూ డివిజన్ పరిధిలోని తనపల్లి పంచాయతీలో రీసర్వే పూర్తి చేసి, 70 మంది రైతులకు అధికారిక రాజముద్రతో కూడిన సరికొత్త పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే పులివర్తి నాని స్వయంగా పంపిణీ చేశారు. భూ వివాదాలకు చెక్... పారదర్శకంగా జరిగిన ఈ రీసర్వే ప్రక్రియ ద్వారా భూ వివాదాలు పూర్తిగా తొలగిపోతాయని,



రైతులకు వారి భూములపై సర్వ హక్కులు లభిస్తాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకునే ప్రభుత్వమని నాని కొనియాడారు. అధికారం చేపట్టిన తొలిరోజే వివాదాస్పద 'ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్'ను రద్దు చేస్తూ తొలి సంతకం చేసిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లకే దక్కుతుందని ప్రశంసించారు.

గత ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజం:

గత వైసీపీ ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. భూరక్ష పథకం పేరుతో సర్వే రాళ్ల కోసం ప్రజాధనాన్ని రూ. 600 కోట్లు వృథా చేయడమే కాకుండా, పాస్ పుస్తకాలు మరియు సర్వే రాళ్లపై మాజీ సీఎం ఫోటోలు, లోగోలు ముద్రించుకున్నారని విమర్శించారు. దానికి భిన్నంగా ఇప్పుడు రాజ ముద్రతో పుస్తకాలు ఇస్తూ రైతులకు కొండంత భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో నారా లోకేష్ బాబు 'యువగళం' పాదయాత్రలో రైతులు తమ దృష్టికి తెచ్చిన 70% భూ సమస్యలను పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అధికారం చేపట్టిన రెండు సంవత్సరాల లోపే రీసర్వే పూర్తి చేసి ఆ హామీని విజయవంతంగా అమలు చేశామని ఎమ్మెల్యే గర్వంగా ప్రకటించారు. తమ భూములకు పూర్తి రక్షణ కల్పిస్తూ రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు అందించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ కి మరియు ఎమ్మెల్యే పులివర్తి నాని కి రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు,కూటమి నాయకులు ,రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సంతృప్తి సూచీలో తిరుపతి జిల్లా పనితీరు మరింత మెరుగుపరచాలి

**● సీజనల్ వ్యాధుల నివారణకు సమన్వయంతో చర్యలు చేపట్టాలి ● ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) ప్రక్రియకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలి ● జలధార--జలహారతి' పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.. విజయగాథలను నమోదు చేయాలి - జిల్లా కలెక్టర్ ● ప్రజా సేవల మెరుగుదల, జలధార--జలహారతి, సీజనల్ వ్యాధుల నివారణ, ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్ )పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి కలెక్టరేట్.

తిరుపతి, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడం, ప్రజా సంతృప్తి సూచీలో జిల్లా పనితీరును మెరుగుపరచడం, 'జలధార--జలహారతి' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడం, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలను ముమ్మరం చేయడం, ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్ ) ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు, డి.ఆర్.ఓ. నరసింహులు లతో కలసి జిల్లా అధికారులు, జిల్లాలోని మునిసిపల్ కమీషనర్లు, డివిజినల్ మరియు మండల స్థాయి అధికారులు, ఎం.పి.డి.ఓ లు, పోలీస్ శాఖ అధికారులతో పీజీఆర్ఎస్ (పీజీర్ ఎస్ ), పీ-3 (పి 3), జలధార--జలహారతి, తల్లికి వందనం, అక్షర ఆంధ్ర తదితర అంశాలపై శాఖల వారీగా సమీక్ష, జూమ్ వీడియో కాన్ఫెరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రజా సంతృప్తి సూచీ, పబ్లిక్ గవర్నెన్స్ రేటింగ్ సిస్టమ్ లో తిరుపతి జిల్లా పనితీరును మరింత మెరుగుపరచేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాకు వచ్చిన ర్యాంకింగ్‌ను ప్రతి శాఖ అధికారి అత్యంత బాధ్యతతో పరిగణించాలని సూచించారు. జిల్లాలోని అన్ని శాఖలు సమష్టిగా పనిచేసినప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందించి జిల్లాను ఉన్నత స్థానానికి తీసుకెళ్లడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రత్యేకంగా రహదారులపై గుంతల నివారణ, బస్ స్టాండ్లు మరియు బస్ స్టేషన్లలో మౌలిక వసతుల మెరుగుదల, క్రీడా సదుపాయాల అభివృద్ధి, గ్రామీణ--పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రెవెన్యూ శాఖ సేవల నాణ్యత వంటి అంశాలపై సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ రంగాల్లో మెరుగైన పనితీరు కనబరిస్తే జిల్లా సగటు పనితీరు గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులు ప్రజలకు అందించే సేవల్లో నాణ్యత పెంచుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా తప్పనిసరిగా మొదటి స్థానంలో ఉండాలనే లక్ష్యం కంటే, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ తక్కువ ర్యాంకుల్లో ఉండకుండా సమిష్టిగా కృషి చేయడం ముఖ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో చేపడుతున్న 'జలధార--జలహారతి' కార్యక్రమం ద్వారా జరుగుతున్న నీటి సంరక్షణ, జలవనరుల అభివృద్ధి పనులను విస్తృతంగా ప్రచారం చేస్తూ విజయగాథలను నమోదు చేయాలన్నారు. ఈ సంవత్సరం ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో నీటి వనరుల పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలని సూచించారు. జూన్ నెలలో సాధారణ వర్షపాతంతో పోలిస్తే గణనీయంగా తక్కువ వర్షపాతం నమోదైనందున, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో పనులు చేపట్టాలని పేర్కొన్నారు. సప్లై ఛానళ్లు, ఫీడర్ ఛానళ్లు, చెరువుల పునరుద్ధరణ, బండ్ల బలోపేతం, ఫోర్‌షోర్ ప్రాంతాల్లో నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించడం, నీటి లభ్యత ఎక్కువగా ఉన్న ప్రాంతాల నుంచి అవసరమైన ప్రాంతాలకు నీటిని అందించే చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. జరిగిన అభివృద్ధి పనులను పని ప్రారంభానికి ముందు--పని పూర్తయ్యాక అనే విధంగా ఫొటోలు, డ్రోన్ చిత్రాలు, వీడియోలతో నమోదు చేసి, వాటి వల్ల కలిగిన ప్రయోజనాలను విజయగాథల రూపంలో సోషల్ మీడియా, సంబంధిత శాఖల ప్రధాన కార్యాలయాలకు పంపించాలని అధికారులను ఆదేశించారు. దీనివల్ల ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజల్లో మరింత అవగాహన పెరగడంతో పాటు




సానుకూల ప్రచారం లభిస్తుందని తెలిపారు. నీటి సంఘాల (వాటర్ యూజర్స్ అసోసియేషన్స్) ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం పెంచుకుని వారి అనుభవాలను వినియోగించుకోవడం ద్వారా పనులను మరింత సమర్థవంతంగా అమలు చేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో చేపట్టిన నీటి సంరక్షణ చర్యల ఫలితంగా భూగర్భ జలాల నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరగడంతో పాటు చెరువుల నిల్వ సామర్థ్యం కూడా విస్తరించిందని తెలిపారు. అలాగే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది జిల్లాలో భూగర్భ జలమట్టం మెరుగుపడడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. నీటి సంరక్షణ, వర్షాభావ నివారణ చర్యల్లో ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి, చేపడుతున్న మంచి పనులను ప్రజలకు చేరవేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం క్రింద నిధులను విడుదల చేయనున్నందున అర్హత గల విద్యార్థులు ఎన్ పి సి ఐ మ్యాపింగ్ కలిగిన బ్యాంకు ఖాతాను ప్రారంభించుకోవాలని తెలిపారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ శాఖలకు చెందిన పాఠశాలలు, వసతి గృహాల్లో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్యాస్ట్రోఎంటరైటిస్ వంటి నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు ఎక్కడా నమోదు కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని చెప్పారు. ముఖ్యంగా ప్రతి శుక్రవారం నిర్వహించే "డ్రై డే -- ఫ్రైడే" కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా విస్తృత స్థాయిలో నిర్వహించి, దోమల పెరుగుదలకు కారణమయ్యే నీటి నిల్వలను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది చురుకుగా పాల్గొని ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. వ్యాధుల ప్రభావం అధికంగా ఉండే ప్రాంతాలను గుర్తించి అక్కడ పరీక్షల సంఖ్యను పెంచడంతో పాటు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఎటువంటి అత్యవసర పరిస్థితులు తలెత్తకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ సర్ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో, నిర్దేశిత గడువుల్లో పూర్తి చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఈ కార్యక్రమాన్ని నిరంతరం సమీక్షిస్తున్నందున, అత్యవసర పరిస్థితులు మినహా అన్ని శాఖలు సర్ ప్రక్రియపైనే ప్రధాన దృష్టి సారించాలని సూచించారు. ప్రత్యేకంగా సచివాలయ సిబ్బంది ఉన్న శాఖలైన గ్రామీణాభివృద్ధి, రెవెన్యూ, వ్యవసాయం, మున్సిపల్ పరిపాలన, సాంఘిక సంక్షేమం, మహిళా మరియు శిశు సంక్షేమం, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు తమ పరిధిలోని సిబ్బందిని కార్యక్రమంలో పూర్తిస్థాయిలో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, రెవెన్యూ, వ్యవసాయ, మున్సిపల్ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ సర్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. సర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేలా ప్రతి శాఖాధిపతి నిరంతర పర్యవేక్షణ చేపట్టి, క్షేత్రస్థాయి సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు అందిస్తూ, ఎలాంటి ఆటంకాలు లేకుండా కార్యక్రమాన్ని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్ మాండ్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వన్ టౌన్ సీఐ వెంకటేష్ ని మర్యాదపూర్వకంగా కలిసే అవకాశం లభించడం ఆనందంగా భావిస్తున్నాను:దండి నరేంద్ర

ప్రజా భూమి ప్రతినిధి, శ్రీకాళహస్తి



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో లా , ఆర్డర్ పరిరక్షణ, మాదకద్రవ్యాలు (డ్రగ్స్/గంజాయి) నిర్మూలన, నేరాల నియంత్రణ, ప్రజా భద్రత వంటి సమకాలీన అంశాలపై ఆత్మీయంగా చర్చించాము. అలాగే ఆయన పోలీసు సేవా ప్రయాణం, వ్యక్తిగత అనుభవాలు, మన ప్రాంతమైన వేలవేడులో విద్యాభ్యాసం చేసిన విషయాలు, ముచ్చివోలు గ్రామంతో ఆయనకున్న అనుబంధం గురించి తెలుసుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. సమాజంపై బాధ్యతతో, ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రతి సమస్యను మానవీయ దృక్పథంతో వినడం, కౌన్సెలింగ్ ద్వారా పరిష్కార మార్గాలు చూపడం, శాంతి-భద్రతల పరిరక్షణలో అంకితభావంతో పనిచేయడం, అలాగే డ్రగ్స్ రహిత -- గంజాయి రహిత శ్రీకాళహస్తి నిర్మాణానికి ఆయన చేస్తున్న కృషి నిజంగా అభినందనీయం. ఆయన సేవాభావానికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ఈ మర్యాదపూర్వక భేటీలో జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ నాయకులు లక్ష్మణ్ నవీన్, దివాకర్ పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల పై నాయుడుపేట పోలీసులు ఉక్కుపాదం

ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.



మాదకద్రవ్యాల నిర్మూలనపై నాయుడుపేట పోలీసులు ఉక్కుపాదం మోపుతూ కఠిన మైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీఐ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నాయుడుపేట పట్టణంలోని డిగ్రీ కాలేజ్ లోతువాణిగుంట, మురారి, సెంటర్ తదితర పరిసర ప్రాంతాలలో పర్యటించి గంజాయి దొరుకు స్థలాలలో జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా నివాసిత ప్రాంతాలలో ప్రజలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకొని హెచ్చరికలు జారీ చేశారు. మత్తు పదార్థలైన గంజాయి, డ్రగ్స్ జోలికి వెళ్లకుండా తమ పిల్లలను జాగ్రత్త చేసుకోవాలని తల్లి తండ్రులు కు హితవు పలికారు. మాదక ద్రవ్యలు సేవించిన, విక్రయించిన చట్ట రిత్య నేరమని అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నేత డా.వైఎస్ఆర్

### - మాజీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు



ప్రజాభూమి, వేంపల్లె

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత అని మాజీ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డా.వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన విప్లవాత్మక సంక్షేమ పథకాలు నేటికీ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశాయని తెలిపారు. పేద ప్రజల కష్టాలను తెలుసుకునేందుకు ఆయన చేపట్టిన చారిత్రాత్మక పాదయాత్ర, సామాన్య ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలిచిన తీరు ఆయనను ప్రజా నాయకుడిగా నిలిపాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రైతులకు ఉచిత విద్యుత్ అందించే ఫైలుపై తొలి సంతకం చేసి రైతు బాంధవుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. డా.వైఎస్ఆర్ తన ఐదేళ్ల పాలనలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల మనసుల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారని అన్నారు. జులై 8న డా.వైఎస్ఆర్ జయంతి సందర్భంగా ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను స్మరించుకోవాలని రాచినేని శ్రీనివాసులు పిలుపునిచ్చారు.

## కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య పరికరాలు వితరణ

ప్రజా భూమి ప్రతినిధి, రామచంద్రపురం




రామచంద్రాపురం మండలం కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మాజీ చైర్మన్, ఏపి ఎంఎస్ ఎంఈ డైరెక్టర్ చినబాబు కోరిక మేరకు మాజీ జడ్పిటిసి సభ్యులు అబ్బూరు దేవానంద నాయుడు సుమారు 25 వేల రూపాయలు విలువచేసే వైద్య పరికరాలను వితరణగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జావిద్ కు అందజేశారు. ల్యాబ్ లో రక్త పరీక్షల కోసం సేకరించిన రక్తం గడ్డకట్టకుండా అందులోని కణాలు సమానంగా కలవడానికి ఉపయోగించే పరికరం, మనిషిని తాగకుండా శరీర ఉష్ణోగ్రతను కొలిచే థర్మామీటర్, ఈ పరికరం వల్ల జ్వరం వచ్చినపుడు ఇన్ఫెక్షన్లు ఒకరి నుండి ఒకరికి వ్యాపించే ప్రమాదం ఉండదు. రక్తంలో ఆక్సిజన్ ఎంత శాతం ఉందో కొలిచే పల్స్ ఆక్సిమీటర్, బీపీ మానిటరింగ్ డిజిటల్ మరియు రెగ్యులర్ రక్తపోటు కొలిచే పరికరాలను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ, నీలకంఠచౌదరి, సురేష్,సుధాకర్, మధు,మునిచంద్ర, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఈనెల 9న మండల సర్వసభ్య సమావేశం

### - ఎంపిడిఓ కుళాయమ్మ

ప్రజాభూమి, వేంపల్లె

ఈనెల 9న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ కుళాయమ్మ వెల్లడించారు. వైద్య ఆరోగ్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, పౌరసరఫరా, వ్యవసాయం, విద్యా, విద్యుత్, ఉపాధి, గృహ నిర్మాణం, వెలుగు, ఉద్యానవన, రోడ్లు భవనాలు సంబంధిత అధికారులు తమ పూర్తి నివేదికతో సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. గురువారం ఉదయం 10:30 కు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు.

## నిందితులను అరెస్టు చేయాలంటూ పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగిన మృతురాలి అనుష కుటుంబ సభ్యులు

**అనూష కుటుంబానికి న్యాయం చేయాలి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ**

**మైదుకూరు డిఎస్పి హామీతో ధర్నా విరమించిన బంధువులు**

ప్రజాభూమి పోరుమామిళ్ల :



కడప జిల్లా పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ప్రధాన రహదారిపై నిందితులను అరెస్ట్ చేయాలంటూ పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగిన మృతురాలి అనూష కుటుంబ సభ్యులు బంధువులు. మృతి చెందిన అనూష భర్త సాయినాథరెడ్డిని, తల్లిదండ్రులను, అక్క బావను ఐదు మందిని తక్షణమే అరెస్టు చేయాలంటూ కుటుంబ సభ్యులు బంధువుల ఆందోళనలు చేపట్టారు. దాదాపు గంటసేపు రాకపోకలు నిలిచిపోయాయి ఎక్కడ వాహనాలు అక్కడే ఆగిపోయాయి. మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్ సంఘటనా స్థలానికి వచ్చి కుటుంబ సభ్యులకు, బంధువులకు, ఎఫ్ఐఆర్ లో చేర్చిన ప్రతి ఒక్కరిని అరెస్టు చేస్తామని, కఠిన శిక్షలు పడే విధంగా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనలు విరమించారు.

## చిన్నారి నిత్విక మృతి విషాదం

**బాధిత కుటుంబాన్ని పరామర్శించి 50,000 రూ ఆర్థిక సహాయం చేసిన స్వర్ణకారులు**



ప్రజాభూమి,పులివెందుల

లింగాల మండలం లోపట్నుతల గ్రామంలో గత కొన్ని రోజుల క్రితం 4 ఏళ్ల చిన్నారి నిత్విక మృతిని జీర్ణించుకోలేక ఆమె తండ్రి రామాచారి అస్వస్థకు గురై పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న భాస్కర్ బాబు ఆధ్వర్యంలో స్వర్ణకార కార్మికులు, వర్తకులు రామాచారిని పరామర్శించి రూ. 50,000 చెక్కును ఆర్థిక సహాయంగా అందజేశారు.గత కొన్ని రోజుల క్రితం లోపట్నుతల గ్రామంలో 4 ఏళ్ల నిత్విక అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషాద ఘటనతో కుటుంబం తీవ్ర మనోవేదనకు గురైంది. చిన్నారిని కోల్పోయిన బాధను తట్టుకోలేక తండ్రి రామాచారి అస్వస్థకు గురయ్యారు.రామాచారిని పరామర్శిం చిన అనంతరం భాస్కర్ బాబు మాట్లాడుతూ చిన్నారి నిత్విక మృతి చాలా బాధాకరమని అన్నారు. నిత్విక మృతికి కారణమైన వారికి చట్టప్రకారం కఠిన శిక్ష పడాలని యావత్ ప్రపంచం ఆకాంక్షిస్తోందన్నారు. ధైర్యంగా ఉండాలని, తాము అండగా ఉంటామని రామాచారి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కుల, మతాలకు అతీతంగా ఎప్పుడు అవసరమైనా కుటుంబానికి అండగా ఉంటామని పులివెందుల స్వర్ణకార సంఘం అధ్యక్షులు నూరుల్లా హామీ ఇచ్చారు. కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు అందరూ అండగా ఉంటారని నియోజకవర్గ సీనియర్ నాయకులు సనత్ కుమార్ ఆచారి తెలిపారు. అనంతపురం జిల్లా స్వర్ణకార కార్మిక వర్తక సంక్షేమ సంఘం తరపున ఎలాంటి సహాయ సహకారాలైనా అందిస్తామని ఆ సంఘం సహాయ కార్యదర్శి ముష్టూర్ శ్రీనివాస్ ఆచారి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పులివెందుల స్వర్ణకార సంఘ నాయకులు ప్రకాష్ ఆచారి, బొల్లు రవి, అమానుల్లా, కృష్ణమాచారి, షబ్బీర్, ఈశ్వరయ్య, ఖాదర్, మహేష్ ఆచారి, లోకేష్ ఆచ

## ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం

### - బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్

ప్రజాభూమి, వేంపల్లె



స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా గత నెల 21న ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు వినతిపత్రం ద్వారా కోరామని తెలిపారు. దీనిపై పోలీసు శాఖ అధికారులు స్పందించి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయడమే తన బాధ్యతని పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన వేంపల్లె పోలీసు శాఖ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత లక్ష్మిరెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా గ్రామంలో గంగమ్మ తల్లి అంబల్లు

ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం.



తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలంలోని నాగనందపురం గ్రామదేవత గంగమ్మ అమ్మవారి అంబల్ల కార్యక్రమం మంగళవారం రోజున అత్యంత వైభవోపేతంగా జరిగింది.బ్యాండు మేళాలు, ప్రదర్శనలు, నడుమ గ్రామ ప్రజలు గంగమ్మకు అంబల్ల బోసి నైవేద్యం



వేసి మొక్కల చెల్లించుకుని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారి అనుగ్రహాలు నిండు నూరేళ్లు తన గ్రామ పై ఉండాలని గ్రామ ప్రజలు అమ్మవారినీ దర్శించుకున్నారు.

# భారతదేశపు మొట్టమొదటి ఏఐ-ఆధారిత పర్యాటక రాష్ట్రంగా ఏపీ

**పర్యాటక మంత్రి కందుల దుర్గేష్**

**సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ మరియు ఎక్స్‌ప్లర్జర్ మధ్య మూడేళ్ల వ్యూహాత్మక అవగాహన ఒప్పందం**

**రాష్ట్రవ్యాప్తంగా నివు ఏఐ (NiVU AI) విస్తరణ.. భారతదేశంలోనే తొలి 'ఏఐ పవర్డ్ టూరిజం' రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మారబోతోందని మంత్రి దుర్గేష్ కీలక ప్రకటన**

**రాష్ట్రంలోని 100కు పైగా పర్యాటక ప్రాంతాల్లో 'నివు ఏఐ' సేవలు..ఇప్పటికే మంగళగిరిలో పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం:మంత్రి కందుల దుర్గేష్**



అమరావతి ప్రజాభూమి ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పర్యాటక రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు పర్యాటక శాఖ చారిత్రాత్మక అడుగు వేసిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలోని పబ్లిసిటీ సెల్ లో ప్రముఖ ట్రావెల్ సంస్థ 'ఎక్స్‌ప్లర్జర్' రూపొందించిన 'నివు ఏఐ' ప్లాట్‌ఫారమ్ వినియోగానికి ఏపీ పర్యాటక అథారిటీ (APTA) మూడేళ్ల వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ఏపీటీఏ ఎండీ అమ్రపాలి కాట, ఏపీటీఏ సీఈఓ ఏఏఎల్ పద్మావతి మరియు ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో మంత్రి కందుల దుర్గేష్ సంబంధిత అవగాహన ఒప్పందంపై సంతకం చేశారు. ఈ కీలక ఒప్పందం ద్వారా రాష్ట్రంలోని 100కు పైగా ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రాలలో పర్యాటకులకు బహుభాషా ఏఐ సహాయాన్ని అందించనుందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. పనితీరు బాగుంటే కాలపరిమితిని పొడిగించే అవకాశము న్నట్లు తెలిపారు. మొదటి ఏడాదిలో 30 ప్రధాన ప్రాంతాల్లో, మూడేళ్లలో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నట్లు స్పష్టం చేశారు. దీని వల్ల పర్యాటకులకు ఎలాంటి ఖర్చు లేదని, ఇది పూర్తిగా ఉచితమని, ఎలాంటి ప్రత్యేక యాప్ లు డౌన్ లోడ్ చేసుకోవాల్సిన అవసరం లేదని మంత్రి దుర్గేష్ వివరించారు. పర్యాటకుల ప్రాధాన్యతలు, భాషలు, ప్రవర్తనా సరళిని విశ్లేషించి భవిష్యత్తు ప్రణాళికలు రచించడానికి ఏపీటీఏకు రియల్-టైమ్ అనలిటిక్స్ లభిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ఈ టెక్నాలజీ ఎలా పని చేస్తుందో లైవ్ లో టెస్ట్ చేసి చూపించారు. ASK AI పేరుతో ఉన్న క్యూఆర్ కోడ్ ని ఆవిష్కరించారు. మంత్రి దుర్గేష్, సెక్రటరీ అజయ్ జైన్ స్వయంగా ఏఐ టెక్నాలజీ ని వినియోగించి స్వయంగా సంభాషించారు.. పర్యాటక ప్రాంతాల విశేషాలను మీడియా ప్రతినిధుల ఎదుట తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందం ప్రకారం పర్యాటకులు రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని కోటలు, బీచ్‌లు, చారిత్రక కట్టడాలు మరియు దేవాలయాల వద్ద ఏర్పాటు చేసే క్యూఆర్ (QR) కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా 'నివు ఏఐ'తో నేరుగా సంభాషించవచ్చని వివరించారు. వాయి స్ లేదా టెక్స్ట్ రూపంలో 130కు పైగా భాషల్లో ఆయా ప్రాంతాల చరిత్ర, సంస్కృతి మరియు ప్రాము ఖ్యతను పర్యాటకులు తెలుసుకోవచ్చన్నారు. ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడానికి ముందు.. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన మంగళ గిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, శ్రీ పానకాల లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాలలో పైలట్ ప్రాజెక్ట్‌ను విజయవంతంగా నిర్వహించామన్నారు. ప్రతిరోజూ వందలాది మంది భక్తులు ఈ ఏఐ సేవలను ఉపయోగించుకుంటూ, తమకు నచ్చిన భాషల్లో ఆలయ విశిష్టత ను, పూజా విధానాలను తెలుసుకుని అద్భుతమైన స్పందన అందించారని తెలిపారు.స్థానిక తెలుగు భక్తుల నుండి అంతర్జాతీయ పర్యాటకుల వరకు ప్రతి ఒక్కరికీ మన సంస్కృతి, వారసత్వాన్ని వారి సొంత భాషలోనే వివరించే అద్భుతమైన సాంకేతికత ఇది అని, తానే స్వయంగా ఈ 'నివు ఏఐ'ని తెలుగులో పరీక్షించానని, ఇది ఎంతో ఖచ్చిత త్వంతో, గౌరవపూర్వకంగా సమాధా నాలు ఇస్తోందని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు.

రాబోయే రోజుల్లో పర్యాటకుల సంఖ్య కూడా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేసారు.. గోదావరి పుష్కరా ల్లో ఇది ఎక్కువగా భక్తులకు ఉపయోగపడనుందని తెలిపారు.రెండేళ్ల కాలంలో ఏపీ పర్యాటక రంగంలో తెచ్చిన వినూత్న సంస్కరణలు, టెక్నాలజీ కి పెద్దపీట వేయడం మెచ్చి పలువురు ముందుకొస్తున్నారన్నారు. పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడు తూ, ఈ సాంకేతికత ద్వారా ఆంధ్రప్రదేశ్ టూరిజం సరికొత్త పుంతలు తొక్కడమే కాకుండా, ఇతర రాష్ట్రాలకు, దేశాలకు ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఐ టెక్నాలజీ సామాన్యుడికి, పర్యాటకుడికి సైతం అర్థమయ్యేలా ఉందన్నారు. ఏపీటీఏ సీఈఓ ఏఏఎల్ పద్మావతి మాట్లాడు తూ.. "ఈ భాగస్వామ్యం రెండు అద్భుతమైన రంగాలను ఒకచోటకు చేరుస్తుందని, అందులో ఒకటి ఆంధ్రప్రదేశ్ వారసత్వపు లోతు కాగా రెండవది ప్రపంచ స్థాయి భారతీయ సాంకేతికత అన్నారు. రాబోయే మూడేళ్లలో, ప్రతి సందర్శకుడు ఈ రాష్ట్రాన్ని సందర్శించే అనుభవాన్ని పూర్తిగా మార్చనున్నామన్నారు. ప్రపంచంలోనే మరెక్కడా లేని ఒక అపూర్వమైన ప్రక్రియగా కొనియాడారు.టెక్నాలజీ కి ఏపీ పెద్దపీట వేస్తుందని.. వీరిని పీఎం కార్యాలయం వారు సెలెక్ట్ చేసారని తెలిపారు. ప్రముఖ సినీనటుడు, సామాజిక సేవకర్త సోనూసూద్ ఎక్స్ ప్లర్జర్ కంపెనీలో భాగస్వామి, వాటాదారుగా ఉన్నారని పేర్కొన్నారు. ఎక్స్‌ప్లర్జర్ వ్యవస్థాపకుడు & చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జితిన్ భాటియా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో భాగస్వా మ్యం కావడం తమకు దక్కిన గౌరవం అన్నారు. భారతదేశంలోనే కాదు ప్రపంచంలోనే ప్రతి ప్రధాన పర్యాటక ప్రాంతం ప్రతి సందర్శకుడితో, ప్రతి భాషలో మాట్లాడే మొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవబోతోందని స్పష్టం చేశారు. తమపై నమ్మకం ఉంచినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఏపీటీఏ అధికారులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను అన్నారు. "ఆంధ్రప్రదేశ్ వారసత్వం, చరిత్ర, ఆధ్యాత్మిక సంప్రదాయాలపై 'నివు ఏఐ' కి శిక్షణ ఇవ్వడానికి మా బృందాలు రాత్రింబగళ్లు శ్రమిస్తున్నాయి. మంగళగిరిలోని రెండు మహాక్షేత్రాలలో జరిగిన పైలట్ ప్రాజెక్టులో, ప్రతిరోజూ వందలాది మంది భక్తులు ఇప్పటికే నివు ఏఐతో మాట్లాడుతున్నారు. గౌరవంతో, శ్రద్ధతో రూపొందించిన ఈ సాంకేతికత సందర్శకులు ఆ ప్రదేశంతో కనెక్ట్ అయ్యే విధానాన్ని ఎంతగానో మెరుగుపరుస్తుందని ఇది మాకు నిరూపించింది. రాష్ట్రంలోని ప్రతి పర్యాటక ప్రాంతంలోనూ ఇదే విధమైన లోతైన అనుభవాన్ని అందించడానికి మేము కట్టుబడి ఉన్నాము." అన్నారు. ప్రస్తుతం 75 దేశాలలో 22 మిలియన్లకు పైగా వినియోగదారులున్నారని, G20 సమయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తమ ప్లాట్‌ఫారమ్‌ను ప్రదర్శించడానికి ఎంపిక చేసారని తెలిపారు.



## గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్ కు CSR FUND ద్వారా నూతన బొలెరో వాహనాన్ని బహుకరించిన మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థ

మచిలీపట్నం క్రైమ్ ప్రజాభూమి ప్రతినిధి

శాంతి భద్రతలను, ప్రజారక్షణ కాపాడుతూ, అకుంఠిత దీక్షతో విధులు నిర్వహిస్తు, పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను సురక్షితంగా ఉంచడంలో ప్రధాన భూమిక పోషిస్తున్న గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్ కు మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సంస్థ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (CSR) ద్వారా 13 లక్షల విలువ గలిగిన BOLERO NEO N4 DSBI మోడల్ వాహనాన్ని బహుకరించారు. ఇలా నూతనంగా బహకరించిన వాహనాన్ని ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు బాపి రెడ్డి తో కలిసి ప్రారంభించడం జరిగింది. మెగా డైరెక్టర్ కృష్ణారెడ్డి కి కృష్ణాజిల్లా పోలీస్ శాఖ తరపున ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లా డుతూ... అనునిత్యం ప్రజలకు వేగవంతమైన సేవలందించడానికి నేటి కాలానికి తగినట్లుగా అత్యాధునిక సాంకేతికత కలిగిన వాహనాలు అవసరమని, పోలీసు వారి యొక్క అవసరతలను గుర్తించి వాహనాన్ని బహుకరించడం సంతోషకరమైన విషయమని తెలిపారుపోలీస్ సేవలను ప్రజలకు చేరువ చేయడానికి అధునాతన వాహనాలు ఎంతో అవసరమని, ఈ కొత్త వాహనం వారి విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించడంలో సహాయపడతుందని తెలియజేస్తూ, మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫాస్ట్రక్చర్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణారెడ్డి ని ధన్యవాదాలు తెలియజేస్తూ సంస్థ తరపున హాజరైన బాపి రెడ్డి కి సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు.

## మచిలీపట్నం సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ లీలా ప్రసాద్‌ను సత్కరించిన బీసీ సంక్షేమ సంఘం


మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి



మచిలీపట్నం సర్వజన ఆస్పత్రి సూప రింటెండెంట్ డాక్టర్ లీలా ప్రసా దను కృష్ణా జిల్లా బీ.సీ సంక్షేమ సంఘం నాయకులు మంగళవారం పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలియజేశారు. విశ్రాంతి భవనం అందుబాటులోకి తెచ్చినందుకు ధన్యవాదాలు ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు శేకుబోయిన సుబ్రమణ్యం మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి బంధు వుల సౌకర్యార్థం గతంలో నిర్మించిన విశ్రాంతి భవనాలను అందుబాటులోకి తేవాలని తాము వినతి పత్రం ఇచ్చామని గుర్తుచేశారు. దీనిపై సానుకూలంగా స్పందించి, రోటరీ క్లబ్ విశ్రాంతి భవనా న్ని అందుబాటులోకి తెచ్చినందుకు సూపరింటెండెంట్ లీలా ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలా గే, ఈ విషయమై ప్రత్యేక చొరవ తీసుకున్న ప్రముఖ న్యాయవాది లంకెశెట్టి బాలాజీకి కూడా ఆయన అభినందనలు తెలియజేశారు.సూపరింటెండెంట్‌కు సమర్పించిన మరికొన్ని ముఖ్య వినతులుఆస్పత్రిలో రోగుల సౌకర్యాలను మరింత మెరుగుపరచాలని కోరుతూ బీసీ సంఘం నాయకులు సూపరింటెండెంట్‌కు మరో వినతిపత్రాన్ని సమర్పించారు. అందులోని ప్రధానాంశాలు ఇవే ...చిరంజీవి విశ్రాంతి భవనం: అప్పటి రాజ్యసభ సభ్యులు చిరంజీవి నిధులతో ఏర్పాటు చేయించిన విశ్రాంతి భవనాన్ని కూడా త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తేవాలి.పరిశుభ్రత - కనీస వసతులు: విశ్రాంతి భవనాల వద్ద మరుగుదొడ్లను నిర్మించాలి. బంధువులు తెచ్చుకునే భోజన క్యారియర్లను శుభ్రపరుచుకోవడానికి వీలుగా నీటి కుళాయిలను ఏర్పాటు చేయాలి.ఫిర్యాదుల కొరకు QR కోడ్: రోగులు, వారి బంధువులు తమ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు వీలుగా కేటాయించిన 'క్యూఆర్ కోడ్' (QR Code)ను ప్రతి వార్డులోనూ స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలి.ప్రత్యేక గదుల పునరుద్ధరణ: రోగుల కొరకు కేటాయించిన ప్రత్యేక గదులు ప్రస్తుతం అందుబాటులో లేవు, వాటిని వెంటనే పునరుద్ధరించి రోగులకు కేటాయించాలి.కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు:ఈ కార్యక్రమంలో ఆస్పత్రి అడ్వైజరీ కమిటీ సభ్యులు బోయిన రాజు, జోగి శివ, నిక్కు రాధాకృష్ణ, భోగి రెడ్డి సుభాని, అన్సారి, బెల్లంకొండ రవి, నీలపాల కృష్ణ, పెద్దిబోయిన సాంబ, బడావుల ప్రసాద్, బోయిన రమేష్ తదితర బీసీ సంక్షేమ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## కల్లుగీత కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

రంపచోడవరం/ప్రజాభూమి ప్రతినిధి



కల్లుగీత కార్మికుల సంక్షేమం, వారి ఆర్థికాభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించిందని రాష్ట్ర గనులు, భూగర్భ మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి వర్యులు కొల్లు రవీంద్ర అన్నారు. రంపచోడవరం మండలం పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అధ్యక్షతన "నీరా ప్రాజెక్ట్ ప్రచారం - నీరా (కల్లుగీత) కార్మికుల సంఘ పరస్పర సమన్వయ ప్రోత్సాహ సంస్థాగత సదస్సు" మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి హాజర య్యారు.ముందుగా ఏజెన్సీ ముఖద్వారం గడి బాపనమ్మ తల్లి దేవస్థానం వద్ద మంత్రి రవీంద్రకు ఎమ్మెల్యే శిరీషాదేవి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం సీతపల్లి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హార్టీకల్చర్ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన నీరా తయారీ కేంద్రాన్ని, ప్రాసెసింగ్ విధానాన్ని అధికారులతో కలిసి వారు పరిశీలించారు.నీరా ఒక అద్భుత ఆరోగ్య పానీయం: మంత్రి కొల్లు రవీంద్రసమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ నీరా ద్వారా చేకూరే ప్రయోజనాలను, ప్రభుత్వ ప్రణాళికలను వివరించారు:ఆరోగ్య ప్రయోజనాలు: తాటి, కొబ్బరి, జీరుగు చెట్ల నుండి సేకరించే నీరాలో శరీరానికి అవసరమైన అనేక రకాల విటమిన్లు, ఖనిజ లవణాలు ఉన్నాయి. ఇది మధుమేహ (షుగర్) వ్యాధిని నియంత్రించడంలో అద్భుతంగా పనిచే స్తుంది. ఆధునిక టెక్నాలజీతో నిల్వ: నీరాను అత్యాధునిక పద్ధతుల్లో ప్రాసెసింగ్ చేసి నిల్వ చేయడం ద్వారా, ఏడాది పొడవునా (సీజన్‌తో సంబంధం లేకుండా) వినియోగదారులకు లభ్యమయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.ఉపాధి కల్పన: కల్లుగీత కార్మికులకు ఆధునిక పద్ధతుల్లో ఉత్పత్తి, నిల్వ, వ్యాపార విస్తరణపై పూర్తి అవగాహన కల్పించి, ఈ రంగాన్ని లాభసాటి పరిశ్రమగా మారుస్తాం.కార్మికులకు స్థిరమైన ఆదాయమే లక్ష్యం: ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవిరాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత కార్మికుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు:ఉత్పత్తుల వైవిధ్యం: కేవలం నీరా మాత్రమే కాకుండా తాటి బెల్లం, జీరుగు బెల్లం వంటి అనుబంధ ఉత్పత్తుల ద్వారా కార్మికులు ఏడాది పొడవునా సుస్థిర ఆదాయం పొందవచ్చు.ఆరోగ్య రక్షణ: నీరా సేవించడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని, జుట్టు రాలే సమస్య తగ్గుతుందని.. ఆయుర్వేద వైద్యంలోనూ దీనికి ప్రత్యేక స్థానముందని తెలిపారు.ప్రభుత్వ చేయూత: అనేక కుటుంబాలు దీనిపై ఆధారపడి జీవనోపాధి పొందేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని చెప్తూ, దీనికి సంబంధించిన ప్రత్యేక బ్రోచర్‌ను విడుదల చేశారు.సదస్సులో పాల్గొన్న ప్రముఖులు:ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సీతంశెట్టి వెంకటేశ్వర రావు, వంతల రాజేశ్వరి, పోలవరం జిల్లా కలెక్టర్ కొత్తమాసు దినేష్ కుమార్, ఆర్డీఓ స్వాతి, ఉద్యాన శాఖ వర్సిటీ వీసీ డా. ధనుంజయరావు, ఎక్సైజ్ కమిషనర్ చామకూరి శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ, గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ సభ్యులు షేక్ సుభానీ, APIIC డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు మరియు కూటమి పార్టీల ముఖ్య నాయకులు, ప్రభుత్వ అధికారులు, నీరా సేకరణదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పట్కారి కుల అభ్యున్నతి అభివృద్ధి కోసం ప్రత్యేక పట్కారి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**పట్టణ స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పరిరక్షణ ప్రత్యేక కమిషన్ ఛైర్మన్ కు వినతి పత్రం అందజేసిన**



**జగ్గయ్యపేట మున్సిపల్ ఛైర్మన్ - రంగాపురంరాఘవేంద్ర**

జగ్గయ్యపేట,ప్రజాభూమి

రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయం లక్ష్యాలను సాధించడంలో బీసీలకు రాజకీయ ప్రాధాన్యత అత్యంత కీలకమని జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు.జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర , ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పట్టణ స్థానిక సంస్థల ప్రత్యేక కమిషన్ ఛైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ ని మర్యాదపూర్వకంగా కలిసి, పట్టణ స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల (బీసీ) రిజర్వేషన్లను అనుభవాధారిత సర్వే ఆధారంగా సముచితంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రాన్ని సమర్పిం చా రు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పిం చిన సామాజిక న్యాయం లక్ష్యాలను సాధించడంలో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం అత్యంత కీలక మ ని పేర్కొన్నారు. అనుభవాధారిత సర్వే ద్వారా బీసీ వర్గాల జనాభా, సామాజిక, ఆర్థిక పరిస్థితులను సమగ్రంగా పరిగణనలోకి తీసుకుని తగిన రిజర్వేషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.తాను బీసీ-బి (పట్కారి) సామాజిక వర్గానికి చెందిన వ్యక్తినని పేర్కొన్న రాఘవేంద్ర చిన్న మరియు వెనుకబడిన బీసీ వర్గాలకు కూడా రాజకీయ ప్రాతినిధ్యం కొనసాగేలా కమిషన్ తన సిఫార్సుల్లో ప్రత్యేక శ్రద్ధ వహించా లని కోరారు. బీసీ రిజర్వేషన్లు బలోపేతం కావడం ద్వారా మాత్రమే పట్టణ స్థానిక సంస్థల్లో సమగ్ర, సమాన మరియు ప్రజాప్రతినిధ్య పాలన సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు.అదేవిధంగా, రాష్ట్రంలో పట్కారి కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రత్యేక కమిషన్ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. పట్కారి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన ఈ వర్గానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా చేరడంతో పాటు, స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, విద్యా సహాయం, ఉపాధి అవకాశాలు మరియు ఆర్థిక సాధికారతకు విస్తృత అవకా శాలు కలుగుతాయని వివరించారు. అంతేకాకుండా, ఈ కార్పొరేషన్ ద్వారా పట్కారి సమాజ అభివృ ద్ధికి ప్రత్యేక కార్యాచరణలు అమలు చేయడం సాధ్యమవుతుందని తెలిపారు.తన వినతి పత్రాన్ని సానుకూలంగా పరిశీలించి, బీసీ వర్గాల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యాన్ని పరిరక్షించడంతో పాటు పట్కారి కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ సందర్భంగా తన అభిప్రాయాలను వ్యక్తపరచుకునే అవకాశం కల్పించిన ప్రత్యేక కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ కి మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

## పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి యు. వి. సుబ్బారావు

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి



మచిలీపట్నం పట్టణంలోని సిపిఎం హై స్కూల్ మరియు గవర్నమెంట్ రాంజీ హై స్కూల్‌లను జిల్లా విద్యాశాఖ అధికారి (DEO) యు. వి. సుబ్బారావు మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బోధనా తీరును, విద్యార్థుల విద్యా ప్రమాణాలను ఆయన సమగ్రంగా పరిశీలించారు.అభ్యాస ఫలితాలు, నోట్‌బుక్‌ల పరిశీలనరెండు పాఠశాలల్లోని 7వ మరియు 10వ తరగతి గదులను డీఈఓ సందర్శించి విద్యార్థుల అభ్యాస స్థాయిలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల నోట్‌బుక్‌ల దిద్దుబాటు (Correction) విధానాన్ని తనిఖీ చేశారు.ఉపాధ్యాయుల బోధనా పద్ధతులు, అకడమిక్ క్యాలెండర్ అమలు తీరు, తరగతి గది నిర్వహణను పరిశీలించారు.విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులకు పలు కీలక సూచనలు చేశారు.మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసిన డీఈఓసిపిఎం హై స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని (MDM) డీఈఓ సుబ్బారావు స్వయంగా రుచి చూశారు. భోజనం తయారీలో పాటిస్తున్న పరిశుభ్రతను, ఆహార నాణ్యతను పరిశీలించి, ఎండిఎమ్ రిజిస్టర్లను తనిఖీ చేశారు."విద్యార్థులకు నిరంతరం నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనాన్ని అందించాలి. ప్రభుత్వం అందజేస్తున్న మిల్లెట్ చిక్కీలను విద్యార్థులకు క్రమం తప్పకుండా పంపిణీ చేయాలి. యు. వి. సుబ్బారావు, డీఈఓప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఆదేశాలు:తప్పనిసరిగా యూనిఫాం: పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థి తప్పనిసరిగా యూనిఫాం ధరించేలా ప్రధానోపాధ్యాయులు తగిన చర్యలు తీసుకోవాలి.ప్రత్యేక శ్రద్ధ: వెనుకబడిన విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదలకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలి.విద్యా సహకారం: ప్రతి విద్యార్థి యొక్క నేర్చుకునే స్థాయిని (Learning level) గుర్తించి, అందుకు తగినట్లుగా ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరమైన విద్యా సహకారం అందించాలని ఉపాధ్యాయులను డీఈఓ ఆదేశించారు.

## హోంగార్డులపై కూటమి సర్కార్ సవతి తల్లి ప్రేమ

**తెలంగాణతో సమానంగా రూ.30 వేల వేతనం ఇవ్వాల్సిందే**

**విధుల్లో వివక్ష, రక్షణ లేని జీవితాలు.. హామీలను గాలికొదిలేసిన చంద్రబాబు, పవన్, లోకేష్**



**కానిస్టేబుల్ కొడుకునన్న డిప్యూటీ సీఎం ఇప్పుడెందుకు పట్టించుకోరు?**

**మచిలీపట్నం ప్రెస్ మీట్‌లో మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) ఘాటు విమర్శలు**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

రాష్ట్రంలో రెండేళ్ల కూటమి పాలనలో హోంగార్డుల జీవితాలు దయనీయంగా మారాయని, ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు కాలేదని వైఎస్సార్సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) మండిపడ్డారు. మచిలీపట్నంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం హోంగార్డులపై చూపుతున్న వివక్షను ఎండగట్టారు.ఇప్పటికీ గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో పెంచిన వేతనాలే దిక్కయ్యాయని, ఇప్పటికైనా పొరుగు రాష్ట్రం తెలంగాణ తరహాలోనే ఇక్కడి హోంగార్డులకు వేతనాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.వెట్టి చాకిరీ ఎక్కువ.. రక్షణ తక్కువ!కూటమి ప్రభుత్వంలో వంచనకు గురికాని వర్గమంటూ ఏదీ లేదని, రాష్ట్రంలో సుమారు 15 నుంచి 16 వేల మంది పనిచేస్తున్న హోంగార్డుల వ్యవస్థ తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోందని పేర్ని నాని ఆవేదన వ్యక్తం చేశారు.పెరగని జీతాలు: "గొర్రె తోక బెత్తెడు" చందంగా హోంగార్డుల జీవితాలు మారాయి. ఇప్పటికీ రోజుకు కేవలం రూ. 710 వేతనంతో నెలకు గరిష్టంగా రూ. 21,010 మాత్రమే పొందుతున్నారు. గతంలో వైఎస్ జగన్ పుణ్యమా అని రూ. 18 వేల నుంచి ఈ స్థాయికి పెరిగింది. కానీ, ఈ రెండేళ్ల కూటమి పాలనలో రోజుకు రూ. 200 కూడా పెంచలేదు.కఠినమైన విధులు – సున్నా భత్యాలు: కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుళ్లతో సమానంగా రాత్రి బీట్లు, బందోబస్తులు, కోర్టు సాక్ష్యాలు, చివరకు అనాథ శవాల కాపలా వరకు అన్ని పనులూ వీరితోనే చేయిస్తున్నారు. శాంతిభద్రతల సమస్యల వేళ తన్నులు తినడానికైనా వీరే ముందుండాలి. కానిస్టేబుళ్లకు టీఏ (ప్రయాణ భత్యాలు) ఇస్తారు కానీ, హోంగార్డులకు రూపాయి ఇవ్వరు.

ఉన్నతాధికారులు బస్సు పెడితే వెళ్లాలి, లేదంటే సొంత డబ్బులు పెట్టుకుని బందోబస్తులకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.ఆరోగ్య, జీవిత భద్రత కరవు: డ్యూటీ చేస్తూ చనిపోతే ఇన్సూరెన్స్ లేదు, కుటుంబానికి క్యాష్ లెస్ వైద్య సదుపాయం లేదు. ఎవరైనా హోంగార్డు మరణిస్తే.. తోటి సిబ్బంది ఒకరోజు వేతనం చందాలు వేసుకుని ఆ కుటుంబానికి ఇచ్చుకోవాల్సి వస్తోందే తప్ప, పోలీస్ వెల్ఫేర్ ఫండ్ నుండి ఎలాంటి సాయం అందడం లేదు. నెలకు కేవలం 2 రోజులు మాత్రమే పెయిడ్ లీవ్స్ ఇస్తున్నారు. అంత కుమించి ఆరోగ్యం బాగోక సెలవు పెడితే జీతాల్లో కోతలు విధిస్తున్నారు. ఇచ్చిన హామీలు ఏమా య్యా యి?ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు చెప్పిన మాటలను పేర్ని నాని ఈ సందర్భంగా గుర్తుచే శారు:"నేను కానిస్టేబుల్ కొడుకును.. హోంగార్డుల కష్టాలు నాకు తెలుసు అంటూ పవన్ కళ్యాణ్ పెద్ద పెద్ద మాటలు చెప్పారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ కూడా హోంగార్డులను ఉద్ధరిస్తామని, లేదంటే కాలర్ పట్టుకుని అడగమన్నారు. ఎంత పనికి అంత జీతం ఇస్తామన్న పవన్ కళ్యాణ్ ఇవాళ హోంగార్డులను ఎందుకు పట్టించుకోవడం లేదు? పవన్ గారు.. మీ శాఖ తప్ప అన్ని శాఖల గురించీ మాట్లాడతారు కదా, మరి మీ సొంత హోంశాఖ పరిధిలోని హోంగార్డుల బాధలు ఎందుకు కనిపించడం లేదు?" అని నాని ప్రశ్నించారు.హోంగార్డుల పక్షాన 'వైఎస్సార్సీపీ' ప్రధాన డిమాండ్లు: క్రమసంఖ్యడిమాండ్ల వివరాలు01తెలంగాణ తరహా వేతనాలు: తెలంగాణలో హోంగార్డులకు ఇస్తున్నట్లుగా రూ. 30,000 వేతనం, ట్రాఫిక్ విధుల్లో ఉంటే అదనంగా మరో రూ. 3,000 చొప్పున ఏపీలోనూ చెల్లించాలి.02కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో కోటా: రాత, శారీరక పరీక్షలు పాసై నియామకమైన హోంగార్డులకు కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీలో ప్రత్యేక కోటా కల్పించాలి.03సంక్షేమ పథకాలు: హోంగార్డుల పిల్లలకు 'తల్లికి వందనం', ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిస్థాయిలో వర్తింపజేయాలి. వారి కుటుంబాల్లో అర్హులైన వృద్ధులు, వితంతువులకు పెన్షన్లు ఇవ్వాలి.04ఆరోగ్య & జీవిత బీమా: కానిస్టేబుళ్ల తరహాలోనే హోంగార్డులకు సైతం పూర్తి ఉచిత క్యాష్‌లెస్ మెడికల్ ట్రీట్‌మెంట్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి.05సెలవుల సవరణ: నెలకు ఇచ్చే పెయిడ్ లీవులను 3 రోజులకు పెంచి, వాటిని ఆరు నెలల కాలంలో ఎప్పుడైనా వాడుకునే వెసులుబాటు కల్పించాలి. బందోబస్తులకు వెళ్లినప్పుడు కానిస్టేబుళ్లతో సమానంగా టీఏ ఇవ్వాలి.అలాగే, గతంలో వైఎస్సార్సీపీ ప్రస్తావించిన కానిస్టేబుళ్ల సమస్యల్లో కొన్ని పరిష్కరించినా.. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌కు సంబంధించిన 6 వాయిదాల బకాయిలను ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించలేదని, వాటిని ఎప్పుడు ఇస్తారో స్పష్టం చేయాలని పేర్ని నాని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం హోంగార్డులపై సవతి తల్లి ప్రేమను వీడి, వారి న్యాయమైన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని హితవు పలికారు ఈ ప్రెస్ మీట్ లో వైయస్సార్సీపి టౌన్ పార్టీ అధ్యక్షులు మేకల సుబ్బన్న, చలమల శెట్టి గాంధీ, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు


Printed by Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at and published at DOOR NO. 19-4-378, S T V NAGAR, NEAR OLD TVS SHOW ROOM, OPPOSITE TIRUPATHI (URBAN) editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .PRGINo. "APTEL/25/A2316,Phone No. Cell : 9502116677

## 2027 గోదావరి పుష్కరాలు నాటికి పోలవరం పూర్తి చేసి,
# ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతులు మీదుగా జాతికి అంకితం చేస్తాం


- నిర్వాసితులను గుర్తించి, త్యాగధనులుగా గౌరవించింది కూటమి ప్రభుత్వమే.
- రాష్ట్ర మంత్రి డా.నిమ్మల రామానాయుడు.



ప్రజాభూమి ప్రతినిధి-పోలవరం

పోలవరం ప్రాజెక్టు పనులను మంగళవారం పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రాష్ట్ర జలవనరులు శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ 2027 గోదావరి పుష్కరాలు నాటికి పోలవరం పూర్తి చేసి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతులు మీదుగా జాతికి అంకితం చేస్తామని అన్నారు. ఈ నెల రెండవ వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం పోలవరం ప్రాజెక్టు పనులు పరిశీలనకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. గొడ్డలి పార్టీ విధ్వంశ పాలనలో ధ్వంసమైన పోలవరాన్ని గాడిలో పెట్టామని,ధ్వంసమైన ధయాఫ్రమ్ వాల్ స్దానంలో 440 రోజుల్లోనే రూ 990 కోట్లతో కొత్త డయా ఫ్రం వాల్ నిర్మించామని తెలిపారు. 5 ఏళ్ళలో గత ప్రభుత్వం 2 శాతం పనులు చేస్తే, కూటమి ప్రభుత్వం 2 ఏళ్ళలోనే రూ 6970 కోట్లు ఖర్చుచేసి 15 శాతం పనులు పూర్తి చేశామని అన్నారు. మెయిన్ డ్యామ్ సంవత్సరం కాలంలోనే గ్యాప్-1 పనులు 48 శాతం, గ్యాప్-2 పనులు 29 శాతం పూర్తి చేశామని తెలిపారు. 2027 నాటికి ఈసిఆర్ఎఫ్ డ్యాం పూర్తి చేసే లక్ష్యంతో పనులు చేస్తున్నామని అన్నారు. కుడి, ఎడమ ప్రధాన కాలువలను అనుసంధానించే 4 టన్నెల్స్ కూడా మరో 10 రోజుల్లో పూర్తవుతున్నాయని అన్నారు. రూ 536 కోట్లతో కుడి,ఎడమ వైపు రహదారులు నిర్మాణాల పనులు చేపట్టామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పలు మార్లు ఢిల్లీ వెళ్ళి, కేంద్రం నుండి త్వరితగతిన నిధులు మంజూరు వలన వేగం అవుతుందని అన్నారు. 2 ఏళ్ళలో కేంద్రం రూ 8,323 కోట్లు అడ్వాన్స్ ఇవ్వగా, నిర్వాసితులకు రూ 2,250 కోట్లు పంపిణీ పంపిణీ చేశామని అన్నారు. నిర్వాసితులను గుర్తించి, త్యాగధనులుగా గౌరవించింది కూటమి ప్రభుత్వం మేనని అన్నారు. జూలై నెలలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నిర్వాసితులకు నష్ట పరిహారంగా రూ 200 కోట్లు అందించనున్నట్లు తెలిపారు. పోలవరం టూరిజం హబ్ రూపొందించడానికి ఐకానిక్ బ్రిడ్జిలు, రిసార్ట్స్, హోటల్స్, వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధి చేద్దామని అన్నారు. ఏలూరు, రాజమండ్రి, కొవ్వూరు, జీలుగుమిల్లి జాతీయ రహదారులను పోలవరం ప్రాజెక్టుకు అనుసంధానం చేస్తామని తెలిపారు. నాడు వైసీపీ ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన రియంబర్స్మెంటు నిధులను దారిమళ్లించి, నిర్వాసితులను గోదావరిలో ముచ్చేసిందని తెలిపారు. నిర్వాసితులు ఇళ్ళు నిర్మించు కోవడానికి రూ 3.5 లక్షలకు, ఇంటి జాగా కోసం రూ 2 లక్షలుకు పెంచి ఇస్తున్నామని అన్నారు. నిర్వాసితులు కాలనీలు నిర్మాణంతో పాటు, మౌళిక వసతులు సైతం కల్పించేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. 2027 లో పోలవరం పూర్తయ్యే నాటికి, తొలిదశ ఆర్అండ్ఆర్ పూర్తి చేసేలా, లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. 2027 పుష్కరాలు నాటికి పోలవరం పూర్తి చేసి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతులు మీదుగా జాతికి అంకితం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటరు ఒ ఎక్స్ అఫీషియో జాయింటు కలెక్టరు వి.అభిషేక్, ఏపి ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాస రావు, ఇరిగేషన్ సలహాదారులు యం. వెంకటేశ్వర రావు, ఆర్డీవో యం.వి.రమణ, ఇయన్ సి జి.నరసింహారావు, యస్ఇ కె.రామచంద్ర రావు, వివిధ శాఖలు అధికారులు, మెగా ప్రతినిధి అంగర సతీష్ బాబు, జియం గంగాధర్, సిజియం పి.మురళీ, ఇయన్ సి జి.నరసింహా రావు, ఇంజనీరింగు బృందం ప్రతినిధులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అదనపు బాధ్యతలు స్వీకరించిన ఆచార్య మద్దాలి లక్ష్మీనారాయణరావు



ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) నూజివీడు క్యాంపస్ ఇన్‌చార్జ్ డైరెక్టరుగా ఆచార్య మద్దాలి లక్ష్మీనారాయణరావు అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సంవత్సరం మార్చి 12 నుంచి ఇప్పటివరకు ఆచార్య గోపాలరాజు ఇన్ చార్జ్ డైరెక్టరుగా కొనసాగారు. ఆచార్య మద్దాలి లక్ష్మీనారాయణరావు ప్రస్తుతం ఆర్జీయూకేటీ ఉపకులపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ మరియు ఒంగోలు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్ సమక్షంలో ఆచార్య మద్దాలి లక్ష్మీనారాయణరావు నూజివీడు క్యాంపస్ డైరెక్టురుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూజివీడు క్యాంపస్ విద్యా, పరిపాలనా కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ క్యాంపస్ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని ఆచార్య మద్దాలి లక్ష్మీనారాయణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి డా. లక్ష్మణరావు, అకడమిక్ డీన్ డా. చిరంజీవి ఇంకా ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఏలూరు ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘించి శబ్ద కాలుష్యంపై పోలీసుల ఉక్కుపాదం

## భారీగా సైలెన్సర్లు, స్పీకర్ల స్వాధీనం.



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.


ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్ యొక్క ఆదేశాలపై ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్. లక్ష్మణరావు , సిబ్బంది నగరంలో ఒక ప్రత్యేక తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణ ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్న శబ్ద కాలుష్యం , నిబంధనలకు విరుద్ధంగా మార్పులు చేసిన వాహనాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ సందర్భంగా నిర్వహించిన డ్రైవ్ లో సుమారు 50 మోటార్ సైకిల్ సైలెన్సర్లను స్వాధీనం చేసుకున్నారు. 15 స్పీకర్ బాక్సు లను మరియు 225 ఎల్.ఈ.డీ లైట్లనులిసీజ్ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వాహనదారులకు మరియు వ్యాపారులకు కఠినమైన హెచ్చరికలు జారీ చేశారు. వాహనాలకు అనుమతి లేకుండా డార్జిలింగ్ లైట్లు, శబ్ద కాలుష్యాన్ని పెంచే మోడిఫైడ్ సైలెన్సర్లు లేదా భారీ స్పీకర్ బాక్సులను అమర్చడం చట్టరీత్యా నేరం, ఇటువంటి నిబంధనలు పాటించని వాహనదారులపై ట్రాఫిక్ నిబంధనల ప్రకారం మరియు బి.ఎన్.ఎస్ చట్టం ప్రకారం కఠినమైన కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ అక్రమ లైట్లు, సైలెన్సర్లను విక్రయించే షాపు యజమానుల పట్ల కూడా కఠినంగా ఉంటామని, అక్రమ అమ్మకాలు జరిపే దుకాణాలపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. నగరంలో వాహనాల వల్ల కలిగే శబ్ద కాలుష్యాన్ని అరికట్టి, ప్రజలకు ప్రశాంతమైన జీవనాన్ని అందించేందుకు పోలీసు శాఖ ఈ చర్యలు చేపట్టింది. వాహనదారులు తమ వాహనాల్లో ఎటువంటి మార్పులు చేయకుండా, ఫ్యాక్టరీ నిర్దేశిత ప్రమాణాలకే కట్టుబడి ఉండాలని పోలీసులు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

## కొవ్వలి చెట్ల అక్రమ నరికివేతపై ఉప ముఖ్యమంత్రి పేషీ జోక్యం.

-జిల్లా పంచాయతీ అధికారికి ఆదేశాలు.

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.



కొవ్వలి గ్రామంలో జరుగుతున్న చెట్ల అక్రమ నరికివేత, ఇందులో ప్రభుత్వ సిబ్బంది పాత్రపై ఉన్న ఆరోపణలు, అలాగే (పి జి ఆర్ ఎస్) ఫిర్యాదులపై చర్యలు లేకపోవడం వంటి అంశా లను ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఒ పర్యావరణ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేషీ దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణ స్పందనతో ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి, మల్లిఖార్జున్ రావు విచారణ చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో 2026 జూలై 6న డి.పి.ఓ మల్లిఖార్జున్ కొవ్వలి గ్రామంలో క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించారు. క్షేత్రస్థాయి నుంచి "ప్రూనింగ్ మాత్రమే జరుగుతోంది" అనే సమాచారం పేషీకి చేరినప్పటికీ, గ్రామదీప్ ట్రస్ట్ సమర్పించిన ఫోటోలు, వీడియోలు మరి యు ఇతర ఆధారాలు ఇది కేవలం ప్రూనింగ్ కాదని, చెట్లను తీవ్రంగా దెబ్బతీసే విధంగా నరికివేస్తున్న ఘటనలు ఉన్నాయని చూపించాయి. ఈ ఆధారాలను పరిశీలించిన అనంతరం, క్షేత్రస్థాయి నుంచి వాస్తవ పరిస్థితులకు భిన్నమైన సమాచారం వెళ్లిన విషయం పేషీ దృష్టికి వచ్చింది. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ పేషీ ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది పవన్ కళ్యాణ్ లక్ష్యం చెట్ల సంరక్షణ. చెట్ల అక్రమ నరికివేతను ఏ పరిస్థితుల్లోనూ సహించబోమని పేషీ హామీ ఇచ్చింది. గ్రామదీప్ ట్రస్ట్ స్పందనను స్వాగతిస్తోంది. అయితే, స్పందనతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు కూడా తీసుకోవాలి. అక్రమంగా చెట్లను ధ్వంసం చేసిన వారిపైనా, వాస్తవాలకు విరుద్ధంగా నివేదికలు సమర్పించిన వారిపైనా నిష్పాక్షిక విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మేము కోరుతున్నాము. పర్యావరణ పరిరక్షణలో గ్రామదీప్ ట్రస్ట్ తన పోరాటాన్ని కొనసాగిస్తుంది.

## జంగారెడ్డిగూడెం నుండి గుంటూరుకు
# అక్రమంగా తరలిస్తున్న పొగాకు బేళ్లను పట్టుకున్న విజిలెన్స్ అధికారులు



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా

పొగాకు బోర్డు విజిలెన్స్ అధికారులకు అందిన ముందస్తు సమాచారం మేరకు, జంగారెడ్డిగూడెం నుండి గుంటూరుకు అక్రమంగా రవాణా అవుతున్న పొగాకు బేళ్లను అధికారులు చాకచక్యంగా పట్టుకున్నారు. నమ్మదగిన సమాచారంతో నిఘా ఉంచిన అధికారులు, అనుమానాస్పదంగా వెళ్తున్న రెండు ఆటోలను ఆపి ఏలూరు జిల్లా పెదపాడు మండలం కలపర్రు టోల్ ప్లాజా వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమతులు (పర్మిట్లు) లేకుండా అక్రమంగా తరలిస్తున్న సుమారు "32 హై గ్రేడ్ పొగాకు బేళ్లను" గుర్తించి, వాటిని తక్షణమే సీజ్ చేశారు. ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి, తదుపరి చర్యల నిమిత్తం సీజ్ చేసిన పొగాకును జంగారెడ్డిగూడెం వేలం కేంద్రానికి తరలించారు.

**విజిలెన్స్ అధికారుల హెచ్చరిక**

బోర్డు నిబంధనలను ఉల్లంఘించి ఎవరైనా అక్రమంగా పొగాకును రవాణా చేస్తే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారాన్ని అధికారులకు అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి. సమాచారం అందించడానికి ఓ ఎస్ డి విజిలెన్స్ గుంటూరు 9154030702 విజిలెన్స్ జంగారెడ్డిగూడెం 9849777055 నెంబర్లకు తెలుపగలరు..అంతేకాకుండా, బోర్డు నిబంధనల ప్రకారం వారికి తగిన పారితోషికం (బహుమతి) కూడా ఇవ్వబడుతుంది. రైతులు ఎవ్వరు పొగాకు బేళ్ళను ను బయటికి అమ్మరాదు కేవలం వేలం కేంద్రాలలో మాత్రమే అమ్మాలని దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని జంగారెడ్డిగూడెం పొగాకు బోర్డు ఆక్షన్ సూపరింటెండెంట్ ఎం.గ్రేస్ మార్గరెట్ తెలియజేశారు. ఈ దాడుల్లో పొగాకు బోర్డు విజిలెన్స్ అధికారి కిరణ్ జిఎం., సాయి ప్రశాంత్ , ధర్మతేజలు పాల్గొన్నారు.

## నూజివీడు డిప్యూటీ తహసిల్దార్ జీ వీ వెంకటేశ్వరరావు ఆకస్మిక మృతి

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు



నూజివీడు పి డి ఎస్ డిప్యూటీ తహసిల్దార్ శ్రీ గుండుబోయిన వెంకటేశ్వరరావు మృతిచెందారు. ఆయన మృతితో రెవెన్యూ శాఖలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృదుస్వభావి, ప్రజలకు అందుబాటులో ఉండే అధికారిగా గుర్తింపు పొందిన వెంకటేశ్వరరావు ఆకస్మిక మరణం కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు, సహోద్యోగులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పలువురు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# కోడిపందాలు మట్టితోలకాలలో ఆరోపణలు ఎదుర్కొంటాను నువ్వు ఎమ్మెల్యే నిమర్శించేది

- మెట్ట బుచ్చిరాజు వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి
- ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై నిరాధార ఆరోపణలు తగవు: పద్దం వెంకటకృష్ణ



ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి

పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై బుట్టాయిగూడెం మండలానికి చెందిన మెట్ట బుచ్చిరాజు చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని, వాటిని వెంటనే వెనక్కి తీసుకోవాలని జనసేన పార్టీ పోలవరం నియోజకవర్గ ఎస్టీ సెల్ నాయకుడు పద్దం వెంకటకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా ఎన్నికైన చిర్రి బాలరాజు నియోజకవర్గ అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలవరం నియోజకవర్గంలో రహదారులు, తాగునీటి సౌకర్యాలు, విద్య, వైద్యం, సాగునీటి అభివృద్ధి, గిరిజన ప్రాంతాల సంక్షేమ కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. కొంతమంది పెత్తందారు రాజకీయ నాయకుల మెప్పు కోసం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై నిరాధార ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్న నాయకుడి ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. అంతేకాక, మెట్ట బుచ్చిరాజు గతంలో పేకాట, కోడిపందాలు, అక్రమ మట్టి తవ్వకాల వంటి వ్యవహారాల్లో ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తి అని పేర్కొంటూ, అలాంటి వ్యక్తి అవినీతి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని పద్దం వెంకటకృష్ణ వ్యాఖ్యానించారు. ఇకనైనా మెట్ట బుచ్చిరాజు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా స్పందించాలని, పోలవరం ప్రజలు వ్యక్తిగత విమర్శలను కాకుండా అభివృద్ధినే కోరుకుంటున్నారని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జనసేన మండల నాయకులు బండారు అనిల్, రూపా సత్యనారాయణ, వీరంకి వెంకటేశ్వరరావు, చిర్రి రాంపండు, కొప్పుల శ్రీకాంత్, బుడిపుటి చిరంజీవి, పండు శ్రీరామ్, పండు బాలాజీ పాల్గొన్నారు.

## సిద్ధారంలో పెద్దపులి కదలికలు

ప్రజా భూమి ప్రతినిధి-వేలేరుపాడు



వేలేరుపాడు మండలం కట్కూరు పంచాయతీ పరిధిలోని సిద్ధారం గ్రామంలో పెద్దపులి అలజడి సృష్టిస్తుంది. ఇందుకు సంబంధించి అందిన వివరాలు ఇలా ఉన్నాయి వారం రోజుల క్రితం వేలేరుపాడు మండలంలోని అడవుల్లోకి ప్రవేశించిన పెద్దపులి, పశువులను చంపటం ప్రజలను భయభ్రాంతులకు గురి చేయటం అందరికీ తెలిసిందే! ఆ సమయంలో అధికారులు అప్రమత్తమై మారుమూల గిరిజన గ్రామాల్లో ప్రజల రక్షణార్థం తగు చర్యలు తీసుకున్నారు. తదుపరి పులికి సంబంధించిన ఏ విధమైన కదలికలు లేకపోవడంతో అందరూ ఆదమర్చి ఉన్న సమయంలో సోమవారం మరల సిద్ధారం సమీపంలో పులి కదలికలు కనిపించడంతోపాటు ఒక పశువును చంపేసిందని మరో మూడు పశువులపై దాడి చేసిందని గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు పులిని అదుపు చేసే పనిలో నిమగ్నశీ అయ్యారు.

## వాడపల్లి దేవస్థాన ప్రధాన రహదారి విస్తరణకు అడుగులు

-ఈనెల 16న రైతులతో సమావేశం

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట



వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి వెళ్లే ప్రధాన రహదారి విస్తరణ పనులపై కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) వి.వి. సత్యనారాయణ అధ్యక్షతన సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్తపేట ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో రహదారి విస్తరణకు సంబంధించిన భూసేకరణ, సర్వే, తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, రహదారి విస్తరణకు సంబంధించి ఈ నెల 16వ తేదీన ప్రభావిత రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకుంటామని తెలిపారు. రైతుల సహకారంతో పారదర్శకంగా ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్‌జేసీ త్రినాథరావు, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, తహసీల్దార్ ఆర్.డి. రామచంద్రమూర్తి, సర్వేయర్, ఆర్ అండ్ బి శాఖ అధికారులు పాల్గొని రహదారి విస్తరణకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు.

## కొవ్వూరులో మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు

ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి



తూర్పుగోదావరి జిల్లా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో కొవ్వూరు క్రిస్టియన్ పేటలోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఎంఆర్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, ఎంఆర్పీ ఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పెనుమాక జయరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ ఫలాలను మాదిగలు పూర్తిస్థాయిలో అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం కోసం ఎంఆర్పీఎస్ అనేక ఉద్యమాలు నిర్వహించి, ప్రభుత్వాలను ఒప్పించి పలు సంక్షేమ పథకాలు అమలుకు కృషి చేసిందని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ, పింఛన్ల పెంపు, రేషన్ సౌకర్యాల విస్తరణ, ఎస్సీ/ఎస్టీ అత్యాచార నిరోధక చట్ట పరిరక్షణ వంటి అంశాల్లో ఉద్యమాల పాత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో గెడ్డం వినోద్, ముప్పిడి దానియేలు, రిటైర్డ్ జిల్లా జడ్జి కె. భీష్మ గాంగేయుడు, ముప్పిడి రాజు, చాపల శ్రీనివాసు, న్యాయవాది తిగిరిపల్లి రవికుమార్, బొల్లిపో మధుశేఖర్ అరుంధతీయ, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సభ్యులు, రిటైర్డ్ ఉద్యోగ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తలకు ఆరోగ్య అంశాలపై అవగాహన

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



ఆగిరిపల్లి మండలంలోని సగ్గూరు, ఈదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం ఆశా డే సందర్భంగా ఆశా కార్యకర్తలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ పిల్లలు, యుక్తవయసు బాలికలు, మహిళల్లో రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రజలకు సమర్థవంతంగా అవగా హన కల్పించే విధానం, అలాగే మధుమేహం, రక్తపోటు వంటి అంటురాని వ్యాధుల ప్రమాద కారకాలు, ఆరోగ్యకరమైన ఆహారం, నిత్య వ్యాయామం, మానసిక ఒత్తిడి నియంత్రణపై గ్రామాల్లో ప్రజలకు చైతన్యం కల్పించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవల విస్తరణలో ఆశా కార్యకర్తల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ టీనా, డాక్టర్ మహిత , డాక్టర్ మంజులాదేవి, డాక్టర్ సంధ్యా ప్రియ, డాక్టర్ నరేంద్ర కృష్ణ, డాక్టర్ జ్ఞాన సందీప్, ఆరోగ్య సహాయకులు, మధ్యస్థాయి వైద్యులు, ఆశా కార్యకర్తలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాభూమి



# జిల్లాలో 59.47 శాతం ఫారాల డిజిటైజేషన్..

- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సాఫీగా సర్ ప్రక్రియ
- ఓటర్ల సహాయార్థం కీలకంగా వ్యవహరిస్తున్న హెల్ప్ డెస్కులు
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ

ఎన్‌టీఆర్ జిల్లాలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం సాఫీగా కొనసాగుతోందని.. ఇప్పటివరకు 59.47 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తయిందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని చిట్టినగంలో పర్యటించారు. నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఓటరు హెల్ప్ డెస్కుల కార్యకలాపాలను పరిశీలించారు. 2002 ఎస్ఐఆర్ జాబితాతో మ్యాపింగ్, ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ,



స్వీకరణ, ఫారాల డిజిటైజేషన్ పనులను పరిశీలించి.. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బీఎల్‌వోలు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల విజ్ఞప్తి మేరకు ఎన్యూమరేషన్ ఫారాలు నింపడం, సందేహాలను నివృత్తి చేయడం వంటి సేవలను హెల్ప్ డెస్కుల ద్వారా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.జిల్లాలో 10,18,936 (59.47 శాతం) ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తయిందన్నారు. తిరువూరులో 1,55,658 (74.58 శాతం) డిజిటైజేషన్ జరగ్గా.. విజయవాడ పశ్చిమలో 1,24,879 (48.59 శాతం), విజయవాడ సెంట్రల్ 1,39,541 (50.23 శాతం), విజయవాడ తూర్పు 1,40,266 (52 శాతం), మైలవరం 1,94,322 (68.14 శాతం), నందిగామ 1,36,419 (65.75 శాతం), జగ్గయ్యపేటలో 1,27,851 (61.6 శాతం) మేర ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లు వివరించారు. బీఎల్‌వోలు, అధికారులు ఈసీఐ నియమనిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించేలా ఎలాంటి ప్రభావాలకు తావులేకుండా నిష్పక్షపాతంగా నిబద్ధతతో సర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడంలో భాగస్వాములయ్యేలా క్షేత్రస్థాయిలో అధికారులు కృషి చేస్తున్నారని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

## పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన భవిష్యత్: గురుకుల బాలికలకు అవగాహన

ఆరోగ్యకర జీవనశైలి, రుతుక్రమ పరిశుభ్రత, పొగాకు నియంత్రణపై వైద్యుల సూచనలు



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

బొద్దనపల్లి మైనారిటీ గురుకుల బాలికల వసతి గృహాన్ని పీహెచ్‌సీ ఈదర వైద్యులు నరేంద్ర కృష్ణ, జ్ఞాన సందీప్ సందర్శించి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకర జీవనశైలి, సమతుల్య ఆహారం, రుతుక్రమ పరిశుభ్రత పాటించాల్సిన అవసరంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అలాగే పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించి, వాటికి పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఎదురైతే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని, పరిశుభ్రతను అలవాటు చేసుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ డాక్టర్ వీర్రాజు మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కూడా కాపాడుకుంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్ బాల మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికే కాకుండా భవిష్యత్తును కూడా దెబ్బతీస్తాయని, ఎలాంటి పరిస్థితుల్లోనూ వాటికి అలవాటు పడకూడదని విద్యార్థినులకు వివరించారు. స్కూల్ ప్రిన్సిపాల్ గీతాంజలి మాట్లాడుతూ వైద్యులు అందించిన సూచనలను ప్రతిరోజూ పాటిస్తూ పరిశుభ్రతను జీవన విధానంలో భాగంగా చేసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు పంపిణీ

-రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామంలో ఇటీవల వైద్యం చేయించుకున్న సుమారు.19మంది బాధిత కుటుంబాలకు సుమారు. రూ.12 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసిన మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి సంజీవని వంటిదని అన్నారు. రాష్ట్రంలో పేద ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుందని దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదని. కానీ కూటమి ప్రభుత్వంలో నూజివీడు నియోజకవర్గ ములో ఇప్పటి వరకూ సుమారు.రూ.15 కోట్లు విలువైన ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులు అందించామన్నారు.ప్రభుత్వ ఆసుపత్రిలోని మెరుగైన వైద్యం కోసం మెరుగైన వైద్య పరికరాల ఏర్పాటుకు వేలకోట్ల ఖర్చు చేసిందని తద్వారా ప్రజలకు మెరుగైన వైద్యంఅందుతుందన్నారు.కూటమి ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్య భద్రతతో సంతోషంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్రికల్చర్ వైస్, చైర్మన్ శ్రీనివాసరెడ్డి సబ్ కలెక్టర్,బి, వినూత్న,ఏ, ఎమ్, సి, చైర్మన్, కే,అరుణ, ఏ, ఎమ్, సి, మాజీ చైర్మన్ కే, శ్రీను, రాజా, తహాశీల్దారు, మధు, అది, వై, శ్రీనివాసు,కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ, కచ్చిత సమాచారంతో నివేదిక..

- డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా
- బీసీల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై ప్రత్యేక దృష్టి
- ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక అంశాలపైనా సమీక్షించిన కమిషన్

ప్రజాభూమి ప్రతినిధి–విజయవాడ

బీసీల సామాజిక, ఆర్థిక పరిస్థితులతో పాటు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, వాటి ప్రభావం, ప్రజాప్రాతినిధ్యం తదితర అంశాలపై వివిధ వర్గాలు అందించిన సమాచారంతో పాటు సమకాలీన, అనుభవాధారిత విచారణ ఆధారంగా శాస్త్రీయ, కచ్చిత సమాచారంతో నివేదిక రూపకల్పన జరుగుతుందని డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా అన్నారు. క్షేత్రస్థాయిలో అందిన వినతులు, సూచనలను సమగ్రంగా పరిశీలించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారికి స్థానిక సంస్థల్లో రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశాలపై అధ్యయనానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన డెడికేటెడ్ కమిషన్ ఛైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా మంగళవారం జిల్లాలో పర్యటించారు. కలెక్టరేట్‌లోని శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశతో కలిసి బీసీ సంక్షేమం, బీసీ కార్పొరేషన్, పాఠశాల విద్య, ఇంటర్మీడియెట్ విద్య, ప్రణాళిక తదితర శాఖల అధికారులతో మాట్లాడారు. జిల్లాలో బీసీ వర్గాలు, సామాజిక ఆర్థిక పరిస్థితులు, ఉన్నత విద్య అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు తదితరాలపై సమీక్షించారు. కొండపల్లి బొమ్మల కళ, కళాకారులు జీవన స్థితిగతులు, ఆధునిక డిజైన్లు తదితరాల గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటుతో పాటు ఇటీవల జిల్లా అధికార యంత్రాంగం తీసుకుంటున్న చొరవను అధికారులు వివరించారు. జిల్లాలో



జరిగిన ఏకీకృత కుటుంబ సర్వే (యూఎఫ్ఎస్) గురించి కూడా స్వర్ణగ్రామం, వార్డు అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.బీసీ సంఘాలు, సామాజిక సంస్థలు, ప్రజా సంఘాలు, మేధావులు, ఇతర సంబంధిత వర్గాల వారు వారి అభిప్రాయాలు, వ్యక్తిగత సూచనలు, వినతిపత్రాలను, లిఖిత పూర్వక అభిప్రాయాలను రాజీవ్ రంజన్ మిశ్రా స్వీకరించారు. ముదిరాజ్ సంఘం నుంచి సీహెచ్ మల్లయ్య.. ముదిరాజ్‌లను బీసీ–డీ గ్రూపు నుంచి బీసీ–ఏ గ్రూపులోకి మార్చాలని కోరారు. ఎన్.కృష్ణసింగ్.. బొందిలి కులాన్ని సెంట్రల్ ఓబీసీ లిస్టులో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. కుమ్మరి శాలివాహన సంఘం నుంచి కోగంటి హనుమయ్య ఎన్టీఆర్ జిల్లా, నందిగామ మండలం, ఐతవరం గ్రామ పంచాయితీని బీసీ రిజర్వేషన్ పంచాయితీగా మార్చాలని కోరారు. కూరపాటి కాటంరాజు.. భట్రాజు కులాన్ని బీసీ–డీ గ్రూపు నుంచి బీసీ–ఏ గ్రూపునకు మార్చాలని కోరారు. రజక అభ్యుదయ సంఘం అధ్యక్షులు వల్లూరు మధుసూదన్‌రావు స్థానిక సంస్థల ఎన్నికల్లో రజక కులం వారికి ప్రాధాన్యమివ్వాలని కోరారు.కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం, బీసీ సంక్షేమం, సాధికారత అధికారి ఇ.జగ్గయ్య, డీఈవో ఎల్.చంద్రకళ, డీఐవో ప్రభాకర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు, ఆస్తి వారి హక్కులను కాపాడడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామములో రైతుల మీ భూమి–మీ హక్కు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో 430, మంది రైతులు, భూయజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను సబ్ కలెక్టర్ బి, వినూత్న నాయకులతో కలిసి పంపిణీ చేశారు. 90 శాతం పాసుపుస్తకాలు పంపిణీ చెయ్యడం జరిగిందని, మిగిలినవి త్వరితగతిన పంపిణీకి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మొత్తం పాసు పుస్తకాలు త్వరలో పంపిణీ చేయాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా సబ్, కలెక్టర్ మాట్లాడుతూ రైతులు భూహక్కులు పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని, అందుకు అనుగుణంగా సర్వేపూర్తి అయిన ప్రతి రైతుకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. అధికారులు అలసత్వం, నిర్లక్ష్యం తొలగించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి నెల ఒక గ్రామానికి వెళ్ళి పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీచేస్తున్నారని, నియోజకవర్గ ములో సుమారు. 44గ్రా



మాల్లో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందజేసామన్నారు.త్వరలో మిగిలిన గ్రామాలు అందజేస్తామని తెలిపారు.రాష్ట్ర అగ్రికల్చర్ వైస్ చైర్మన్ ఎమ్, శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో, నియోజవర్గం, గ్రామాల్లో వైసీపీ పార్టీవారు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ప్రజలు నమ్మరని, మనమంతా తిప్పికొట్టాలని అన్నారు. గత పాలకులు చిచ్చుపెట్టి భూవివాదాలు సృష్టించి, రికార్డులు తారుమారు చేశారన్నారు. ల్యాండు టైటిలింగు యాక్టు పేరిట ఓ నల్ల చట్టం తెచ్చి భూమి కాజేసేందుకు గత పాలకులు ప్రయత్నాలు చేశారని తెలిపారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన భూమి రికార్డులను ప్రైవేటుకు అప్పగించే ప్రయత్నం చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ల్యాండు టైటిలింగు యాక్టును తక్షణం రద్దుచేసి భూమి యాజమాన్య హక్కుల్ని రక్షించామని అన్నారు. భూమి మీదైతే ఫోటోలు వారివి ముద్రించుకుని, పొలం సరిహద్దు రాళ్లపై కూడా బొమ్మలు ముద్రించు కున్నారని అన్నారు. రీ సర్వే చేయటంతో పాటు రైతుల్ని భాగస్వాములను చేసి వివరాలను తనిఖీ చేసి, ఈకేవైసీ చేశాక పట్టాదారు పాసుపుస్తకాలు ముద్రించి రైతులకు అందిస్తున్నామని అన్నారు. తప్పులు లేకుండా పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేస్తున్నామని అన్నారు. ప్రతి నెలా వచ్చి నేరుగా భూయజమానుల్ని, రైతులను కలిసి ఈ పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ చేసిన దుర్మార్గాన్ని పరిష్కరిస్తూ, భూ రికార్డులను ప్రక్షాళన చేసేందుకు 3 ఏళ్ల సమయం పట్టిందని అన్నారు. ఈ సందర్భంగా పట్టాదారు పాసు పుస్తకంలో గల క్యూఆర్ కోడ్ లను వివరిస్తూ వాటిని స్కాన్ చేసినట్లయితే పట్టాదారు వివరములు, భూమి వివరాలు విస్తీర్ణం, స్కెచ్ మరియు రూటు మ్యాప్, శాటిలైట్ ఇమేజి కూడా చూసుకొనవచ్చునని శ్రీనివాసరెడ్డి రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఏపి అగ్రికల్చర్ మిషన్ వైస్–చైర్మన్ మరియు నూజివీడు నియోజకవర్గ పరిశీలకులు ఎమ్,శ్రీనివాసరెడ్డి,సబ్, కలెక్టర్, బి, వినూత్న, ఏ, ఎమ్, సి,చైర్మన్, కె, అరుణ, మాజీ ఏ, ఎమ్, సి,చైర్మన్ కె, శ్రీను, రాజా, వై, శ్రీనివాసు, అది, మధు, చందు, తహాశీల్దారు, మండల , వివిధ శాఖలు అధికారులు, గ్రామ సచివాలయం, రెవిన్యూ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, మండల, గ్రామ నాయకులు, రైతులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సుంకర శత జయంతి వేడుకలు

ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

కృష్ణా జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షులు సుంకర సత్యనారాయణ శతజయంతి కార్యక్రమం నూజివీడు మండలంలోని వెంకటాద్రి పురం గ్రామంలో ఘనంగానిర్వహించారు.అన్నవరం గ్రామ ఎంపీటీసీ దువ్వూరి వెంకయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా గ్రామంలోని సుంకర విగ్రహానికి ఆయన కోడలు విశాలాక్షి,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు పూలమాలలు వేసిని వాళులర్పించారు.అనంతరం జరిగిన సభలో చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ నిబద్ధతగల నేతగా సుంకర వ్యవహరించే వారన్నారు.కృష్ణాజిల్లా అభివృద్ధిలో ఆయన పాత్ర చిరస్మరణీయమన్నారు.సొంత ఆస్తులను సైతం ప్రజల వినియోగార్ధం త్యాగం చేసిన



చరిత్ర సుంకర ది అన్నారు.ఎంతోమంది నేతలను తయారు చేసిన ఘనత సుంకర సత్యనారాయణకు దక్కుతుందని ఆయన పేర్కొన్నారు. నేటి రాజకీయాలలో సుంకర సత్యనారాయణ వంటి నేత మచ్చుకైనా కానరావడం లేదని,ఎటువంటి స్వార్థం లేకుండా ప్రజాసేవ చేసిన సుంకర సత్యనారాయణ ఆదర్శనీయుడు అన్నారు.

సుంకర కుటుంబ సభ్యురాలు, ఆయన కోడలు విశాలాక్షి మాట్లా డుతూ వెంకటాద్రి పురం గ్రామంలో గ్రామ అభివృద్ధి కోసం సుంకర సత్యనారాయణ చూపిన బాటలో తమ కుటుంబం చేయూత నందిస్తుందని పేర్కొన్నారు.ఈ శత జయంతి సందర్భంగా గ్రామంలోని యూపీ స్కూల్, అంగన్వాడి విద్యార్థులకు విద్యావసరాలు నిమిత్తం పుస్తకాలు,ఇతర సామాగ్రిని అందించారు. సుంకర సత్యనారాయణ గారు పుట్టింది పెరిగింది ఉంగుటూరు మండలం పునుగుమోడైన ఈ వెంకటాద్రి పురం గ్రామానికి బంధుత్వం సన్నిత సంబంధాలు ఉన్నాయని వారి భూములు కూడా ఇక్కడ ఉండే అని ఈ గ్రామాల్లో బడికి, గుడికి,పాల కేంద్రం,ఆసుపత్రికి పిల్లలు ఆడుకోవడానికి ఆటో స్థలము ఉచితంగా అందజేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వేములపల్లి శ్రీమన్నారాయణ, చలసాని సూర్యనారాయణ, అక్కినేని సుబ్రమణ్యం, ఆలూరి రాఘవరావు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ



ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

నూజివీడు మండలానికి చెందిన కొంతమంది దివ్యాంగులకు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సహకారంతో 10 ట్రై సైకిళ్లను తెలుగుదేశం పార్టీ నాయకుల చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా లబ్ధిదారులు మంత్రి శ్రీ కొలుసు పార్థసారథి గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమలాంటి దివ్యాంగుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# డెంగ్యూ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి : డాక్టర్ ఎం నవ్య జీవన్.

ప్రజాభూమి ప్రతినిధి–పాలకొల్లు

లంకల కోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఎం నవ్య జీవన్ ఆధ్వర్యంలో ఆశాడే సందర్భంగా డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నవ్య జీవన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటిస్తూ నీటి నిల్వలు లేకుండా చూసుకొని దోమలు పెరుగుదలని అరికట్టుకుంటే డెంగ్యూ వ్యాధి నుంచి రక్షింపబడతారని తెలిపారు. నీటి నిల్వలు ఉన్న చోట దోమలు గుడ్లు పెట్టి లార్వా లు దోమలుగా తయారవుతాయి అని ఈ దోమలు ద్వారా డెంగ్యూ వ్యాధి ప్రబలే ప్రమాదం ఉన్నదని.ఈ వ్యాధి బారిన పడటం వలన రక్త కణాలు తగ్గిపోవటం వలన ప్రాణాలకే ప్రమాదం ఏర్పడి పరిస్థితి ఉన్నదని తెలిపారు. ఈ వ్యాధిలో విపరీతమైన జ్వరం. కనుగుడ్లు కదిలించలేకపోవుట. ఒంటిమీద ర్యాష్ దద్దుర్లు వచ్చుట. రక్తకణాలు తగ్గిపోవుట. ఒంటి నొప్పులు తదితరు లక్షణాలు కనిపించిన ఎడల వెంటనే డెంగ్యూ పరీక్ష చేయించుకుని చికిత్స చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి దినేష్ ఆరోగ్య



విస్తరణ అధికారి గుడాల హరిబాబు పీహెచ్ఎన్ పి ఎలిజిబెత్ సూపర్వైజర్లు ఎస్ కె అమలేశ్వరరావు జి ఉదయ్ చందర్ గంగాభవాని ఎస్ టి ఎస్ సత్తిబాబు ఎస్ టి ఎల్ ఎస్ లక్ష్మీనారాయణ ల్యాబ్ టెక్నీషియన్లు సిహెచ్ ప్రసాదు. కే రమణ. హెల్త్ అసిస్టెంట్లు ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు ట్రైనీ జిఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు